PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 164 | విజయవాడ, గురువారం 16 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 16 January 2025 | Rs



విజయవాడ బస్టాండ్‌లో రద్దీ

తిరుగు ప్రయాణం

- పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ

2

ప్రతీక, స్మతి మంధాన సెంచరీలు



- ఐర్లాండ్‌పై 304 పరుగుల తేడాతో గెలుపుతో రికార్డు పుటల్లోకి..
- వన్డే సిరీస్ 3-0తో భారత్ క్లీన్‌స్వీప్

5

ఎనిమిది కిలోమీటర్ల డోలీమోత

- రహదారి సదుపాయం లేక నిండుగర్భిణి అవస్థ
- పాపకు జన్మనిచ్చిన మహిళ



ప్రజాశక్తి - సీలేరు (అల్లూరి జిల్లా)

రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదు. పురిటి నొప్పులు వచ్చిన గర్భిణులను, అస్వస్థతకు గురైన బాలింతలను ఆస్పత్రికి తరలించాలంటే డోలీ కట్టాల్సిందే. ఎన్ని ప్రభుత్వాలు గిరిజనుల తలరాతలు మాత్రం మారడం లేదు. గిరి గ్రామాలన్నింటికీ రహదారుల కల్పన పాలకుల నోటిమాటగానే మిగిలింది. వెరసి ఆదివాసీలకు అవస్థలు తప్పడం లేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీలో డోలీ మోతలు నిత్యకృత్యమయ్యాయి. తాజాగా ఓ గర్భిణిని ఎనిమిది కిలోమీటర్ల మేర డోలీపై తీసుకువెళ్లారు. సరైన రోడ్డు సదుపాయం లేక, అంబులెన్స్ వచ్చే వీలు లేకపోవడంతో కుటుంబీకులు డోలీపై తీసుకువచ్చిన ఘటన మంగళవారం జిల్లాలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు..

జికె.వీధి మండలం దేవరపల్లి పంచాయతీ గూనలంక గ్రామానికి చెందిన నిండు గర్భిణి గెమ్మెల దేవికి ప్రసవ సమయం కావడంతో పురిటినొప్పులు వచ్చాయి. ఆ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో అంబులెన్స్ వచ్చే వీల్లేకుండా పోయింది. దీంతో గూనలంక నుంచి ఆర్‌వి.నగర్ వరకూ సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర ఆమెను డోలీ మోతతో తీసుకొచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో చింతపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సుఖప్రసవం అనంతరం పాపకు జన్మనిచ్చారు.

దల్లేవాల్‌కు మద్దతుగా 111 మంది నిరవధిక దీక్ష

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ రైతు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ గత 50 రోజులుగా కొనసాగిస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు మద్దతుగా 111 మంది పంజాబ్ రైతులు దీక్ష మొదలుపెట్టారు. హర్యానాలోని ఖనౌరి సరిహద్దుల్లో నల్ల దుస్తులు ధరించి బుధవారం నిరసనకు దిగారు. రైతుల దీక్షను అడ్డుకునేందుకు హర్యానా సరిహద్దు సమీపంలో భారీగా పోలీసుల్ని మోహరించారు. దల్లేవాల్ నిరవధిక దీక్ష బుధవారం నాటితో 50వ రోజుకు చేరుకుంది. ఆయన కేవలం నీళ్లు సేవిస్తూ ఇన్నాళ్లు గడిపారు. ఇప్పుడు నీళ్లు తాగడం కూడా ఇబ్బందిగా మారినట్లు రైతులు పేర్కొన్నారు. అవయవాలు దెబ్బతినే అవకాశం ఉన్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. రైతు నేత దల్లేవాల్ ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు డాక్టర్లు చెప్పారు. ఆయనకి కీటోన్ స్థాయి ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. మజిల్ మాస్ కూడా పడిపోయినట్లు వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి 111 మంది రైతులు కొత్తగా నిరవధిక దీక్షకు దిగినట్లు రైతు నేత అభిమన్యు కోహర్ తెలిపారు. దల్లేవాల్ కన్నా ముందే తమ ప్రాణాలు బలి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ రైతులు చెప్పారు.

దల్లేవాల్ రక్త పరీక్షల రిపోర్టులివ్వండి : సుప్రీం కోర్టు

రైతుల పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత దల్లేవాల్ ఆరోగ్యం 'స్థిరంగా' ఉందని పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం చెప్పడంతో సుప్రీంకోర్టు ఆయన రక్త పరీక్షల ఫలితాలను అందజేయాలని ఆదేశించింది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పంజాబ్ ప్రధాన కార్యదర్శిని డిసెంబర్ 19, డిసెంబర్ 24, డిసెంబర్ 30, జనవరి 3, జనవరి 9, జనవరి 14 తేదీల్లో దల్లేవాల్ కు నిర్వహించిన రక్త పరీక్షల రిపోర్టును ఇవ్వాలని ఆదేశించింది. వీటిపై ఢిల్లీలోని ఎయిమ్స్ డైరెక్టర్ ప్రతిపాదించిన వైద్య బోర్డు నుండి నిపుణుల అభిప్రాయాన్ని తీసుకోవాలని సలహా ఇచ్చింది. పంజాబ్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు.

రూ.1000 కోట్లు !

- పండుగ మూడురోజులు కోడి పందేలు
- జోరుగా గుండాట, పేకాట, కోతాట
- బరుల వద్దనే ఏరులై పారిన మద్యం





రామవరప్పాడు సమీపంలో పందాలు, అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోనలో డబ్బుకట్టలతో పందెంరాయుడు

ప్రజాశక్తి - యంత్రాంగం


సంక్రాంతి మూడురోజులు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లాలో జోరుగా కోడి పందేలు సాగాయి. ఈ మూడు రోజుల్లో రూ.800 కోట్లు చేతులు మారినట్లు సమాచారం. దీనికి తోడు గుండాట, పేకాట, కోతాట కూడా యథేచ్ఛగా సాగాయి. ఇంచుమించుగా రూ.వెయ్యి కోట్ల మేర చేతులు మారాయని అంచనా. ఈ సారి బరుల వద్దే మద్యం ఏరులై పారింది. పలుచోట్ల బరుల నిర్వహణకు రాజకీయ పార్టీ నేతలే వేలం పాట నిర్వహించడం గమనార్హం.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రిపూట కూడా పందేలు కొనసాగాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బరుల సంఖ్య పెరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో పెద్ద బరులు ఒకటి లేదా రెండు మాత్రమే ఉండేవి. ఈసారి అందుకు భిన్నంగా మండల స్థాయిలోనే రెండు, మూడు పెద్ద బరులు ఏర్పాటు చేయడం గమనార్హం. జిల్లాలో పలుచోట్ల బరుల నిర్వహణకు రాజకీయ పార్టీ నేతలు వేలం పాట నిర్వహించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

కాళ్ల మండలం పెద అమిరంలో కోడి పందేల బరిలోకి రావడానికి ఎంట్రీ కార్డుపై స్థానిక ఎమ్మెల్యే ఫొటో ముద్రించారు. చీప్ లిక్కర్ నుంచి ఖరీదైన మద్యం వరకు అన్నీ అందుబాటులో ఉంచారు. ఇక్కడ పందేలను డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఏలూరు ఎంపి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ వీక్షించారు. ఇరగవరం మండలం కొత్తపాడు గ్రామంలో మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అనుచరులైన రామభద్రరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బరిని పోలీసులు ముందు నుంచి అడ్డుకుంటూనే వచ్చారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆందోళన చేయగా సోమవారం సాయంత్రం అనుమతిచ్చినా మంగళవారం ఉదయం మిగతా 2లో

'పర్యావరణం' బేఖాతర్!

- అదాని డేటా సెంటర్‌కు గ్రీన్‌సిగ్నల్



2019 ఫిబ్రవరిలో అదాని డేటా సెంటర్, టెక్నాలజీ పార్కుకు భూమిపూజ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - విశాఖపట్నం

'రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా...' అన్నట్లు విశాఖలో ఏర్పాటు చేయతలపెట్టిన అదాని డేటా సెంటర్‌కు పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించి మరీ అనుమతులు మంజూరు చేశారు. ఈ మేరకు స్టేట్ ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్ఇఐఎ) కొద్దిరోజుల క్రితం నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ ప్రాజెక్టు పనులు ఇక వేగంగా ప్రారంభమౌతాయని భావిస్తున్నారు. మధురవాడకు సమీపంలోని కొండమీద అదాని డేటాసెంటర్‌తో పాటు సమగ్ర ఐటిపార్కు, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్శిటీకి 200 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిన సంగతి తెలిసిందే.20 వేల కోట్ల రూపాయల పెట్టుబడి అంచనాతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టుకు సమీపంలోనే కంబాలకొండ వన్యప్రాణ సంరక్షణ కేంద్రం ఉండటంతో పర్యావరణానికి, జీవవైవిధ్యానికి హాని కలుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే, గత జనవరిలోనే ఈ డేటా సెంటర్ ఏర్పాటుకు విశాఖపట్నం అటవీశాఖ 'నో అబ్జెక్షన్' సర్టిఫికేట్ ఇచ్చినట్లు సమాచారం. 'ప్రతిపాదిత ప్రాజెక్టు కంబాలకొండ వన్యప్రాణ సంరక్షణ కేంద్రానికి, ఎకో సెన్సిటివ్ జోన్‌కు హద్దులు అవతలే ఉంది. దీనివల్ల పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి ఎటువంటి హాని లేదు.' అంటూ అటవీశాఖ అధికారులు నివేదించినట్లు తెలిసింది. ఈ నివేదిక అధారంగా ఎస్ఇఐఎ తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు చెబుతున్నారు.

నిబంధనల ఉల్లంఘన ఇలా..

2017 నాటి పర్యావరణ ఉత్తర్వులు రక్షిత ప్రాంతానికి, దాని ఎకో సెన్సిటివ్‌జోన్‌కు ఒక కిలోమీటర్ వరకు వాణిజ్య సంస్థల నూతన నిర్మాణాలను పూర్తిగా నిషేధించింది. ఎటువంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకుగానూ రక్షితప్రాంతం, ఎకో సెన్సిటివ్‌జోన్‌లలో ఏది దగ్గరైతే దానిని పరిగణలోకి తీసుకుని కిలోమీటరు దూరాన్ని లెక్కించాలని పేర్కొంది ఈ కీలకమైన నిబంధనను పర్యావరణ శాఖ విస్మరించింది.కంబాలకొండ వన్యప్రాణ సంరక్షణ కేంద్రానికి అదాని తలపెట్టిన డేటా సెంటర్ కిలోమీటర్ లోపే ఉండటం గమనార్హం. సంరక్షణ కేంద్రం నుండి 970 మీటర్ల దూరంలోనే ఈ కేంద్రాన్ని అదాని గ్రూపు ప్రతిపాదించింది. అంటే పర్యావరణం, జీవ వైవిధ్యం పరంగా సున్నితమైన ప్రాంతంలోకి 30 మీటర్ల దూరం అదాని డేటా సెంటర్ చొచ్చుకువస్తోంది. సామాన్యులకైతే పర్యావరణ చట్టాలను, నిబంధనలు నూరుశాతం అమలు చేస్తారు. అదానికి సంబంధించిన ప్రాజెక్టు కావడంతో ఆ 30 మీటర్ల పరిధిలో బఫర్ జోన్ నిర్వహించాలని పేర్కొంటూ పర్యావరణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

రోజుకు 26.44 లక్షల లీటర్ల నీటి వినియోగం

ప్రతిపాదిత డేటా సెంటర్ రోజుకు 26,44,000 లీటర్ల నీటిని వినియోగించనుంది. దీనిలో 14.69 లక్షల లీటర్ల నీటిని విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ సరఫరా చేయనుంది. ఈ నీటిని రీ సైకిల్ చేయడం ద్వారా మిగిలిన నీటిని డేటా సెంటర్ వినియోగించుకుంటుందని చెబుతున్నారు. 1600 కిలోలీటర్ల సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంటును అదాని సంస్థ ఇక్కడ ప్రతిపాదించింది. వృద్ధా నీటిని రీసైకిల్ చేసి గృహావసరాలకు, గ్రీన్‌బెల్ట్‌కు వాడతామని ఆ సంస్థ తెలిపింది.

ధాన్యానికి రూ.500 బోనస్

రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేడు మార్కెట్లో కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర కన్నా తక్కువ ధరకు కొంటున్నారని, దీంతో రైతులు నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, డీజిల్ తదితర ఇన్‌పుట్స్ ధరలు ఎప్పుడూ లేనంతంగా పెరగడంతో రైతులు కష్టనష్టాల పాలవుతున్నారని పేర్కొన్నారు. మరోవైపు అకాల అధిక వర్షాలు, తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలు, రైతులను, కౌలు రైతులను వెంటాడుతూన్నాయని, ఫలితంగా పండించిన పంటకు రక్షణ లేకుండా పోయిందన్నారు.. ఇన్‌పుట్స్ ధరలు పెరగడం బ్యాంకుల నుండి అవసరమైన పరపతి లభించకపోవడం, మద్దతు ధరలు సరిపోకపోవడంతో సాగు ఖర్చులు విపరీతంగా పెరిగి కౌలు రైతుల, సన్న చిన్నకారు రైతులు అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫారసు ప్రకారం మద్దతు ధరలు ఇవ్వాలని, ఆ మేరకు చట్టం చేయాలని, ఢిల్లీ కేంద్రంగా పెద్దఎత్తున ఆందోళన జరుగుతున్న విషయాన్ని ప్రకటనలో శ్రీనివాసరావు గుర్తుచేశారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా కేరళ ప్రభుత్వం క్వింటాకు వరికి రూ.800, పక్కనున్న తెలంగాణా ప్రభుత్వం రూ.500, చత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.400 బోనస్‌గా ప్రకటించి అక్కడ రైతులను ఆదుకుంటున్నాయని తెలిపారు. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల్లో రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చిందని, అది నేటికీ అమల్లోకి రాలేదని తెలిపారు. పొరుగు రాష్ట్రాలు ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వమూ కనీస మద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన దానికి ఆదనంగా రూ.500 ఇవ్వాలని కోరారు.

నూతన వరివిత్తన పరిశోధనపై కేంద్రీకరించాలి

ప్రకృతిలో వాతావరణ మార్పులు వేగంగా తీవ్రంగా చోటుచేసుకుంటున్నాయని, వీటి ప్రభావం వ్యవసాయంపై ఎక్కువగా పడుతోందని, సీజన్లు కూడా కొంత మారుతున్నాయని వివరించారు. ఈ వాతావరణ మార్పులను తట్టుకునేటట్లు నూతన విత్తనాలు రూపొందించాల్సిన అవసరం ఉందని వివరించారు. రాష్ట్రంలో గత పది సంవత్సరాల నుండి వరిలో కొత్త విత్తనాలు ఆవిష్కరణ జరగలేదని, ఫలితంగా పునరుత్పత్తి శక్తి కూడా తగ్గిపోతోందని తెలిపారు. దీంతో దేశ అవసరాలకు సరిపడా ఉత్పత్తి కూడా చేయకపోయే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. తెలంగాణా మిగతా 2లో

పెనుకొండలో అమానుషం..!

- మహిళను వివస్త్రను చేసి, జుట్టు కత్తిరించిన వైనం

ప్రజాశక్తి-పెనుకొండ

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలో అమానుష ఘటన చోటు చేసుకుంది. ప్రేమ జంటకు సహకరించిందన్న కారణంతో ఓ వివాహితను వివస్త్రను చేసి జుట్టు కత్తిరించారు. ఈ సంఘటన పెనుకొండ మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామంలో ఇటీవల ఓ ప్రేమ జంట ఇల్లు వదలి పారిపోయారు. వీరికి అదే గ్రామంలో నివాసముంటున్న మహిళ సహకరించిందనే నెపంతో ప్రేమికురాలి తల్లిదండ్రులు, బంధువులతో పాటు దాదాపు 22 మంది ఆమె ఇంటిపై దాడి చేశారు. చీర లాగి, జుట్టు కత్తిరించారని బాధితురాలు వాపోయారు. ఆమెకు పెనుగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ తెలిపారు.

ఢిల్లీలో మళ్లీ వాయుకాలుష్యం

- కఠిన నిబంధనలు అమలు

న్యూఢిల్లీ : ఢిల్లీ మరోసారి వాయు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. వాయు నాణ్యత సూచీ (ఎక్యుఐ) 396కు దిగజారిపోవడంతో కాలుష్య కట్టడి కోసం కఠిన నిబంధనలను తక్షణమే అమలు చేయాలని క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ (సిఎక్యుఎం) నిర్ణయించింది. మంగళవారం ఎక్యుఐ 275 ఉండగా, బుధవారం సాయంత్రానికి 396కు పెరిగింది. దట్టమైన పొగమంచు, కనిష్ట ఉష్ణోగ్రతల నమోదు వంటి పరిస్థితుల కారణంగా నాణ్యత పడిపోయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వాయు నాణ్యత 400 దాటే అవకాశముందని భారత వాతావరణ విభాగం అంచనా వేసిన నేపథ్యంలో జిఆర్‌ఎపి - 3, 4 ఆంక్షలు అమలు చేయాలని సిఎక్యుఎం ఆదేశాలు జారీ చేసింది. జిఆర్‌ఎపి - 4 కింద నిర్మాణ సంబంధిత కార్యకలాపాలపై తాత్కాలిక నిషేధం, 10, 12 తరగతులు మినహా మిగతా విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు తదితర చర్యలు తీసుకుంటారు. పొగమంచు, ఎయిర్ క్వాలిటీ పడిపోవడంతో పలు రైళ్లు, విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

సిఎం చంద్రబాబుకు ఊరట

- బెయిల్ రద్దు పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు
- విచారణకు సహకరించాలని సూచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. స్కిల్ కేసులో బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరలే నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. ఈ కేసులో ఇప్పటికే చార్జిషీట్ ఫైల్ చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గి ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. చార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ రద్దు పిటిషన్‌లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని జస్టిస్ బేలా త్రివేది వెల్లడించారు. 2023 నవంబర్‌లో చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్‌ను రద్దు చేయాలంటూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో పిటిషన్ వేసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ బుధవారం ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది.

అవసరమైన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు ధర్మాసనం సూచించింది. ఈ కేసులో ఎపి హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని ఒక జర్నలిస్టు ఇంప్లీడ్ పిటిషన్ వేయగా, దాన్ని కొట్టివేస్తూ ఆ జర్నలిస్టుపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. "అసలు ఈ కేసుకు మీకు సంబంధం ఏంటి? మీరెందుకు ఇందులో జోక్యం చేసుకున్నారు" అంటూ మందలించింది.



ఎట్టకేలకు యూన్ అరెస్టు

6

భగవత్ వ్యాఖ్యలు దేశద్రోహం కిందకు వస్తాయి

ఎఐసిసి నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో రాహుల్‌గాంధీ

7

లండన్ పర్యటనకు జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లండన్ పర్యటనకు వెళ్లారు. తమ రెండో కుమార్తె వర్షారెడ్డి పట్టా ప్రదానోత్సవానికి జగన్ దంపతులు హాజరు కానున్నారు. వర్షారెడ్డి కింగ్స్ కాలేజ్ ఆఫ్ లండన్‌లో ఎంఎస్ (ఫైనాన్స్) కోర్సు డిస్టింక్షన్లో ఉత్తీర్ణులయ్యారు. గురువారం కింగ్స్ కాలేజ్‌లో పట్టా ప్రదానోత్సవం జరగనుంది. ఈ నెలాఖరున జగన్ తిరిగి రాష్ట్రానికి రానున్నారు. తనకు విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలని సిబిఐ కోర్టును కోరిన నేపథ్యంలో నెలాఖరు వరకూ కోర్టు అనుమతి ఇచ్చింది.

కాల్పుల విరమణ ఒప్పందం ఖరారు

- కీలక అధికారి వెల్లడి
- బందీల విడుదల ఒప్పందం కుదిరిందన్న ట్రంప్

గాజా : ఇజ్రాయిల్ - హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఖరారైనట్లు చర్చల్లో మధ్యవర్తిత్వం వహించిన ఓ కీలక అధికారి తెలిపారు. అయితే కొన్ని సాంకేతికపరమైన చిక్కుల వల్ల ఒప్పందం వెల్లడి జాప్యం జరుగుతోందని పేరు తెలపడానికి ఇష్టపడని ఆ అధికారి రాయిటర్స్ వార్తా సంస్థకు తెలిపారు. దీంతో గత పదిహేను మాసాలుగా గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండకు తెరపడే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో ట్వీట్ చేస్తూ, బందీల విడుదల ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. అయితే, ఇజ్రాయిల్ కేబినెట్ ఆమోదం తెలిపిన వెంటనే కాల్పుల విరమణ, బందీల విడుదల ఒప్పందం అమల్లోకి వస్తుందని అమెరికన్ అధికారి ఒకరు తెలిపారు. ఖతార్‌లో గత కొన్ని వారాలుగా హమాస్, ఇజ్రాయిల్ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల్లో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఆ ముసాయిదా ఒప్పందం ప్రకారం, గాజాలో ఆరు వారాల పాటు కాల్పుల విరమణ వుంటుంది. ఈ కాలంలోనే హమాస్ చెరలో వున్న ఇజ్రాయిల్ బందీలు, అలాగే ఇజ్రాయిల్ జైళ్లలో వున్న వందలాదిమంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాల్సి వుంటుంది. మొదటి దశలో ఇజ్రాయిల్ బలగాలు గాజా నుండి వైదొలగాలి. ఉధృత దాడుల కారణంగా ఇళ్లు వీడి వెళ్లిన పాలస్తీనియన్లు తిరిగి వెనక్కి రావాల్సి వుంటుంది. మొదటి దశ తర్వాత కూడా కాల్పుల విరమణ అమల్లో వుంటుందా లేదా అన్నది ప్రశ్నగా మిగిలివుంది. రాబోయే వారాల్లో మరిన్ని చర్చలు జరగాల్సి వుంది. ఆ చర్చల ఫలితంపై ఇదంతా ఆధారపడి వుంటుంది. గాజా పాలనకు సంబంధించి నెలకొల్పాల్సిన యంత్రాంగం పై కూడా తేల్చుకోవాల్సి వుంటుంది. రెండో దశ ప్రారంభం కావడానికి ముందు ఈ 42 రోజుల్లో ఎలాంటి ఒప్పందం లేకపోతే గాజాపై మళ్లీ ఇజ్రాయిల్ దాడులు పునరుద్ధరించవచ్చు. ఈ ముసాయిదాకు హమాస్ అంగీకరించిందని ఇద్దరు అధికారులు ధ్రువీకరించారు. దీనిపై ఇంకా కసరత్తు జరుగుతోందని ఇజ్రాయిల్ చెబుతోంది.

గత 24గంటల్లో 62 మంది పాలస్తీనీయుల బలి

తాజాగా గాజాలోని ఇళ్లు, పాఠశాలలపై ఇజ్రాయిల్ సైన్యం దాడులకు దిగింది. గత 24 గంటల్లో 62 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 46,707 మంది పాలస్తీనియన్లు మృతి చెందగా, 110,265 మంది గాయపడ్డారని పేర్కొంది. బుధవారం తెల్లవారు జామున బురీజ్ శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ దళాలు దాడి చేశాయని మీడియా వర్గాలు పేర్కొన్నాయి.

కువైట్ బాధితురాలికి లోకేష్ సాయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఏజెంట్ చేతిలో మోసపోయి కువైట్‌లో చిక్కుకున్న మహిళను విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ క్షేమంగా ఇంటికి చేర్చారు. తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం గ్రామానికి చెందిన వరగంటి సుగుణ జీవనోపాధి కోసం కువైట్ వెళ్లారు. అక్కడకు వెళ్లిన అనంతరం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న ఆమె గత నెల చివరి వారంలో 'ఎక్స్'లో తాను ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరిస్తూ మంత్రి లోకేష్‌ను సాయం కోరారు. తనను కువైట్ పంపించిన ఏజెంట్ మోసం చేసినట్లు పేర్కొన్నారు. అనారోగ్యం బారినపడటంతోపాటు తిండిలేక అల్లాడుతున్నానని, తనను రక్షించి స్వస్థలానికి పంపాలని కోరారు. మంత్రి లోకేష్ ఆదేశాలతో ఆయన టీమ్ సుగుణకు అవసరమైన సాయమందించి రాష్ట్రానికి తీసుకువచ్చి, కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. సుగుణ, ఆమె కుటుంబ సభ్యులు మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జెడిలుగా పదోన్నతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాశాఖలో జిల్లా విద్యాశాఖ అధికారులు / ఉప సంచాలకులు (డిడి)గా పని చేస్తున్న నలుగురు అధికారులకు సంయుక్త సంచాలకులు (జెడి)గా తాత్కాలిక పదోన్నతిని ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాశాఖ పదోన్నతుల కమిటీ ఈ నెల 2వ తేదీన సమావేశమై ఎస్.అబ్రహం, కె.శామ్యుయేలు, పి.శైలజ, తహేలా సుల్తానాలు పదోన్నతులకు అర్హులుగా నిర్ణయించింది. కమిటీ నిర్ణయం మేరకు నలుగురు అధికారులకు జెడిలుగా తాత్కాలిక పదోన్నతి కల్పించారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో జెడిలుగా ఎస్.అబ్రహం, పి.శైలజను నియమించగా, కె.శామ్యుయేలును కడప ఆర్‌జెడిగా, తహేరా సుల్తానాను మోడల్ స్కూల్స్ జెడిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భారత్, అమెరికా వ్యతిరేక తీవ్రవాద కార్యకలాపాలపై ఉన్నత స్థాయి విచారణ

న్యూఢిల్లీ : భారత్, అమెరికా భద్రతా ప్రయోజనాలను దెబ్బతీస్తున్న కొన్ని సంఘటిత క్రిమినల్ గ్రూపులు, తీవ్రవాద సంస్థల కార్యకలాపాలపై ఉన్నతస్థాయి విచారణా కమిటీ తన నివేదికను అందజేసింది. ఖలిస్తానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్‌ను భారతీయ ఏజెంట్లు హత్య చేసేందుకు ప్రయత్నించారని అమెరికా ఆరోపించిన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఈ దర్యాప్తుకు ఆదేశించింది. సుదీర్ఘమైన విచారణ అనంతరం ఒక వ్యక్తిపై లీగల్ చర్యకు కమిటీ సిఫార్సు చేస్తున్నట్లు హోం శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ లీగల్ చర్య త్వరగా పూర్తి చేయాలని కూడా కమిటీ సిఫార్సు చేసింది. ఆ వ్యక్తి క్రిమినల్ సంబంధాలు, పూర్వాపరాలు ఈ విచారణ సందర్భంగా వెలుగులోకి వచ్చాయని పేర్కొంది. చర్యలు తీసుకున్న ఆ వ్యక్తి పేరును హోం శాఖ వెల్లడించలేదు. వ్యవస్థల పనితీరులో కొంత మెరుగుదల వుండాలని కమిటీ సూచించింది. ఇటువంటి వ్యవహారాలను ఎదుర్కొనే సమయంలో సమన్వయ కార్యాచరణకు, వ్యవస్థాగతమైన నియంత్రణలకు హామీ కల్పిస్తూ భారతదేశ విశ్వసనీయతను బలోపేతం చేసేలా చర్యలు వుండాలని సూచించింది. భారత్, అమెరికా భద్రతా ప్రయోజనాలను దెబ్బతీస్తున్న కొన్ని క్రిమినల్ గ్రూపులు, తీవ్రవాద సంస్థలు, మాదకద్రవ్యాల రవాణాదారుల కార్యకలాపాలపై అమెరికా అధికారులు సమాచారం అందించారని హోం శాఖ తెలిపింది. 2023 నవంబరులో భారత ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణా కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీ తన స్వంత దర్యాప్తు, విచారణలు నిర్వహించింది. అమెరికా అందించిన పలు సమాచారాలను కూడా సమీక్షించింది. అమెరికా అధికారులు పూర్తి సహకారాన్ని అందించారని, ఇరు వైపులా అధికారుల పర్యటనలు కూడా జరిగాయని కమిటీ తెలిపింది. వివిధ సంస్థలకు చెందిన అధికారులు, వారందించిన వివిధ పత్రాలను కూడా పరిశీలించారు.

నాకౌట్‌కు భారత పురుషుల, మహిళల జట్లు

ఖోఖో ప్రపంచకప్

న్యూఢిల్లీ: ఖోఖో ప్రపంచకప్ నాకౌట్‌కు భారత పురుషుల, మహిళల జట్లు దూసుకెళ్లాయి. ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన పోటీల్లో పురుషుల జట్టు గ్రూప్-ఎ రెండో లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు 64-34పాయింట్ల తేడాతో బ్రెజిల్‌ను చిత్తుచేసింది. దీంతో ఈ గ్రూప్‌లో 4పాయింట్లతో టాప్‌లో నిలిచింది. ఇక మహిళల జట్టు గ్రూప్-ఎలో మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో 175-18పాయింట్ల తేడాతో కొరియాను చిత్తుచేసింది. దీంతో 157పాయింట్ల వ్యత్యాసంతో టాప్‌లో నిలిచింది. బుధవారం జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో 100-16పాయింట్ల తేడాతో ఇరాన్‌ను చిత్తుచేసింది. దీంతో మహిళల జట్టు అత్యధిక పాయింట్లతో టాప్‌లో నిలిచి క్వార్టర్స్‌కు అర్హత సాధించింది.

రంజీల్లో శుభ్‌మన్

ముంబయి: ప్రతిష్టాత్మక రంజీట్రోఫీ సీజన్-2025లో శుభ్‌మన్ గిల్ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. ఈ ఏడాది జరిగే రంజీట్రోఫీలో పంజాబ్ తరపున ఆడేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఈ క్రమంలో పంజాబ్-కర్ణాటక మధ్య జరిగే రంజీట్రోఫీ మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉండనున్నాడు. శుభ్‌మన్ గిల్ చివరిసారిగా 2022లో మధ్యప్రదేశ్ తరపున ఆడాడు.

పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు

- రాజధాని పరిసరాల్లో పెరిగిన విక్రయాలు
- సిఆర్‌డిఏ అనుమతి లేకుండానే ప్లాట్లు
- సీడ్ క్యాపిటల్‌లో నష్టపోతున్న రైతులు

పజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. దీన్ని సొమ్ము చేసుకునేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ లేఅవుట్లతో చెలరేగిపోతున్నారు. సిఆర్‌డిఎ నుంచి అనుమతి లేకుండానే వ్యవసాయ భూముల్లో వెంచర్లు వేసి విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో సిఆర్‌డిఎ పరిధిలో అనధికారిక వెంచర్లు భారీగా వెలుస్తున్నాయి.

రాజధానిలో భూ యజమానులు తమ భూముల ధరలను భారీగా పెంచారు. దీంతో పరిసర ప్రాంతాల్లో కొంత మంది గత కొంతకాలంగా వ్యవసాయ భూములుగా ఉన్న పొలాలను వెంచర్లుగా మార్చేస్తున్నారు. అక్రమంగా ఏర్పాటు చేసిన ఈ వెంచర్లపై సిఆర్‌డిఎ అధికారులు దృష్టి సారించారు. రాజధాని పరిధిలో దాదాపు 75 అనధికారిక వెంచర్లు ఉన్నట్లు గత జులైలోనే గుర్తించారు. వీటిల్లో కొన్నింటిని కూల్చి వేయగా.. కొన్నింటిని రాజకీయ ఒత్తిడితో కూల్చకుండా వదిలేశారు. ఈ వెంచర్లలో స్వల్పంగా రోడ్లు వేసి, స్తంభాలు పాతి, జెండాలు కట్టి కొనుగోలుదారులను ఆకర్షించేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు.

రాజధాని గ్రామాలకు ఎటుచూసినా 40 కిలో మీటర్ల దూరంలో వెంచర్లు ఏర్పాటు అవుతున్నాయి. ప్రధానంగా మంగళగిరి, తాడేపల్లి, తాడికొండ, అమరావతి, క్రోసూరు, అచ్చంపేట, గుంటూరు రూరల్, పెదకాకాని, దుగ్గిరాల, వట్టిచెరకూరు, పత్తిపాడు, సత్తెనపల్లి, మేడికొండూరు, ఫిరంగిపురం, నర్సరావుపేట, యడ్లపాడు, తదితర



తాడికొండలో సిఆర్‌డిఎ అధికారులు కూల్చిన వెంచర్లు; రోడ్డును ధ్వంసం చేసిన అధికారులు

మండలాల్లో లోతట్టు ప్రాంతాల్లోని భూముల్లో కూడా వెంచర్లు వెలుస్తున్నాయి. రాజధానిలో ధరలను విపరీతంగా పెంచడం వల్ల రాజధాని పరిసర ప్రాంతాలకు సంబంధించి కూడా అభివృద్ధి ప్రణాళికల అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంతో అవుటర్ రింగ్ రోడ్డు వస్తుందని, అమరావతి రైల్వే లైను వస్తుందని రియల్టర్లు కొనుగోలుదారులను నమ్మబలుకుతున్నారు. రాజధానిలో ఉన్న ధరల కంటే బయట తక్కువ ధరలు ఉండడంతో సిఆర్‌డిఎ పరిధిలోని సీడ్ క్యాపిటల్ కన్నా ఇతర గ్రామాల్లో క్రయ విక్రయాలు పెరిగాయి. దీంతో రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో కొనుగోళ్లు మందగించాయి. రాజధాని గ్రామాల్లో నెలకు 30 రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా.. రాజధానికి సమీపంలో ఉన్న ఇతర మండలాల్లో నెలకు 90 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. దీంతో రాజధానికి భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులు నష్టపోతున్నారు. రాజధాని గ్రామాల్లో రిటర్నబుల్ ప్లాట్ల విక్రయానికి రైతులు కొంత సుముఖంగా ఉన్నా వారు ఆశించిన ధర రాకపోవడంతో క్రయ విక్రయాలు జరగడం లేదు. తాడికొండ, అమరావతి, క్రోసూరు, పెదకాకాని, గుంటూరు రూరల్ తదితర మండలాల్లో మాత్రం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గుంటూరు పరిసరాల్లో కార్పొరేషన్ అధికారులు ఇటీవల కొన్ని వెంచర్లను కూలగొట్టారు. నల్లపాడు, బుడంపాడు, ఏటూకూరు ప్రాంతాల్లో 40 వెంచర్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. వీటిల్లో కొన్నింటిని కూలగొట్టారు. మరికొన్నింటిని కూల్చకుండా నోటీసులు జారీ చేసి టౌన్ ప్లానింగ్ అధికారులు చేతులు దులుపుకొన్నారు.

విషపు నీరు తాగి 29 మూగ జీవాలు మృతి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం (అనంతపురం)

ఓ రైతు తన వ్యవసాయ పొలంలో పంటకు పిచికారి చేసేందుకు మందు కలిపిన నీరు తాగి 29 మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. ఇందులో మేకలు, గొర్రెలు, ఆవులు ఉన్నాయి. మండలంలోని నంజాపురం గ్రామంలో చోటుచేసుకుంది. వాటి కాపరులు, పశు వైద్యాధికారి నవీన్ కుమార్ తెలిపిన వివరాలు.. కాపరులు తమ పశువులు, మేకలు, గొర్రెలను మేత మేసిన తర్వాత మధ్యాహ్న సమయంలో ఇంటికి తీసుకెళ్లే క్రమంలో ఓ రైతు వ్యవసాయ



తోటలోని చిన్న తొట్టిలో నీరు తాపారు. అయితే అందులో రైతు పంటకు పిచికారి చేసే సమయంలో యూరియా కలిపి ఉండడంతో ఈ విషయం తెలియక కాపరులు తమ జీవాలకు నీరు తాపారు. విషపూరితమైన తొట్టిలోని నీరు తాగడంతో ఏడు మేకలు, 19 గొర్రెలు, మూడు ఆవులు మృత్యువాత పడ్డాయి. విషయం తెలిసిన వెంటనే గోపాల మిత్ర గోవిందు, హరి సంఘటన స్థలానికి చేరుకొని పశువైద్యాధికారి నవీన్‌కుమార్ సలహా మేరకు మిగిలిన జీవాలకు చికిత్స అందించారు. నంజాపురం గ్రామానికి చెందిన పాడి రైతు కంచప్పకు చెందిన గొర్రెలు, ఆవులు, ఎర్రకొండాపురం గ్రామానికి చెందిన పాడి రైతు బోయ జయన్నకు చెందిన గొర్రెలు మృతి చెందాయి. దీంతో సుమారు రూ. ఐదు నుంచి రూ. ఎనిమిది లక్షల వరకూ వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని పాడి రైతులు కోరారు.

కొత్త పథకాలు లేనట్టే!

- బడ్జెట్‌పై దిశానిర్దేశంతో ఆర్థికశాఖ కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రానున్న ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో కొత్త పథకాలు దాదాపుగా లేనట్టేనని తెలిసింది. ప్రభుత్వం నుండి అందిన సంకేతాలతో ఈ మేరకు ఆర్థికశాఖ కసరత్తు చేస్తోంది. వివిధ పథకాలు ప్రతిపాదించిన కొత్త పథకాలను ఆర్థికశాఖ పక్కనపెట్టేసినట్లు సమాచారం. ఉన్న పథకాలకే నిధులు సమకూర్చుకోలేని పరిస్థితిలో కొత్తవి వద్దనుకుంటున్నట్లు ప్రభుత్వం నుంచి స్పష్టమైన సంకేతాలుఅ ందినట్లు చెబుతున్నారు. మరోవైపు ఐదుకోట్ల రూపాయలకన్నా తక్కువ ఖర్చు చేసే పథకాలను ఇతర పథకాల్లో విలీనం చేయడమో రద్దుచేయడమో చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఏయే పథకాలను విలీనం చేయాలి, వేటిని రద్దు చేయాలన్న వివరాలను ఇప్పటికే అన్ని శాఖల నుంచి వివరాలు ఆర్థికశాఖ సేకరిస్తున్నట్లు తెలిసింది. కొత్త పథకాలను ప్రతిపాదించవద్దని, కేంద్ర ప్రాయోజిత పథకాలు అమలు చేసే సమయంలో వాటికి సమీపంగా ఉన్న వాటిని మాత్రమే అవసరం మేరకు ప్రతిపాదించాలని నిర్దేశించినట్లు తెలిసింది. నిధుల కొరత కారణంగానే ప్రభుత్వం ఈ నిర్ణయాలకు వచ్చినట్లు చెబుతున్నారు.

పప్పుశనగకు పొగమంచు దెబ్బ

- రాలిపోతున్న పూత, చనిపోతున్న మొక్కలు
- సగానికి పైగా తగ్గనున్న దిగుబడి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల (నంద్యాల)



పప్పుశనగ రైతును పొగమంచు(మొగలి) ముంచేస్తోంది... పంట దిగుబడిపై పొగమంచు, అధిక తేమ ప్రభావం తీవ్రంగా పడుతోంది. గత 15 రోజులుగా తెల్లవారుజామున, ఉదయం సమయాల్లో పొగమంచు(మొగలి) తీవ్రంగా కురుస్తోంది. దీంతో పంట పూతంతా రాలిపోతోంది. మొక్కలు సైతం చనిపోతున్నాయి. దిగుబడికి అత్యంత కీలక సమయం పూత దశ. ఈ నేపథ్యంలో ప్రతికూల వాతావరణం ఏర్పడటంతో పూత మొత్తం రాలిపోతోంది. మరోపక్క ఇటీవల కాలంలో తుపాన్ వర్షాలతో భూమిలో తేమశాతం పెరగడం, ఆకాశం మేఘావృతం కావడంతో పప్పుశనగ పంటకు వేరుకుళ్లు, ఆకుమాడు తెగుళ్ల సోకాయి. పైరు పచ్చగా ఉండటంతో ఈసారి దిగుబడి వస్తుందని ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే ఎదురవుతోంది.

కొలిమిగుండ్ల మండలంలోని కలవటాళ్ల, నందిపాడు, తిమ్మనాయునిపేట, నాగిశెట్టిపెల్ల, హనుమంతగుండం, ఎర్రగుడి, పెద్ద వెంతుర్ల, కమ్మవారిపల్లె, కోటపాడు, కొలిమిగుండ్ల, చింతలాయపల్లె, అబ్దుల్లాపురం, కోరుమాను పల్లె, ఉమ్మాయపల్లె, కనకాద్రిపల్లె, నాయినిపల్లె, పెట్నికోట తదితర గ్రామాల్లో రైతులు 11,895 ఎకరాల్లో పప్పు శనగ పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంటంతా పూత దశలో ఉంది. గత 15 రోజులుగా వాతావరణ పరిస్థితులతో తెల్లవారుజామున, ఉదయం వేళల్లో పంటపై పొగమంచు (మొగలి) కమ్ముకుంటోంది. దీని ప్రభావంతో పూత రాలిపోతోంది. ఫలితంగా దిగుబడి పూర్తిగా తగ్గే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒకసారి పూత రాలిపోయినా వాతావరణం మళ్లీ అనుకూలిస్తే మరోసారి పూత వచ్చే అవకాశం ఉంటుందని, అయితే దిగుబడి సగానికిపైగా పడిపోయే పరిస్థితులు ఉంటాయని రైతులు పేర్కొంటున్నారు. పప్పుశనగ పంట సాగుకు విత్తనం మొదలు ఎరువులు, రసాయన మందులు, కలుపులు, సేద్యం తదితర వాటికి కలిపి ఎకరాకు రూ.25 వేల దాకా రైతులు పెట్టుబడి పెట్టారు. మెట్ట భూముల్లో పంట బాగా పండితే ఎకరాకు ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సగానికిపైగా దిగుబడి పడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

పూతంతా రాలిపోయింది
- రైతు సిరిపిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, పెద్ద వెంతుర్ల గ్రామం.

మాకు పప్పుశనగ పంటే జీవనాధారం. ఈ సారి వర్షాలు కురవటంతో 15 ఎకరాల వరకు శనగ పంట సాగు చేశా. ఎకరాకు రూ.25 వేల దాకా పెట్టుబడి పెట్టా. పంట పచ్చగా పెరిగి పూత కూడా బాగా రావటంతో ఆనందించాం. తీరా పూత వచ్చాక వరుస వర్షాలు పడటంతో వాతావరణ పరిస్థితులు మారిపోయాయి. ఉదయాన్నే పొగ మంచు(మొగలి) పంటను కమ్మేస్తుండటంతో పూతంతా రాలిపోయింది. గతంలో వర్షాలు పడక పంట నష్టపోయాం. ఇప్పుడేమో వర్షాలతో పంట కోల్పోతున్నాం. పెట్టుబడి ఖర్చులు కూడా రావడం కష్టమే. ఏం చేయాలో అర్థం కావట్లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

తుపాకులు విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్

- రెండు తుపాకులు, తపంచా, 10 బుల్లెట్స్
- స్వాధీనం చేసుకున్న తెలంగాణ పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో తుపాకులను విక్రయించేందుకు ప్రయత్నించిన నిందితుడిని తెలంగాణ భువనగిరి జోన్ ఎస్ఒటి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రెండు తుపాకులు, తపంచా, పది బుల్లెట్స్ (రౌండ్స్)తోపాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాచకొండ సిపి సుధీర్‌బాబు, ఎస్ఒటి డిసిపి రమణారెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన హరికృష్ణ యాదవ్ 2019లో తన తమ్ముడు మురళితో కలిసి ఉపాధి కోసమని బీబీనగర్‌కు వచ్చాడు. ఓ కంపెనీలో పనిచేశాడు.

అయితే, వచ్చే వేతనం సరిపోకపోవడంతో తిరిగి 2022లో స్వగ్రామానికి వెళ్లిపోయాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తుపాకులు విక్రయించి సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో తుపాకులు విక్రయించే కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన సంపత్ యాదవ్‌ను కలిశాడు.

అతని వద్ద తపంచా, కంట్రీమేడ్ తుపాకులు, బుల్లెట్స్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేశాడు. వాటిని గుట్టచప్పుడు కాకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఒటి బృంద సభ్యులు జవహర్‌నగర్ పోలీసులతో కలిసి హరికృష్ణను అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న సంపత్ యాదవ్ కోసం గాలిస్తున్నారు.

రూ.1000 కోట్లు !

(మొదటిపేజీ తరువాయి)

నుంచి అడ్డుకున్నారు.

తాడేపల్లిగూడెం కొండాలమ్మ చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన బరిలో నిర్వహించిన పందేల్లో ఒక కోడి పుంజు ఏకంగా రూ.1.25 కోట్లు గెలిచింది. గుడివాడ ప్రభాకరరావు (జిపి)కు చెందిన నెమలి పుంజు, రత్తయ్యకు చెందిన రసంగి పుంజుల మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో గుడివాడ ప్రభాకరరావుకు చెందిన నెమలిపుంజు విజేతగా నిలిచింది. భీమవరం పట్టణ పరిధిలో తాడేరు రోడ్డులో ఏర్పాటు చేసిన బరిలో పేకాట, గుండాట, కోతాట జోరుగా సాగాయి. సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన రికార్డింగ్ డ్యాన్స్‌లో తమ అభిమాన హీరో పాటలు వేయాలంటే, తమ హీరోవి వేయాలంటూ యువత పరస్పర దాడులకు దిగారు. భీమవరం మార్కెట్ యార్డు ప్రాంతంలో నిర్వహించిన ఒక బరిలో క్యాసినో ఆట నిర్వహించినట్లు సమాచారం. ఉంగుటూరు నియోజకవర్గంలో పెద్ద బరికి రూ.ఆరు లక్షలు, చిన్న బరికి రూ. రెండు నుంచి మూడు లక్షలకుపైగా మామూళ్లు ఇచ్చేలా ఒప్పందం జరిగినట్లు ప్రచారం సాగింది. ఉంగుటూరు మండలంలో నారాయణపురం తదితర బరులను ఎమ్మెల్యే ధర్మరాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు వేర్వేరుగా సందర్శించి కొద్ది సేపు పందేలను తిలకించారు. ముదినేపల్లి మండలంలోని బొమ్మినంపాడులోని ఓ బరిలో పందేలు గెలుచుకున్న మగ్గురికి బుల్లెట్ వాహనాలు లభించాయి. పోలవరం మండలంలోని మామిడిగొంది గ్రామంలో తెలుగు సినీ నటుడు శ్రావణ్ వీక్షించారు. జీలుగుమిల్లిలో కోడిపందేలను పోలవరం ఎమ్మెల్యే బాలరాజుతో కలిసి జబర్దస్త్ టీం సభ్యులు రాంప్రసాద్, ఐశ్వర్య వీక్షించారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 700 బరుల్లో పందేలు సాగాయి. టిడిపి, జనసేన నేతలు పోటీ పడి బరులను సిద్ధం చేసి పందేలు జరిపారు. కాకినాడ జిల్లాలో పిఠాపురం, యు.కొత్తపల్లి, గొల్లప్రోలు, కాకినాడ రూరల్, సామర్లకోట తదితర ప్రాంతాల్లో ఒక్కో చోట రెండేసి బరులు వెలిశాయి. ఇలా ఒక్కో నియోజకవర్గంలో 30 నుంచి 40 బరులను ఏర్పాటు చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 16 మండలాల్లోనూ భారీ సంఖ్యలో బరులు వెలిశాయి. అమలాపురం రూరల్‌లో ఇందుపల్లి, గున్నేపల్లి అగ్రహారం, బండారులంక, సమనస, వన్నెచింతలపూడి, పేరూరు కొంకాపల్లి, తాండవపల్లి, చిందాడగరువుల్లో పందేలు నిర్వహించారు. తుని నియోజకవర్గంలో అత్యధికంగా 40కి పైగా బరుల్లో పందేలు సాగాయి. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు, కడియం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, తాళ్లపూడిలో భారీగా పందేలు సాగాయి.

కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో భారీగా కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహించారు. బరుల వద్ద మద్యం పాయింట్లు ఏర్పాటు చేశారు. కంకిపాడు స్థానిక హరివిల్లు వెంచర్ దగ్గర జనసేన నేత ముప్పా రాజా ఆధ్వర్యంలో జరుగుతున్న కోడిపందేలు చూసేందుకు తెలంగాణకు చెందిన ఆదిలాబాద్ ఎంపి నగేష్ వచ్చారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

'ఉక్కు' నిర్వీర్య కుట్రలను తిప్పికొట్టండి : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు అమ్మేసే క్రమంలో మోడీ ప్రభుత్వం అవలంభిస్తోన్న కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొట్టాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్, ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు జి.నాయని బాబు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 1387వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే మూడు నల్ల రైతు చట్టాలను తెచ్చి రైతాంగాన్ని నాశనం చేసి, కార్పొరేట్లకు భూములను కట్టబెట్టే ప్రయత్నం చేసిందని తెలిపారు. వాటిని తిప్పికొట్టేందుకు సాగించిన పోరాటాన్ని గుర్తు చేశారు. ఆ సమయంలో దిగొచ్చిన మోడీ సర్కారు రైతుల డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చి మాట తప్పుతోందన్నారు. దొడ్డిదారిన నల్ల చట్టాలను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో ప్రజల పోరాటాన్ని ఎదిరించలేక కర్మాగారాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడవకుండా చేయడం, ముడి సరుకు ఆపేయడం, కార్మికులకు జీతాలు నిలిపేయడం, విఆర్ఎస్ ప్రకటించి పోరాటాన్ని నీరుగార్చే చర్యలకు కేంద్రం దిగిందని తెలిపారు. ఈ క్రమంలో కార్మికులు మరింత చైతన్యం ప్రదర్శించి పోరాటాలతో ఆ కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. ఉక్కు పరిరక్షణ పోరాటానికి కార్మిక, రైతు సంఘాల మద్దతు ఎల్లవేళలా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పూర్ణిమ, వార్వా నాయకులు ప్రకాశరావు, బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కృష్ణ మోహన్, శ్రామిక మహిళ యూనియన్ నాయకులు పి.మణి, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, నాయకులు వై.రాజు, జివిఎన్.చలపతి, రమణరావు, అప్పారావు పాల్గొన్నారు.



తిరుగు ప్రయాణం

పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ

ప్రజాశక్తి- యంత్రాంగం

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణమవ్వడంతో విజయవాడ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో రద్దీ ఒక్కసారిగా పెరిగింది. రద్దీని దృష్టిలో పెట్టుకొని పలు ప్రాంతాలకు ఎపిఎస్ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తదితర ప్రాంతాలకు అదనపు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. అదనపు బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని.. సాధారణ ఛార్జీలే వసూల చేస్తున్నట్లు ఆర్‌టిసి తెలిపింది. సొంతూళ్లకు వెళ్లిన హైదరాబాద్ వాసులు తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో ఎపి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. యాదాద్రి జిల్లా పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్దకు భారీగా వాహనాలు చేరుకుంటున్నాయి. పంతంగి టోల్‌ప్లాజాలోని 12 టోల్‌బూత్‌ల ద్వారా ఎపి నుంచి తెలంగాణవైపు వాహనాలను అనుమతిస్తున్నారు. కిలో మీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు ముందస్తు ఏర్పాట్లు చేశారు.



రంకెలేసిన కోడె గిత్తలు

ప్రజాశక్తి - రామచంద్రపురం / చంద్రగిరి

పట్టుకోండి.....దమ్ముంటే నా కోడె గిత్తలను పట్టుకోండి అంటూ.... తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గంలోని చంద్రగిరి మండలం ఏ రంగంపేట, రామచంద్రాపురం మండలంలోని బొప్పరాజుపల్లి గ్రామంలో బుధవారం పరుష పందేలు (జల్లికట్టు) జరిగాయి. కనుమ పండుగ రోజున ఏ రంగంపేట, బొప్పరాజు పల్లి గ్రామాల పశువుల పండుగ కార్యక్రమంలో రంకేసిన కోడిగిత్తలు...... యువకుల జోరుతో జల్లికట్టు జోరుగా సాగింది. రైతు కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటున్న కోడెగిత్తలు, ఆవులను రైతులు వాటి కొమ్ములకు రంగులు పూసి చెక్క పలకలు, నూతన వస్త్రాలు, వేలాది రూపాయల నగదును కడుతారు. నా కోడిగిత్తల పౌరషాన్ని చూడండి అంటూ వాటి యజమానులు.. మీ వల్ల అయితే పట్టుకోండి చూద్దాం అంటూ యువతకు సవాళ్లు విసురుతారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువత గుంపులు గుంపులుగా చేరి పశువులకు కట్టిన బంగారు, వెండి ఆభరణాలు, నగదు, పలకలను చేజికిచ్చేందుకు పోటీపడతారు. చెదురు మదుర సంఘటనలో కొంతమంది యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎద్దుల పండుగలో అపశృతి

సోమల మండలం పొదలకుంటపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఎద్దుల పండుగలో అపశృతి చోటు చేసుకుంది. ఎద్దుల పండుగను చూడటానికి వచ్చిన అబ్బు అనే వ్యక్తి ఎద్దు తన కొమ్ముతో పొడవడంతో అతను తీవ్రంగా గాయపడ్డారు. పీలేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడి వివరాలు తెలియాల్సి ఉంది.

ధాన్యానికి రూ.500 బోనస్

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో కునారం(కెఎన్ఎం1638) పేరుతో 120, 125 రోజులకు పంట చేతికి వచ్చే నూతన విత్తనాలు విడుదల చేశారని తెలిపారు. ఉత్పత్తి కూడా అధికంగా వస్తోందని, మార్కెట్లో మంచి రేటుకు రైతులు అమ్ముకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో నూతన విత్తనాలపై వ్యవసాయ పరిశోధనలు కుంటుపడ్డాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో పరిశోధనలు పెంచాలని, నూతన వరి ఇతర విత్తనాల ఆవిష్కరణపై దృష్టి సారించాలని, అధిక దిగుబడి ఇచ్చే, అధిక రేటు వచ్చే విత్తనాలను రైతులకు అందుబాటులో తేవాలని శ్రీనివాసరావు కోరారు. వ్యవసాయ పరిశోధన, విస్తరణకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించాలని కోరారు.

మరో ఏడాది డైరెక్టర్‌గా చంద్రం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఇపిడిసిఎల్‌లో డిప్యూటేషన్‌పై ఆర్థిక, హెచ్‌ఆర్ విభాగం డైరెక్టర్‌గా పని చేస్తున్న దండగల చంద్రంకు ఆ బాధ్యతలను మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ సర్వీసెస్ (ఐఆర్‌ఎఎస్) పని చేస్తున్న చంద్రం డిప్యూటేషన్‌పై ఎపిఇపిడిసిఎల్‌లో డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. 2026 జనవరి 14వ తేదీ వరకూ ఆయన ఈ బాధ్యతలు నిర్వహించేందుకు అనుమతి ఇచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైసిపి నేతల దుష్ప్రచారం

- మంత్రి గొట్టిపాటి విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితం చేసి ప్రజలు గడ్డి పెట్టినా, వైసిపి నేతలు తమ బుద్ధిని మార్చుకోలేదని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. తెలుగు ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా సంప్రదాయ సంక్రాంతి పండుగ వేళ విషం వెళ్లగక్కుతున్నారని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. పల్లెల్లో సంక్రాంతి కళ లేదంటూ జగన్ అండ్ కో చేస్తున్న దుష్ప్రచారం దుర్మార్గమన్నారు. సమగ్ర నీటి వినియోగంతో ఈ సారి పంటలు బాగా పండాయని, రైతులు ధాన్యం అమ్మిన 24 గంటల్లో డబ్బు చెల్లించినట్లు చెప్పారు. ప్రజల సంతోషాన్ని చూడలేకనే వైసిపి మీడియా, సోషల్ మీడియా వేదికగా అసత్యాలను ప్రచారంలోకి తేవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో గోతులమయంగా మారిన రహదారులను రూ.850 కోట్లతో కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిందని, ఐదేళ్లకాలంలో వివిధ వర్గాలకు పెండింగ్‌లో పెట్టిన రూ. 6,700 కోట్లు బకాయిలను కూడా ఈ పండుగ కానుకగా విడుదల చేసినట్లు చెప్పారు.

తిరుమలలో ఇంటి దొంగల చేతివాటం

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన నకిలీ టికెట్లతో యాత్రికులకు స్వామివారి దర్శనం చేయిస్తున్న దళారులపై అనుమానం రావడంతో వైకుంఠ క్యూ కాంప్లెక్స్ వద్ద విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. బుధవారం ఉదయం రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన కౌంటర్ సిబ్బంది లక్ష్మీపతితో కలిసి అగ్నిమాపక పిఎస్‌జిలు మణికంఠ, భానుప్రకాష్‌లు యాత్రికులను మోసగించారు. మణికంఠ సాయంతో నకిలీ టికెట్లను తయారు చేసి వారు విక్రయిస్తూ పట్టుబడ్డారు. హైదరాబాద్, ప్రొద్దుటూరు, బెంగుళూరు యాత్రికులు దాదాపు 11 మంది నుంచి రూ. 19 వేలు వసూలు చేశారు. వైకుంఠ దర్శనాలకు యాత్రికులను సేకరించే ట్యాక్సీ డ్రైవర్లు శశి, చెన్నయ్ జగదీష్, మణికంఠ, భానుప్రకాష్, లక్ష్మీపతిలను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



వారెన్ బఫెట్ వారసుడిగా హువర్డ్

వాషింగ్టన్ : ప్రపంచంలోనే అతిపెద్ద కుబేరుల్లో ఒక్కరైనా వారెన్ బఫెట్ తన వారసుడిగా హువర్డ్ బఫెట్‌ను ప్రకటించారు. దీంతో హువర్డ్ బెర్క్‌షైర్ హాత్‌వే కంపెనీకి ఛైర్మన్‌గా బాధ్యతలను చేపట్టనున్నారు. ప్రస్తుతం బెర్క్‌షైర్ వ్యాపార విలువ లక్ష కోట్ల డాలర్లుగా ఉంది. భారత కరెన్సీలో ఈ విలువ దాదాపు రూ.86 లక్షల కోట్లు. ప్రస్తుతం వారెన్ బఫెట్‌కు 94 ఏళ్లు.తన సంపదలో అత్యధిక మొత్తం కొత్తగా ఏర్పాటు చేసిన ఛారిటబుల్ ట్రస్ట్‌కు రాసి ఇచ్చినట్లు బఫెట్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. తన ముగ్గురు పిల్లలకు అతి తక్కువ సంపద మాత్రమే ఇస్తున్నట్లు వెల్లడించారు.

తలసరి ఆదాయం పెంచడమే 'స్వర్ణాంధ్ర విజన్'

- నారావారిపల్లిలో మీడియాతో చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ



ట్రైనింగ్ సెంటర్‌లో మీడియాతో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారి తలసరి ఆదాయం పెరుగుతోందని, ప్రతి ఇల్లు, ప్రతి గ్రామం ఆనందంగా ఉండాలనే స్వర్ణాంధ్ర విజన్ 2047 తయారు చేశానని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీనే తన విజన్ అని తెలిపారు. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లె స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ప్రాంగణంలో మీడియాతో చంద్రబాబు మాట్లాడారు. ప్రజలు సొంత గ్రామాల్లో సంక్రాంతి పండుగ జరుపుకోవడం మంచి సంప్రదాయమని, ప్రతి ఇల్లూ ఆనందంగా ఉండాలనే లక్ష్యంతో స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047 తయారు చేశానన్నారు.

విజన్ 2020లో దేశంలో అధిక పర్ క్యాపిటీ ఇన్‌కం పొందేలా తెలంగాణ రాష్ట్రం తయారయ్యిందన్నారు. అన్ని వర్గాలను అభివృద్ధి చేసేందుకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో రూ. నాలుగు వేలు, రూ.ఆరు వేలు, రూ. పది వేలు, రూ. 15 వేలకు సామాజిక భద్రత పింఛన్లు ఇస్తున్న రాష్ట్రంగా మన రాష్ట్రం ఉందన్నారు. నెలకు 67 లక్షల పింఛన్లు ఇస్తున్నామని, రూ. 33 వేల కోట్లు ఏడాదికి ఖర్చు చేస్తున్నామన్నారు. 199 అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు రూ.5కే భోజనం అందిస్తున్నామని తెలిపారు. దీపం-2 పథకం కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామని చెప్పారు. పేద వాళ్లు పేద వాళ్లుగా ఉండకూడదనే ఉద్దేశంతో పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్టనర్‌షిప్ (పి4) విధానం తీసుకువచ్చామన్నారు. కుప్పం, నారావారిపల్లిల్లో మూడు సచివాలయాలను ఒక పైలట్ ప్రాజెక్టుగా చేసుకుని ప్రభుత్వం అందించే కార్యక్రమాలను అమలు చేసి వారి జీవన ప్రమాణాలు మార్చే విధంగా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఈ ఉగాదికి అందరికీ సోలార్ రూఫ్ టాప్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. ఈనెల 18న వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆధార్, క్యాస్ట్, నేటివిటీ, డేట్ ఆఫ్ బర్త్, సర్టిఫికెట్లు, అడంగల్ వంటి 150 సర్వీసుల వరకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. రంగంపేటలో రూ.1.10 కోట్లతో శ్రీ సిటీ ఆధ్వర్యంలో ఒక మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, శాప్ ఛైర్మన్ రవి నాయుడు పాల్గొన్నారు. నారావారిపల్లిలో మూడురోజుల పర్యటన అనంతరం మంగళవారం సాయంత్రం తిరిగి అమరావతికి వచ్చారు.

కెటిఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురు

- పిటిషన్ తిరస్కరించిన సర్వోన్నత న్యాయస్థానం
- నేడు ఇడి విచారణకు హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించిన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. ఎసిబి నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని తెలంగాణ హైకోర్టులో కెటిఆర్ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీంతో ఈ నెల 8న ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. కేటీఆర్ పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న వర్లే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టంచేసింది.

రాజకీయ కారణాలతోనే కేసు నమోదు చేశారని.. ప్రస్తుతం కేటీఆర్ విపక్షంలో ఉన్నారని ఆయన తరపు న్యాయవాది సుందరం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష నేతగా ఉండటంతోనే కేసులు పెడుతున్నారని వాదించారు. అయితే.. ప్రతిపక్ష నేతగా ఉంటే కేసులు ఎదుర్కోవాలి కదా..? అని జస్టిస్ బేలా ఎం త్రివేది ప్రశ్నించారు. హైకోర్టు తీర్పులో తాము జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. పిటిషన్ వెనక్కి తీసుకుని.. మళ్లీ హైకోర్టును ఆశ్రయించేందుకు అవకాశం ఇవ్వాలని కెటిఆర్ తరపు న్యాయవాది కోరారు. పిటిషన్ విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించిన ధర్మాసనం.. మళ్లీ హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛ ఇవ్వలేమని స్పష్టం చేసింది. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని కెటిఆర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కాగా, ఇదే కేసుకు సంబంధించి కెటిఆర్ గురువారం ఇడి విచారణకు హాజరుకానున్నారు.

కెటిఆర్‌కు ఎసిబి మళ్లీ నోటీసులు..!

ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు మరోసారి నోటీసులు ఇచ్చేందుకు ఎసిబి సిద్ధమైంది. ఆయనతోపాటు అర్వింద్ కుమార్, బిఎల్‌ఎన్ రెడ్డిలకు మరో సారి నోటీసులు ఇచ్చే యోచనలో ఉంది. సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కావడంతో నోటీసులపై ఎసిబి ముందుకెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ముగ్గురిని ఎసిబి విచారించిన విషయం తెలిసిందే.

సనాతన ధర్మం పేరిట చిచ్చు

- ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి

ప్రజాశక్తి-సంతనూతలపాడు (ప్రకాశం జిల్లా)




సభలో మాట్లాడుతున్నపుణ్యవతి.

సనాతన ధర్మం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని, ప్రజలంతా కలిసి మెలిసి ఉండడమే అసలైన ధర్మమని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి అన్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలంలోని మైనంపాడులో మైనంపాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల విజేతల బహుమతి ప్రదానోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రాచీన కాలంలో ఉన్న సనాతన ధర్మాన్ని నేడు ముందుకు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. మతాన్ని మహిళలపై బలవంతంగా రుద్దుతున్నారని చెప్పారు. 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్' అన్న గురజాడ అప్పారావు కవితను ఈ సందర్భంగా గుర్తు చేశారు. అన్ని విషయాలలోనూ మహిళలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి గౌరవించాలని సూచించారు. మహిళలకు విద్యను అందించిన తొలి మహిళా గురువు సావిత్రిబాయి పూలే గురించి ఆమె వివరించారు. మహిళలకు విద్యను అందించడం వల్లే నేటి సమాజంలో స్త్రీలు అభివృద్ధి చెందారన్నారు. సభకు ఐద్వా మండల కార్యదర్శి ఎన్.మాలతి ఆహ్వానం పలికారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు ఎ.భగత్‌సింగ్, ఎస్కే కమాల్, గుండవరపు సుబ్బారావు, తన్నీరు సుబ్బారావు పాల్గొన్నారు.

విశాఖ పోర్టులో భారత్‌మాలకు కేంద్రం జలక్!

- గతంలో ప్రతిపాదించిన 5 ప్రాజెక్టులకు నిధులు తిరస్కరణ
- ఆర్‌విఎన్‌ఎల్-వైజాగ్ పోర్టు తాజా ఒప్పందంతో బట్టబయలు
- పోర్టు వాటా పెరగడంతో ఆర్థిక భారం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో



విశాఖ పోర్టు వ్యూ (ఫైల్ ఫొటో)

విశాఖ పోర్టులో 'భారత్‌మాల' ప్రాజెక్టు ద్వారా ఇవ్వాల్సిన నిధులను ఇచ్చేది లేదని కేంద్రంలోని మోడీ సర్కారు తేల్చి చెప్పింది. దీంతో పోర్టుపైనే ప్రాజెక్టుల భారం పడనుంది. సరకు రవాణా అభివృద్ధికి రూ.300 కోట్ల అంచనా వ్యయంతో గతంలో పలుమార్లు వైజాగ్ పోర్టు అధికారులు రూపొందించిన ఐదు ప్రధాన ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణ ప్రతిపాదనలపై ఏళ్ల తరబడి కేంద్రం మౌనం దాల్చుతూ వచ్చింది. ఇటీవల అకస్మాత్తుగా మోడీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు డబ్బులను పోర్టే సమకూర్చుకోవాలంటూ హుకుం జారీ చేసింది. రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌విఎన్‌ఎల్)ను కేంద్రం రంగంలోకి దింపింది. ఆర్‌విఎన్‌ఎల్ ప్రభుత్వ రంగ సంస్థే అయినా ఈ ప్రాజెక్టుల్లో విశాఖ పోర్టు సగానికిపైగా ఆర్థిక భారం మోయాల్సి వస్తుంది. దేశంలో ఏ మేజర్ పోర్టు పరిధిలోనైనా సాగరమాల, భారత్‌మాల ప్రాజెక్టులను అమలు చేస్తూ సరకు రవాణాకు కేంద్రం నేరుగా జోక్యం చేసుకొనే విధానాన్ని 2014లో మోడీ ప్రభుత్వం ప్రకటించింది. సముద్రంలో బెర్తుల అభివృద్ధికి, అంతర్జాతీయ సముద్ర జలవివాదాలను పరిష్కరించేందుకు 'సాగర మాల' ప్రాజెక్టు ఉండగా, ల్యాండ్ సైడ్ (పోర్టు భూభాగం)లో సమస్యల పరిష్కారానికి 'భారత్ మాల' ప్రాజెక్టు ఉంది.

విశాఖ పోర్టులో అనుసంధాన రోడ్లు, రైలు రవాణాకు ఆటంకాల్లేకుండా రూ.300 కోట్ల విలువైన ప్రాజెక్టులను విశాఖ పోర్టు-ఆర్‌విఎన్‌ఎల్ మధ్య తాజాగా అంగీకారం కుదిరింది. దీని ప్రకారం 52 శాతం మేర పోర్టు, మిగతా 48 శాతం ఆర్‌విఎన్‌ఎల్ ఖర్చు చేయాలని ఒప్పందంలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఆర్‌విఎన్‌ఎల్ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థే అయినా మొత్తం బడ్జెట్‌ను అందించదు. దీంతో, పోర్టుపై ఆర్థిక భారం పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గతంలో పోర్టు ప్రతిపాదించిన వాటిలో అవుటర్ హార్బర్ ఏరియా నుంచి సీ హార్స్ జంక్షన్ వరకూ ఒక ఫ్లైఓవర్ బ్రిడ్జి, సీ హార్స్ జంక్షన్ నుంచి డాక్ ఏరియా వరకూ మరో ఫ్లైఓవర్ బ్రిడ్జి ఉన్నాయి. పోర్టు నుంచి షీలానగర్ వరకు ఇప్పటికే ఉన్న రోడ్డును ఆరు వరుసలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు ఉన్న రహదారికి, షీలానగర్ రోడ్డును అనుసంధానించే ప్రతిపాదనలు ఉన్నాయి. భారీ బడ్జెట్‌తో కూడిన ప్రాజెక్టులైనందున 'భారత్ మాల'లో పెట్టాలని పోర్టు కోరుతూ వస్తోంది. కేంద్రమే నేరుగా ఈ ఆర్థిక వ్యవహారాలపై స్పందించాల్సి ఉన్నా ఏళ్లుగా డిపిఆర్‌లు మాత్రమే తీసుకుంటూ ఉంది. అకస్మాత్తుగా పోర్టే చూసుకోవాలని కేంద్రం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.

ప్రాజెక్టులు పూర్తయితే...

పోర్టు ప్రతిపాదించిన ప్రాజెక్టులు పూర్తయితే 11 లెవెల్ క్రాసింగ్‌లు తొలగిపోయి సరకు రవాణా సాఫీగా జరగనుంది. ఇది పోర్టుకు వచ్చి పోయే వాహనాల ట్రాఫిక్‌కు ఆటంకాల్లేకుండా ఉంటుంది. ప్రస్తుతం పోర్టు పరిధిలో రైల్ లైన్లలో వ్యాగన్‌లు వెళ్తుంటే, పోర్టు సరకు రవాణా వాహనాలన్నీ నిలిచిపోయే పరిస్థితులు ఏళ్ల తరబడి ఉన్నాయి. ప్రతిపాదిత ప్రాజెక్టులు అమల్లోకి వస్తే కింద నుంచి రైళ్లు వెళ్లిపోతాయి. పోర్టు కార్గో అంతా ఎటువంటి అంటకమూ లేకుండా ఫ్లైఓవర్ల నుంచి వెళ్లిపోతుంది. ట్రాఫిక్ సమస్యలు తీరుతాయి. అయితే, నెమ్మదిగా పోర్టులో ప్రైవేటీకరణ చర్యలను కేంద్రం వేగిర పరుస్తోంది. పోర్టులోని 21 బెర్తుల్లో 11 బెర్తులను ఇప్పటికే పిపిపికి ఇచ్చేశారు. సొంతంగా నిర్వహించుకుంటే వచ్చే ఆదాయం కన్నా, పిపిపికి ఇవ్వడం వల్ల ఆదాయం తక్కువ. భారత్ మాలకు నిధులను ఇలా వాటా పంచడం కూడా పోర్టు ఆర్థిక స్థితిని దెబ్బకొట్టే చర్యే.



మెన్స్ కోర్టును ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ దాసి రాజు, పక్కనే కాపు కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారాయుడు, డిఎస్‌పి శ్రీవేద

జాతీయస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణంలోని రుస్తుంబాద కబడ్డీ స్టేడియంలో గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి మహిళల, పురుషుల కబడ్డీ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 18వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి పురుషుల విభాగంలో 19 జట్లు, మహిళల విభాగంలో 11 జట్లు తలపడనున్నాయి. పోటీలు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరగనున్నాయి. పోటీల ప్రారంభ సూచికగా అంబేద్కర్ సెంటర్ నుంచి స్టేడియం వరకు క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. ఉమెన్స్ కోర్టును డిఎస్‌పి శ్రీవేద, మెన్స్ కోర్టును ఆర్‌డిఒ దాసి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ.. క్రీడలు యువతలో పోటీతత్వం, స్ఫూర్తిని పెంచుతాయని తెలిపారు. క్రీడలపై అభిమానం ఉన్న దాతలు ముందుకొచ్చి గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. క్రీడల్లో గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకుంటే జీవితంలో ఏదైనా సాధించొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వాహక కమిటీ కన్వీనర్ కొత్తపల్లి జానకీరామ్, విద్యుత్ శాఖ ఇఇ కె.మధుకుమార్, తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి, సిపిఎం నాయకులు కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు, తెలగంశెట్టి సత్యనారాయణ, సిపిఐ నాయకులు నెక్కంటి సుబ్బారావు పాల్గొన్నారు.



మోహన్‌బాబు కళాశాల గేటు వద్ద ఉద్రిక్తత

మోహన్‌బాబు కళాశాల వద్ద ఉద్రిక్తత

- ఎట్టకేలకు అవ్వాతాతకు మనోజ్ నివాళి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

మోహన్‌బాబు కళాశాల వద్దకు మంచు మనోజ్ రావడంతో ఉద్రిక్తత నెలకొంది. తన అవ్వాతాతలకు నివాళులర్పించాలని వచ్చిన మనోజ్‌ను మోహన్ బాబు బౌన్సర్లు అడ్డుకున్నారు. పోలీసులు నచ్చజెప్పడంతో ఎట్టకేలకు మనోజ్ కుటుంబానికి అనుమతినిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోహన్‌బాబు యూనివర్సిటీ ప్రాంతంలోని తన అవ్వాతాతల సమాధుల వద్దకు బుధవారం నివాళర్పించేందుకు మనోజ్ వెళ్లారు. మనోజు తన భార్య మౌనికను గేట్ లోపలికి అనుమతించిన వెంటనే మోహన్ బాబుకు సంబంధించిన ప్రయివేట్ సిబ్బంది భారీగా చేరుకొని వారిలో వారే చిన్నపాటి గొడవ సృష్టించుకున్నారు. తమను కొట్టేశారంటూ పెద్ద ఎత్తున రాద్ధాంతం చేశారు. పోలీసులను సైతం లెక్కచేయకుండా బయటకు తోసేశారు. సిఐ గోవిందు సైతం కింద పడిపోయారు. ఎట్టకేలకు భారీగా పోలీసులు అక్కడకు చేరుకొని స్వల్ప లాఠీచార్జి చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. మనోజ్ బోన్సర్లను సైతం గేటు లోపలికి అనుమతించలేదు. ఒకరిద్దరు మీడియా సిబ్బంది వెంట రాగా, మనోజ్ అతని భార్యతో కళాశాల లోపలికి వెళ్లి తన అవ్వాతాతల సమాధి వద్ద నివాళులర్పించారు.

మృత్యువులోనూ వీడని బంధం

- గుండెపోటుతో అన్న మృతి
- ఆ వార్త వినగానే తమ్ముడు హఠాన్మరణం
- చీరాలలో విషాదం

ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)



గంగాధర్ (ఫైల్)



గోపి (ఫైల్)

గుండె నొప్పితో బాధపడుతున్న అన్నను వైద్యశాలలో చేర్పించిన తమ్ముడు తన అన్న మృతి చెందాడని వైద్యులు చెప్పడంతో ఆ వార్తను జీర్ణించుకోలేక అతనూ కుప్పకూలి హఠాన్మరణం చెందారు. ఈ ఘటన చీరాల మండలం గొల్లపాలెంలో బుధవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల పట్టణంలోని 14వ వార్డు గొల్లపాలెంకు చెందిన గొల్లప్రోలు గంగాధర్ (40) కొత్తపేట మూడు రోడ్ల సెంటర్లో వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయన తమ్ముడు గొల్లప్రోలు గోపి (34)ని బిటెక్ వరకు చదివించారు. ప్రస్తుతం గోపి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ పలు ప్రాంతాలలో శిక్షణ తీసుకుంటూనే అన్నయ్య పనిలోనూ సాయంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో అప్పటివరకు సరదాగా గడిపిన ఆ అన్నదమ్ముల్లో గంగాధర్‌కు బుధవారం గుండెనొప్పి రావడంతో బంధువుల సాయంతో పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం చీరాల ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి గంగాధర్ మృతి చెందారు. ఈ విషయాన్ని గోపికి తెలపడంతో ఆయన అక్కడే సొమ్మసిల్లి పడిపోయి అపస్మారక స్థితిలోకి చేరుకొని మృతి చెందారు. అన్న మతదేహం వద్దే తమ్ముడూ మృతి చెందడంతో బంధువుల్లో విషాదం నెలకొంది. వారి తండ్రి బాలాజీ నాలుగేళ్ల క్రితం గుండెపోటుతో మతి చెందారు. మతుడు గంగాధర్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెటాలో 3600 మందిపై వేటు

- ఆందోళనలో ఉద్యోగులు



శాన్‌ఫ్రాన్సిస్కో : ఐటి ఉద్యోగులకు మెడపై కత్తి వేలాడుతోంది. గత రెండేళ్లుగా టెక్ కంపెనీలు తమ ఉద్యోగులను ఎప్పుడు తొలగిస్తాయే తెలియని దుస్థితి నెలకొంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా తదితర పలు కంపెనీలు తమ ఉద్యోగుల్ని వరుసగా తొలగిస్తున్నాయి. ఆర్థిక మాంద్యం భయాలు, పొదుపు చర్యల్లో భాగంగా సిబ్బందికి ఎసరు పెడుతున్నాయి. తాజాగా టెక్ దిగ్గజం, ఫేస్‌బుక్, వాట్సాప్, ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా తన వేలాది ఉద్యోగులను ఇంటికి పంపించాలని నిర్ణయించింది. దాదాపు 3600 మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించింది. కంపెనీ తన అంతర్గత మెమోలో ఈ విషయాన్ని వెల్లడించింది. పేలవమైన పనితీరును కనబర్చిన వారికి ఉద్వాసన పలికినట్లు తెలిపింది. ఈ సంఖ్య దాదాపుగా మెటా మొత్తం ఉద్యోగుల్లో 5 శాతానికి సమానం. మార్క్ జుకర్‌బర్గ్ తీసుకున్న ఈ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెటాలో దాదాపు 72,400 మంది ఉద్యోగులు ఉన్నారు.

ఉద్వాసనకు గురైన ఉద్యోగులు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. సంస్థ తమను ఉద్యోగాల్లోకి తీసుకున్న సమయంలో నైపుణ్యాల గురించి తెలియలేదా..? అని వారు ప్రశ్నిస్తున్నారు. ఆకస్మాత్తుగా తొలగింపు చేస్తే ఎలా అని అడుతున్నారు. కొత్త వారిని తీసుకున్న తమకంటే బాగా పని చేస్తారనే గ్యారంటీ ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగుల జీతాలు పెరిగే సమయంలో ఇలా ఏదో ఒక కారణం చెప్పి తొలగింపులకు పాల్పడుతున్నారని అంటున్నారు. ఇతర అమెరికన్ టెక్ కంపెనీల్లోనూ ఇదే తొలగింపుల పర్వం కొనసాగుతోంది. గత వారం మైక్రోసాఫ్ట్ కూడా తన ఉద్యోగులలో 1 శాతం మందిని తొలగించింది. ఈ వ్యక్తులందరినీ పేలవమైన పనితీరు జాబితాలో చేర్చింది. కంపెనీలో నిర్వహణ స్థాయిని పెంచాలని, పేలవమైన పనితీరు కనబరిచే ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించింది. కృత్రిమ మేధా (ఎఐ) కారణంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రాబోయే కాలంలో మరిన్ని ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.



తలపడుతున్న పందులు

రసవత్తరంగా రాష్ట్ర స్థాయి పందుల పోటీలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలో రాష్ట్ర స్థాయి వరాహ (పందుల) పోటీలు రసవత్తరంగా సాగాయి. సంక్రాంతి సందర్భంగా గిరిజన రత్న సింగం పట్టాభి, జానకమ్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు పోటీలు నిర్వహించారు. నాలుగు విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. నెల్లూరు జిల్లా బుచ్చి గ్రామం, కోనసీమ జిల్లా వెలస గ్రామం మధ్య పోటీ నిర్వహించగా బుచ్చి గ్రామానికి చెందిన పంది తొలి విజేతగా నిలిచింది. పశ్చిమగోదావరి జిల్లా తిరుపతిపాడు, కొమ్ముగూడెం గ్రామాల మధ్య జరిగిన పోటీలో తిరుపతిపాడుకు చెందిన పంది రెండో స్థానంలో, తూర్పుగోదావరి జిల్లా మండపేట, నిడదవోలు గ్రామాల మధ్య జరిగిన పోటీలో మండపేటకు చెందిన పంది మూడవ స్థానంలో నిలిచాయి. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు గ్రామాల మధ్య పందుల మధ్య పోటీ నిర్వహించగా తాడేపల్లిగూడెంకు చెందిన పంది విజేతగా నిలిచింది. అనంతరం విజేతలైన పందుల యజమానులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏకలవ్య సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సింగం సుబ్బారావు మాట్లాడుతూ కత్తులు కట్టని, ప్రాణహాని లేని ఈ పోటీలు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం నుండి సహకారం కావాలని కోరారు.



షాజియాను అభినందిస్తున్న పొదిలి సిఐ వెంకటేశ్వర్లు

టైక్వాండోలో షాజియాకు గోల్డ్ మెడల్

- అభినందించిన పొదిలి సిఐ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-పొదిలి (ప్రకాశం జిల్లా)


బాపట్ల జిల్లా, రేపల్లెలో 11, 12 తేదీల్లో జరిగిన టైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో పొదిలికి చెందిన చిన్నారి షేక్ షాజియా బంగారు పతకం సాధించింది. ఆంధ్రప్రదేశ్ టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పదేళ్ల లోపు, బాలికల 27 కేజీల విభాగంలో కరాటే, టైక్వాండో షాజియా పోటీ పడింది. నాలుగు రౌండ్ల లోనూ అద్భుతంగా ఫైట్ చేసి బంగారు పతకం కైవసం చేసుకుంది. ప్రకాశం జిల్లా పొదిలి జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉదయం మాస్టర్ కటారి చిన్నరాజును, షాజియాను స్థానిక సిఐ వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటే, టైక్వాండో విద్య ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. షాజియాను అభినందిస్తూ జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. తమ కుమార్తె బంగారు పతకం సాధించేలా శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ చిన్న రాజును షాజియా తల్లిదండ్రులు ఖాసిం షాహిద్, షాతాజ్ బేగం పూలమాల, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హబీబుల్లా సేవా సంస్థ చైర్మన్ కరిముల్లా బేగ్ పాల్గొన్నారు.

హల్దీరామ్‌లో వాటాలపై పెప్సీకో దృష్టి

న్యూఢిల్లీ : ప్రముఖ తినుబండారాల సంస్థ హల్దీరామ్‌లో వాటాల కొనుగోలుపై కార్పొరేట్ గ్లోబల్ దిగ్గజం పెప్సీకో దృష్టి పెట్టిందని సమాచారం. ఆ సంస్థలో వాటాల స్వాధీనం కోసం చర్చలు ప్రారంభించిందని రిపోర్టులు వస్తోన్నాయి. అగర్వాల్ కుటుంబం నిర్వహిస్తున్న హల్దీరామ్‌లో మైనారిటీ వాటా 10 శాతం కోసం ఇప్పటికే టెమాసెక్, ఆల్ఫావేస్ గ్లోబల్ సంప్రదింపులు చేస్తుండగా.. తాజాగా ఈ రేసులో పెప్సీకో చేరింది. హల్దీరామ్ విలువను రూ.85,000-90,000 కోట్లు లెక్కగట్టినట్లు తెలుస్తోంది. ఈ సంస్థ దాదాపుగా 500 వరకు ఉత్పత్తులను విక్రయిస్తోంది.

రూపాయి పతనం ఆర్‌బిఐకి సవాల్

- దిగుమతులపై త్వరలో సుంకాల పెంపు
- ఇవై అంచనా



న్యూఢిల్లీ : అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం రికార్డ్ స్థాయిలో పడిపోతున్న నేపథ్యంలో రూపీ విలువ కట్టడిపై కేంద్రం దృష్టి పెట్టనుందని టాక్స్ కన్సల్టెంట్ సంస్థ యర్నెస్ట్ అండ్ యంగ్ (ఇవై) అంచనా వేసింది. రూపాయి పతనాన్ని నిరోధించేందుకు ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో దిగుమతులపై అధిక సుంకాలను విధించే అవకాశాన్ని పరిశీలించవచ్చని ఇవై చీఫ్ పాలసీ అడ్వైజర్ డికె శ్రీవాస్తవ పేర్కొన్నారు. దిగుమతులపై అధిక పన్నులతో డాలర్ల డిమాండ్‌ను అరికట్టగలదని పేర్కొన్నారు. శ్రీవాస్తవ ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం సలహామండలి సభ్యుడిగా కూడా ఉన్నారు.

"అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ అకస్మాత్తుగా క్షీణించడంతో బడ్జెట్ రూపకర్తలకు, ద్రవ్య విధానపరంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బిఐ)కి సవాలుగా మారుతుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందనే అంచనాలతో ప్రపంచంలోని ఆర్థిక వనరులు అక్కడికి తరలిపోతున్నాయి. రూపాయి సహా ఇతర యూరోపియన్ కరెన్సీలు కూడా ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో రూపాయి పతన కట్టడికి రానున్న బడ్జెట్‌లో సుంకం రేట్లను పరిశీలించే అవకాశం ఉంది. దిగుమతులపై సుంకాలు విధించడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు మద్దతును లభించనుంది. ఫలితంగా దిగుమతి సుంకం ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతుంది. దీంతో డాలర్‌కు డిమాండ్ తగ్గనుంది." అని శ్రీవాస్తవ పేర్కొన్నారు. జనవరి 13న అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక్క రోజులోనే 66 పాయింట్లు పతనమై చరిత్రలోనే తొలిసారిగా 86.70 కనిష్ఠ స్థాయికి దిగజారింది. గత రెండు వారాల్లో దీని విలువ ఒక్క రూపాయి కంటే ఎక్కువగా పడిపోయింది. ఈ క్రమంలో భారత కరెన్సీ పతనాన్ని అదుపు చేయడానికి సుంకాల పెంపు మద్దతును ఇవ్వనుందని శ్రీవాస్తవ పేర్కొన్నారు.

సంపాదకీయం

దుర్మార్గ వ్యాఖ్యలు

వారానికి 90 పని గంటలు ఉండాలంటూ ఎల్ అండ్ టి ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఆయన దుర్మార్గపు వర్గ స్వభావాన్ని బట్టబయలు చేస్తున్నాయి. 'ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు? భార్యను ఎంతసేపు తదేకంగా చూస్తూ కూర్చుంటారు? ఆదివారం పూట కూడా పనిచేయించలేక పోతున్నందుకు బాధపడుతున్నాను' అని అయన అన్నారు. కొన్నాళ్ల క్రితం ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కూడా ఇటువంటి వ్యాఖ్యలే చేసిన విషయం తెలిసిందే. వారానికి 70 గంటలు పనిచేయాలని నారాయణమూర్తి అప్పట్లో చెప్పారు. ఇప్పుడు సుబ్రమణ్యన్ మరో 20 గంటలు అదనంగా కలిపి 90 గంటలు వారానికి పనిచేసి తీరాలంటున్నారు. అలా చేస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలపై కార్మికలోకం సహజంగానే ఆగ్రహిస్తోంది. సిఐటియు తీవ్రంగా ఖండించింది. నారాయణమూర్తి మాటలను కూడా ప్రస్తావించిన ఆ సంఘం 'భారతీయ కార్మికుల రక్త, మాంసాలను దోచుకోవడానికి పోటీ పడుతున్నారు' అని వ్యాఖ్యానించింది. కర్ణాటక ఐటి ఉద్యోగుల సంఘం (కెఐటియు) 'మీ లాభాల కోసం మేం చావడానికి సిద్ధంగా లేం' అని ప్రకటించింది. 'పెట్టుబడిదారుల క్రూరమైన, అమానవీయమైన దోపిడికి, ఎంతకీ తృప్తి చెందని లాభార్జన దాహానికి ఈ వ్యాఖ్యలు నిదర్శనం.' అని ఆ సంఘం వ్యాఖ్యానించింది. నారాయణమూర్తి 70 గంటల పనిదినాన్ని గురించి చెప్పినప్పుడు కర్ణాటకలో దాన్ని అమలు చేయడానికి చేసిన ప్రయత్నాలు ఐటి ఉద్యోగులు ఐక్యంగా ఎదుర్కొని, తిప్పికొట్టడం ఈ సందర్భంగా గమనార్హం. మిగిలిన కార్మిక సంఘాలు కూడా ఇదే రీతిలో స్పందించాయి. కార్పొరేట్ ప్రపంచంలో కూడా సుబ్రమణ్యన్ వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. హర్ష్ వర్ధన్ గోయెంకా, ఆనంద్ మహీంద్ర తదితరులు ఆ వ్యాఖ్యలలోని హేతుబద్ధతను తప్పుపట్టారు.

కార్పొరేట్-మతశక్తుల కూటమిగా కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా పనిగంటలను పెంచేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా లేబర్‌కోడ్లను రూపొందించింది. ప్రస్తుతమున్న గరిష్ట పనివేళలను మార్చడానికి ఆ కోడ్‌లలో ప్రతిపాదించింది. కార్మిక సంఘాల నుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో లేబర్ కోడ్‌లను ఇంకా నోటిఫై చేయలేదు. మరోవైపు వివిధ రాష్ట్రాల్లో ఉన్న కొన్ని బిజెపి ప్రభుత్వాలు కూడా పనిగంటలు పెంచేందుకు చట్టాలు తీసుకు రావడానికి చేస్తున్న ప్రయత్నాలను కార్మిక సంఘాలు అడ్డుకుంటున్నాయి. ఉత్పత్తిని పెంచడానికి, ఆర్థిక వృద్ధిని సాధించడానికి కార్మికులు ఎక్కువ గంటలు పని చేయాలని కొన్ని కార్పొరేట్ శక్తుల మాదిరిగానే కేంద్రంతో పాటు రాష్ట్రాల్లో ఉన్న బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాలు కోరుకుంటుండటం గమనార్హం. ఇది కార్మికుల రక్తమాంసాలతో కార్పొరేట్లకు లాభాలను వండి, వడ్డించే దుర్మార్గ చర్య! పనిగంటలు పెంచితే కార్మికులు గుండెపోటుతో మరణించే అవకాశం ఉందంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన హెచ్చరిక ఈ సందర్భంగా ప్రస్తావనార్హం.

నిజానికి దేశాభివృద్ధికి ఆటకం కలిగిస్తున్న అంశాలేమిటి? ప్రస్తుత సంవత్సరం జిడిపి 6.4 శాతానికి తగ్గుతుందని, నాలుగేళ్లలో ఈ స్థాయి పతనం ఎప్పుడూ లేదని జాతీయ గణాంకాల సంస్థ తెలిపింది. ప్రజల వద్ద కొనేందుకు డబ్బు లేకపోవడంతో దేశీయ మార్కెట్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్న ఫలితమిది. గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న వారి వాస్తవ ఆదాయంలోఎటువంటి పెరుగుదల లేదు. దానికి తోడు ద్రవ్యోల్బణం వెంటాడుతోంది. నిరుద్యోగం ఏటికేడాది పెరుగుతూనే ఉంది. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి ప్రభావాలు మార్కెట్‌ను వెంటాడుతూనే ఉన్నాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం సామాజిక సంక్షేమ వ్యయాన్ని తగ్గిస్తోంది. రైతుల పంటలకు కనీస మద్దతు ధర లభించడంలేదు. ఉపాధిహామీ నిధుల్లోనూ కేంద్రం కోత పెట్టింది. కార్మికులు శ్రమించి అధికోత్పత్తి చేసినా మార్కెట్లలో కొనే నాధుడు లేని పరిస్థితి నెలకొంది. ఈ అస్తవ్యస్థ విధానాలు మారాలి. సరైన విశ్రాంతి, వినోదంతోనే కార్మికలోకం అసాధ్యమైన విజయాలను సైతం సుసాధ్యం చేస్తుందన్న నిజాన్ని పాలకవర్గాలు గుర్తించాలి. ఎనిమిది గంటల పని హక్కును పోరాడి సాధించుకున్న కార్మికవర్గం మళ్లీ అలాంటి పోరాటాలు చేసైనా దానిని నిలబెట్టుకోవాలి!

మహనీయుల మాట



చరిత్ర నిర్మించేది
రాజులూ, సైనిక జనరల్సూ కాదు.
ప్రజలే.
- నెల్సన్ మండేలా,
దక్షిణాఫ్రికా జాతిపిత.

పెట్టుబడిదారీ వ్యవస్థలో వేతన రహిత శ్రమ

విశ్లేషణ

సంజయ్ రాయ్

ఉత్పత్తి, సామాజిక పునరుత్పత్తిలో ఇమిడి ఉండే వేతన, వేతన రహిత శ్రమ పెట్టుబడి సంచయానికి దోహదం చేస్తుంది. సరుకులు, సేవల ఉత్పత్తికి అవసరమైన శ్రామికశక్తి ఒనగూడడానికి సామాజిక పునరుత్పత్తి సంవిధానం తోడ్పాటు ఇస్తుంది.

భారీ ఎత్తున జరిగే సరుకుల ఉత్పత్తిని పెట్టుబడిదారీ వ్యవస్థగా నిర్వచిస్తుంటారు. శ్రామికశక్తిని సరుకుగా మార్చడం పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణం. ఈ క్రమంలో సమాజంలోని శ్రామికులు నిస్సహాయంగా తయారయ్యే పరిస్థితులను నిరంతరాయంగా సృష్టిస్తూ ఉంటుంది పెట్టుబడిదారీ వ్యవస్థ. కార్మికులు తమ శ్రమ శక్తిని అమ్ముకున్నందుకు బదులుగా జీతం స్వీకరిస్తారు. కాబట్టి ఇది చెల్లుకు చెల్లు అన్న రీతిలో ఎంత మాత్రం నిర్బంధపూరితం కాని సర్వసాధారణ అంశంగా పైకి కనబడుతుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలు ఎవరి ఆధీనంలో ఉంటాయో ఆ యాజమానులకు అదనపు విలువ గడించి పెట్టేలా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తారు. యజమానులు లాభాలు, సంపదా పోగేసుకుంటూ ఉంటే కార్మికులు మాత్రం నానాటికీ పేదరికంలోకి జారిపోతూ ఉంటారు. ఉత్పత్తి సాధనాల మీద కార్మికులను హక్కులు లేకపోవడం దీనికి ప్రధాన కారణం. ఆదిమ పెట్టుబడి సంచయం ద్వారా అంటే నిర్బంధపూరిత విధానాల ద్వారా శ్రామికులను నిస్సహాయంగా మార్చడం అనేది ఇంకో పద్ధతి. ఇందులో ప్రత్యక్ష ఉత్పత్తిదారుడిని బలవంతంగా ఉత్పత్తి సాధనాల నుండి వేరు చేసి, ఈ ఉత్పత్తి సాధనాలను పెట్టుబడిగా మలిచి కార్మికులకు తమ శ్రమశక్తిని అమ్ముకోవడం మినహా మరో గత్యంతరం లేని పరిస్థితి సృష్టిస్తారు. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రామికీకరణ ప్రధాన ధోరణిగా కొనసాగుతుంది. అంటే కార్మికులు తమ శ్రమ శక్తిని అమ్ముకుని బదులుగా జీతాలు అందుకుంటారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ ముదిరాక శ్రామికీరణ మూలంగానే కార్మికులు నిస్సహాయులుగా మారతారని అనుకోనక్కరలేదు. ఎందుకంటే పెట్టుబడి ప్రత్యక్షంగా కార్మికులను పనిలో పెట్టుకోదు. అయితే పెట్టుబడి సంచయం జరిగే క్రమంలో శ్రమశక్తిని కల్పించడానికి కూడా శ్రమ చెయ్యాల్సి ఉంటుంది. ఈ శ్రమ వేతన రహిత శ్రమ కాబట్టి దీనికి పెద్దగా గుర్తింపు ఉండదు. వంట చెయ్యడం, పిల్లలను సాకడం, ఇంట్లో ముసలివాళ్ళకు సేవ చెయ్యడం, కుటుంబంలో సభ్యులందరి మంచి చెడ్డలు చూసుకోవడం ఇవన్నీ ప్రతి ఇంట్లో ఆడవాళ్ళు చేసే పైసా ప్రతిఫలం లేని చాకిరేయే. ఇది ఇంటి పని అని సరిపెడుతున్నారు. కానీ ఇది



వేతన రహిత శ్రమ అని వర్ధమాన దేశీల్లోనే కాదు అభివృద్ధి చెందిన దేశాల్లోనూ గుర్తిస్తున్నారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. 'కుటుంబ ఆదాయం' అనేది విచ్ఛిన్నం కావడం, సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, మానవ శ్రమకు బదులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో అటు అభివృద్ధి చెందిన దేశాల్లోనూ, ఇటు వర్ధమాన దేశాల్లోనూ వివిధ తరగతుల్లో వేర్వేరు కారణాల రీత్యా వేతన రహిత శ్రమ పెరుగుతూ వస్తున్నది.

ఉత్పత్తి, చలామణి వ్యయాల తగ్గింపు

పెట్టుబడి సంచయానికి ఉత్పత్తి, వినియోగం ఈ రెండూ కీలక అవసరాలే. పెట్టుబడిదారులు ముడిసరుకులు, యంత్రాలు, కార్మికుల శ్రమను కొనుగోలు చేయడానికి పెట్టుబడి పెడతారు. ఉత్పత్తి అయ్యే క్రమంలో అదనపు విలువ ద్వారా పెట్టుబడిదారులకు లాభాలు ఒనగూరుతాయి. అయితే ఈ లాభం పెట్టుబడిదారుడి సొంతం కావాలంటే ఉత్పత్తి అయిన సరుకు మార్కెట్‌లో అమ్ముడుపోవాలి. ఇది జరగాలంటే వాణిజ్య పెట్టుబడి అంటే వాణిజ్యపు ప్రకటనలు, సరుకులు, అమ్మే వ్యాపారులు అవసరం. ఉత్పత్తి అయిన సరుకులు మార్కెట్‌లో అమ్ముడయ్యేందుకు వీలుగా పెట్టుబడిదారుడు వాణిజ్య అవసరాల కోసం అదనపు విలువలో కొంత భాగాన్ని వదులుకోవాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియలో శ్రమశక్తి ఇమిడిపోయింది. పెట్టుబడిదారుడు అదనపు విలువను లాభంగా మార్చుకోవడంలో నష్టాన్ని నివారించుకోవడానికి గాను వేతన శ్రమకు బదులు వేతన రహిత శ్రమను వినియోగించుంటారు.

కుటుంబ వేతనం విచ్ఛిన్నం కావడంతో ఒక్క జీతంతో కుటుంబ పోషణ గడిచే పరిస్థితి ఉండదు. పూట గడవడం కోసం ఇంట్లో ఆడవాళ్లు కూడా పని వెతుక్కోవాల్సి వస్తుంది. లేదా ఇంట్లో మగ మనిషి పని కోసం పరాయి ఊళ్లోకి వలస వెళితే, మహిళలు ఇంటిపట్టునే ఉండి కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ వేతనరహిత శ్రమ చేయాల్సి వస్తుంది. పట్టణ ప్రాంతాల్లో కూడా వినియోగక్రమంలో కొనుగోలుదారులు వేతనరహిత శ్రమను అందించడం గణనీయంగా పెరిగింది. తద్వారా పెట్టుబడిదారు వాణిజ్య పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుంటాడు.

బట్టల షాపుల్లో, డిపార్ట్‌మెంట్ స్టోర్లలో ఇతరేతర షోరూముల్లో సేల్స్ సిబ్బందిని గణనీయంగా తగ్గించివేశారు. వెండింగ్ మిషన్లు, టెల్లర్ కౌంటర్లు ఏర్పాటు చేయడం, ఖాతాదారులకు సెల్ఫ్ సర్వీస్ అలవర్చడం ద్వారా రిటైల్ ఖర్చులు తగ్గించుకుంటున్నారు. అంటే వేతన రహిత శ్రమను ప్రజాక్షేత్రంలో కూడా విస్తృతపరిచి అమ్మకాల వ్యయాన్ని తగ్గించుకుంటున్నారు.

వాస్తవం ఏమిటంటే వివిధ రూపాల్లో వేతనరహిత శ్రమను పెంపొందిస్తున్నా తద్వారా ప్రత్యక్షంగా లాభాలను ఉత్పత్తి చేయలేరు. వేతన కార్మికుల నుండి ఎంత ఎక్కువగా శ్రమ దోపిడి చేస్తే అంత ఎక్కువ అదనపు విలువను పిండుకుంటుంది పెట్టుబడి. అయితే వివిధ రూపాల్లోని వేతన రహిత శ్రమ...శ్రమ శక్తిని మరింత చౌకగా మారుస్తుంది. అలాగే పంపిణీ వ్యయాన్ని తగ్గించి మరింత అదనపు విలువ పిండుకోవడానికి వీలవుతుంది.

వేతన కార్మికుల సంఖ్యను తగ్గించే, వేతనరహిత శ్రమను అందించే మిషన్లు ప్రవేశపెట్టడం ద్వారా తగ్గించుకుంటూ పోవడంద్వారా నిరుద్యోగం ప్రబలడానికి, కార్మికుల ఉమ్మడి బేరసారాల శక్తి తగ్గిపోవడానికి దారితీస్తుంది. కాబట్టి వేర్వేరు పరిస్థితులలో వేతనశ్రమ, వేతన రహిత శ్రమ మధ్య ఉన్న చలన సూత్రాలను పెట్టుబడి సంచయ స్వభావం నిర్ణయిస్తుంది. లాభాల హెచ్చింపుకు దోహదం చేస్తుంది. వర్ధమాన దేశాల్లోని స్వయం ఉపాధి కార్మికులు చౌక మార్కెట్లలో అమ్ముడుపోయే సరుకులు, సేవలు ఉత్పత్తి చెయ్యడం ద్వారా శ్రామికశక్తి పునరుత్పాదకతకు అవసరమయ్యే వ్యయాన్ని కట్టడి చేసేందుకు చూస్తారు. అలాగే సంఘటిత రంగంలో కాంట్రాక్టీకరణ ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవచ్చు. తద్వారా ఉత్పత్తి, సామాజిక పునరుత్పత్తి రంగాల రెండింటికీ వేతనేతర శ్రమ తోడ్పాటు ఇస్తుంది.

వివిధ వర్గాలపై వేర్వేరు ప్రభావాలు

వేతన శ్రమ, వేతనేతర శ్రమలు ప్రధాన వేతన ఆదాయానికి ఎలా తోడ్పడతాయనేది ఆ యా వర్గాల వారీగా, వేర్వేరుగా ఉంటుంది. శ్రామిక కుటుంబాలలో కుటుంబ వేతనం మీద అంటే ఒక వేతనం మీద ఆధారపడి కుటుంబ పోషణ గడిచే పరిస్థితి లేదు. నిజ వేతనాలు స్థంభించిపోవడమో, దిగజారి పోవడం మూలంగానో కుటుంబ పోషణ కోసం మహిళలు కూడా శ్రామిక శక్తిలో భాగస్వామ్యం కావడం నానాటికీ పెరుగుతూ వస్తుంది. ఈ విధంగా కుటుంబంలో ఇద్దరూ పని చేయాల్సి రావడంతో

" నిజ వేతనాలు స్థంభించిపోవడమో, దిగజారి పోవడం మూలంగానో కుటుంబ పోషణ కోసం మహిళలు కూడా శ్రామిక శక్తిలో భాగస్వామ్యం కావడం నానాటికీ పెరుగుతూ వస్తుంది. ఈ విధంగా కుటుంబంలో ఇద్దరూ పని చేయాల్సి రావడంతో వేతన రహిత శ్రమ అంటే ఇంటి పనులు, బిడ్డల సంరక్షణ వంటి బాధ్యతలు పలుచబడతాయి. ఉన్నత మధ్య తరగతి వర్గాల్లో ఈ పనులు చేసేందుకు పని మనుషులను పెట్టుకుంటారు. అంటే వేతన రహిత శ్రమ స్థానాన్ని వేతన శ్రమ భర్తీ చేస్తుంది. అదే ధనిక దేశాల్లో అయితే ఇంటి సనులు చక్కబెట్టడానికి రకరాల గృహోపకరణ సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఇవి కొనే స్థోమత, వీటిని వినియోగించగలిగే సమయం ఉన్న వారికే ఉపయోగకరం. అంటే ధనిక కుటుంబాల వేతన రహిత శ్రమ సామాజిక పునరుత్పత్తి కార్యకలాపాల వ్యయాన్ని తగ్గించడానికి దోహదపడుతుంది. అదే శ్రామిక కుటుంబాల్లో అయితే వాళ్ళ ఆదాయాలు కుటుంబ పోషణకీ బొటాబొటిగా సరిపోతాయి కాబట్టి ఇంటి పనుల కోసం వేరే మనుషులను పెట్టుకునే పరిస్థితి ఉండదు. పర్యవసానంగా వేతన రహిత శ్రమ కుంచించుకుపోయి సామాజిక పునరుత్పత్తి క్రమం అంతే పిల్లల ఆరోగ్యం, చదువులు మున్నగునవి దెబ్బతినిపోతాయి. అంటే వేతన శ్రమ, వేతనేతర శ్రమలు వివిధ తరగతులకు చెందిన ప్రజానీకం మీద వేర్వేరు ప్రభావాలు చూపుతాయని స్పష్టం అవుతున్నది. "

వేతన రహిత శ్రమ అంటే ఇంటి పనులు, బిడ్డల సంరక్షణ వంటి బాధ్యతలు పలుచబడతాయి.

ఉన్నత మధ్య తరగతి వర్గాల్లో ఈ పనులు చేసేందుకు పని మనుషులను పెట్టుకుంటారు. అంటే వేతన రహిత శ్రమ స్థానాన్ని వేతన శ్రమ భర్తీ చేస్తుంది. అదే ధనిక దేశాల్లో అయితే ఇంటి సనులు చక్కబెట్టడానికి రకరాల గృహోపకరణ సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఇవి కొనే స్థోమత, వీటిని వినియోగించగలిగే సమయం ఉన్న వారికే ఉపయోగకరం. అంటే ధనిక కుటుంబాల వేతన రహిత శ్రమ సామాజిక పునరుత్పత్తి కార్యకలాపాల వ్యయాన్ని తగ్గించడానికి దోహదపడుతుంది. అదే శ్రామిక కుటుంబాల్లో అయితే వాళ్ళ ఆదాయాలు కుటుంబ పోషణకీ బొటాబొటిగా సరిపోతాయి కాబట్టి ఇంటి పనుల కోసం వేరే మనుషులను పెట్టుకునే పరిస్థితి ఉండదు. పర్యవసానంగా వేతన రహిత శ్రమ కుంచించుకుపోయి సామాజిక పునరుత్పత్తి క్రమం అంతే పిల్లల ఆరోగ్యం, చదువులు మున్నగునవి దెబ్బతినిపోతాయి. అంటే వేతన శ్రమ, వేతనేతర శ్రమలు వివిధ తరగతులకు చెందిన ప్రజానీకం మీద వేర్వేరు ప్రభావాలు చూపుతాయని స్పష్టం అవుతున్నది.

అంతిమంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రత్యేకించి రోబోట్లు, కృతిమ మేధ వంటి వాటి వినియోగం భవిష్యత్‌లో వేతన శ్రమ, వేతన రహిత శ్రమ మీద ప్రభావం చూపించనున్నది. వేతన శ్రమను వేతన రహిత శ్రమలో భర్తీ చేయడం మూలంగా కార్మికుల నిజ వేతనాలు పడిపోయే అవకాశం ఉంటుంది.

సామాజిక పునరుత్పత్తి క్రమం మీద ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన ప్రభావం కారణంగా శ్రమశక్తి ఉత్పత్తి వ్యయం తగ్గుముఖం పడుతుంది. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థ సరుకులకు ఉన్న మారకపు విలువను మాత్రమే గుర్తిస్తుంది. వేతన రహిత శ్రమ ద్వారా ఉత్పత్తి అయిన ఉపయోగపు విలువ శ్రమశక్తి మారకం విలువ మీద గానీ వేతనాల మీద గానీ ప్రభావం చూపించగలిగితే అప్పుడు దానిని పరిగణనలోకి తీసుకుంటుంది. కాబట్టి ఇల్లు చక్కబెట్టడం, మరమ్మతులు చెయ్యడం తదితర స్వయం సేవలకు తోడ్పడే సాంకేతిక పరిజ్ఞానం పంపిణీ వ్యయాన్ని తగ్గించగలిగితే పెట్టుబడి దాన్ని లాభదాయకంగా పరిగణిస్తుంది.

కాబట్టి వేతన రహిత శ్రమ ద్వారా సృష్టించబడిన ఉపయోగపు విలువ మారకపు విలువకు లోబడి ఉంటుంది. అయితే వేతన శ్రమ కుంచించుకుపోతూ.. వేతన రహిత శ్రమ పెరిగిపోతూ...ఈ వేతన రహిత శ్రమ వేతన శ్రమ నుండి వేరుపడిన కొలదీ...దీనిని హీరోచితం చెయ్యడం పెట్టుబడిదారీ వ్యవస్థకు నానాటికీ క్లిష్టతరంగా మారుతుంది.

భక్తి - వ్యాపారం!

విమర్శ

' కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది మరింతగా పెరిగింది. రాందేవ్ పతంజలి వ్యాపారం వేల కోట్లకు పెరిగింది. డేరా బాబా లాంటి వారు శత కోటీశ్వరులయ్యారు. ప్రభు భక్తిని ప్రదర్శించుకోవడానికి అనేక మంది పెట్టుబడిదారులు ప్రత్యేక భక్తి ఛానెళ్లు పెట్టడం లేదా ప్రజాదరణ ఛానెళ్లలో భక్తి కార్యక్రమాల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారు. వీటి ద్వారా కార్పొరేట్ కంపెనీలకు, బిజెపి కి ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి. తమ సరుకుల ప్రచారంతో పాటు, లాభాలు రావడం కంపెనీల ప్రయోజనమైతే, ప్రజల విశ్వాసాలను ఉపయోగించుకుని రాజ్యాధికారాన్ని కొనసాగించడం కేంద్ర ప్రభుత్వానికి ప్రయోజనం. వీరి మాయలో పడకుండా సాధారణ ప్రజలను కాపాడుకోవడం లౌకిక, ప్రజాతంత్ర వాదుల బాధ్యతే కాదు, భక్తిని దైవంగా భావించే వారి బాధ్యత కూడా. '

తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురి ప్రాణాలు పోయాయి. ఈ ఆలయానికి ఉన్న జాతీయ, అంతర్జాతీయ పేరు ప్రఖ్యాతుల వల్ల ఈ సంఘటన మరింత సంచలనమైంది. దీనికి కొద్ది రోజుల ముందు 'మా ఆలయాలను మాకే అప్పగించండి' అని విజయవాడలో శంఖారావం పూరించిన పీఠాధిపతులు, మతాధిపతులు మాత్రం మరణించిన ఈ భక్తుల కుటుంబాల్లో ఒక్కరిని కూడా పరామర్శించిన దాఖలా లేదు.

వైకుంఠ దర్శనం కూడా వ్యాపారమేనా?

వైకుంఠ దర్శనం కొద్దిమంది పుజారులు, అగ్రకులాల్లోని సంపన్నులు మాత్రమే చేసేదిగా వుండేది. ప్రజలకు అంతగా తెలిసేది కాదు. అయితే ప్రచార ప్రభావంతో తొలి ఏకాదశి రోజున తెల్లవారుజామునే రాష్ట్రంలో అనేక చిన్న, పెద్ద దేవాలాయాల ముందు ఏడాదికేడాది భారీ క్యూలైన్లు పెరిగిపోతున్నాయి. దీనివల్ల ఆలయాలకు ఆదాయంతో పాటు, అనేక వ్యాపారాలు పెరిగాయి. ప్రాంతీయ ఆలయాల దగ్గరే ఇంతగా జనం పెరుగుతుంటే, అంతర్జాతీయంగా పేర్గాంచిన తిరుమల మాత్రం ఎందుకు వెనుకబడుతుంది. అక్కడికి భక్తుల రద్దీ భారీగా పెరిగింది. అందుకే ఒక్క రోజు జరగాల్సిన వైకుంఠ దర్శనాన్ని గత ఇరవైఐదు సంవత్సరాల క్రితం నుండి ఆ మరుసటి రోజు ద్వాదశి రోజుకు పెంచి దేశ, విదేశాల్లో ప్రచారం చేశారు. మరింతగా రద్దీ పెరగడంతో ఈ ద్వారాన్ని ఏకంగా పది రోజుల వరకు తెరచి వుంచాలని గత ప్రభుత్వ కాలంలో టిటిడి నిర్ణయించింది. అప్పటి వరకు రోజుకు పది వేల మందికి మాత్రమే వున్న దర్శన భాగ్యాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం 60 నుండి 75 వేల మందికి పెంచింది. అంటే పది రోజుల్లో ఏడు లక్షల మంది వైకుంఠ ద్వారం ద్వార దర్శనం చేసుకోవచ్చు. ఇలా ఒక్క రోజు జరగాల్సిన వైకుంఠ దర్శనం రెండు రోజులకు, ఆ తర్వాత పదిరోజులకు పెరగడం సమ్మతమా, అసమ్మతమా అని వేదవేదాంగ పండితులు టీవీల్లో చర్చోప చర్చలు చేశారు, చేస్తున్నారు. జనం మాత్రం పెద్ద సంఖ్యలో తిరుపతికి వస్తున్నారు. ఒక్క వైకుంఠ దర్శనమే కాదు, పుష్కరాలకు, కుంభమేళాలకు, అయ్యప్ప, భవానీ, వెంకటేశ్వర మాలలు, ప్రవచన సభలకు, స్వస్థత సభలకు ఇలా ఒక్కటేమిటి భక్తి కార్యాలన్నింటికీ జనం పెద్ద సంఖ్యలో వెళ్తున్నారు.



వి. రాంభూపాల్

ప్రపంచీకరణ విధానాలు ఒకవైపు ఉపాధి అవకాశాలు తగ్గించి, మరోవైపు ఆశలు, భ్రమలు పెంచి ప్రజలను అప్పుల ఊబిలో ముంచేశాయి. ఈ స్థితి నుండి బయట పడటానికి ప్రజలు ఒకవైపు రాజకీయ పార్టీలను, మరోవైపు మత విశ్వాసాలను ఆశ్రయిస్తున్నారు. పార్టీల హామీలను నమ్మి మోసపోవడం, కనిపించని దైవం కరుణిస్తుందేమోనని ఆశపడి మరింతగా అప్పుల్లో కూరుకుపోవడం, తొక్కిసలాటల్లో చనిపోవడం పెరిగింది. తిరుపతి తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయి, గాయపడి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సాక్షాత్తు ముఖ్యమంత్రి ఎదురుగానే టిటిడి ధర్మకర్తలు, అధికారులు వాదోపవాదాలు చేసుకోవడం, ఉచిత దర్శనాల టోకెన్లు అడుక్కునేవారిలాగా చూస్తున్నారని పాలక మండలి సభ్యులు వాపోవడం, కొత్తగా హైందవ ధర్మ సంరక్షణ భుజకీర్తులు ధరించిన పవన్ కల్యాణ్ క్షమాపణలు చుట్టూ తిప్పడం, ఓ పత్రికాధిపతి కొత్తపలుకులు చూసిన ఏ తెలుగువారికైనా వందల ఏళ్ళనాటి వేమన 'ఆత్మశుద్ధి లేని ఆచార మదియేల, భాండశుద్ధి లేని పాకమేల? చిత్తశుద్ధి లేని శివపూజలేలరా?' పద్యం గుర్తుకు వస్తుంది.

దర్శనాలు-తొక్కిసలాటలు-మరణాలు

శాస్త్ర విజ్ఞానం పెరిగేకొద్దీ ఆరాధన, విశ్వాసం తగ్గిపోవాలి. కానీ ఆచరణలో అందుకు విరుద్ధంగా జరుగుతున్నట్లు కనిపిస్తుంది. ప్రజల మనస్సుల్లో తరతరాలుగా నాటుకున్న విశ్వాసాన్ని వ్యాపార సరుకుగా మార్చి కంపెనీలు, రాజకీయాలకు వాడుకొని పాలక పార్టీలు లాభపడుతున్నాయి. ప్రత్యేక దర్శనాలు, పుష్కరాలు, మేళాలు, ఇస్తమాలు, స్వస్థత సభలకు లక్షల సంఖ్యలో జనాన్ని పోగేస్తున్నారు. అసౌకర్యాల నడుమ జరుగుతున్న తొక్కిసలాటల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటి వరకు దేశంలో జరిగిన కొన్ని ప్రధాన తొక్కిసలాటల్లో చనిపోయిన వారిలో అత్యధికులు పేదలు, శూద్రులు, దళితులు, గిరిజనులు మాత్రమే. 1954 ఫిబ్రవరి 3న అలహాబాద్ కుంభమేళాలో దాదాపు 800 మంది, 1986 ఏప్రిల్ 14 హరిద్వార్‌లో 46 మంది, 1996 జులై 15న మధ్యప్రదేశ్ ఉజ్జయిని ఘటనలో 60 మంది, 1999 జనవరి 14న శబరిమలై దుర్ఘటనలో 53 మంది, 1996 సెప్టెంబరు 18న కోల్‌కతాలో 35 మంది, 2003 ఆగస్టు 27న నాసిక్ కుంభమేళాలో 29 మంది, 2005 జనవరి 25న మహారాష్ట్ర సతారాలో 300 మంది, 2008 సెప్టెంబరు 30న రాజస్థాన్‌లోని చాముండి ఆలయ దుర్ఘటనలో 249 మంది, అదే ఏడాది ఆగస్టు 3న హిమాచల్‌ప్రదేశ్‌లో నైనాదేవి ఆలయం వద్ద 162 మంది, 2010 మార్చి 4న ఉత్తరప్రదేశ్ రాంజానకీ ఆలయంలో చోటు చేసుకున్న దుర్ఘటనలో 63 మంది, 2011 జనవరి 14న శబరిమలై సంఘటనలో106 మంది మృత్యువాత పడ్డారు. 2013 అక్టోబరు 14న మధ్యప్రదేశ్‌లో దేవీ నవరాత్రుల సందర్భంగా 115 మంది, అదే ఏడాది అలహాబాద్ కుంభమేళాలో 37 మంది, 2015 జులై 14న రాజమండ్రి గోదావరి పుష్కరాల్లో 30 మంది మరణించారు. ముస్లిం, క్రైస్తవ మత కార్యక్రమాల్లో కూడా ఇలాంటి మరణాలు అనేకం జరిగాయి.

భక్తి కూడా వ్యాపారంగా ....

ప్రజల్లో భక్తిభావాలు చాలా కాలంగా వున్నా, ప్రపంచీకరణ విధానాలు ప్రారంభమైన 1991 తర్వాత వాటిని వ్యాపారంగా మార్చడం పెరిగింది. 2000 తర్వాత పూర్తిగా మతపరమైన కార్యక్రమాలు మాత్రమే ప్రసారం చేసే ఛానళ్లు దేశంలోనూ, రాష్ట్రంలోనూ పెరిగాయి. దుబాయ్‌కి చెందిన వ్యాపారవేత్త కిషోర్ మెహతా దేశంలో ఇలాంటి ఛానల్‌ను మొదట ప్రారంభించాడు. ఆ తర్వాత బాబా రాందేవ్, పండిట్ రవిశంకర్‌జీ లాంటి వారు రంగ ప్రవేశం చేశారు. రాందేవ్ సంస్కార్ ఇన్ఫో టివి ప్రై లిమిటెడ్, ఆశా బ్రాడ్‌కాస్టింగ్ లిమిటెడ్ పేరుతో ఆస్తా టీవీ, సంస్కార్ టీవీ, అరిహంత్ టీవీ, ఆస్తా భజన టీవీ, సంత్సంగ్ టీవీ, ఆస్తా తెలుగు, కన్నడ, తమిళం ఛానళ్లు ఇలా విస్తరించాయి. ఇందులో భక్తిభావం ఎంతోకానీ ఆదాయ పుష్టి మాత్రం ఎక్కువే. ఒక నెలకు రోజుకు ఒకసారి పది సెకన్ల వ్యాపార ప్రకటనకు ఆస్తా టీవీ రూ.80 వేలు, సంస్కార్ టీవీ రూ.1,15,000 తీసుకుంటుందని ప్రముఖ జర్నలిస్టు జ్యోతేంద్ర దూబే పరిశోధించి ప్రకటించారు. సంస్కార్ టీవీ 33.4



కోట్ల టర్నోవర్‌పై 8.7 కోట్ల లాభాన్ని అంటే 26 శాతం లాభం సంపాదించింది. మన రాష్ట్రంలో భక్తి టీవీ తుమ్మల నరేంద్ర చౌదరి రచన టెలివిజన్ నెట్‌వర్క్ పేరుతో ప్రారంభించాడు. ఆ తర్వాత అనేకమంది భక్తి వ్యాపారంలో మునిగి తేలుతున్నారు. వ్యాపారానికి మతంతో పని లేదనేందుకు చక్కటి ఉదాహరణ 'జీ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్'. ఈ సంస్థ 2003లో 'జీ జాగరణ్' అనే హిందూ మత భక్తి ఛానల్‌ని, 2010లో 'జీ సలామ్' అనే ఇస్లాం భక్తి ఛానల్‌ను ప్రారంభించింది. ఎవరికి ఏం కావాలో అది చూయించడం అందరికీ మాత్రం కంపెనీల ప్రకటనలను ప్రచారం చేసి దేశీయ చిన్న, మధ్యతరహా కంపెనీలను దివాళా తీయించడం. టీవీలు మాత్రమే కాదు, యూట్యూబ్ ఛానళ్లు, పత్రికలు అనేకం భక్తి పేరుతో అత్యధిక లాభాల్లో నడుస్తున్నాయి.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇది మరింతగా పెరిగింది. రాందేవ్ పతంజలి వ్యాపారం వేల కోట్లకు పెరిగింది. డేరా బాబా లాంటి వారు శత కోటీశ్వరులయ్యారు. ప్రభు భక్తిని ప్రదర్శించుకోవడానికి అనేక మంది పెట్టుబడిదారులు ప్రత్యేక భక్తి ఛానళ్లు పెట్టడం లేదా ప్రజాదరణ పొందిన ఛానళ్లలో భక్తి కార్యక్రమాల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారు. వీటి ద్వారా కార్పొరేట్ కంపెనీలకు, బిజెపి కి ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి. తమ సరుకుల ప్రచారంతో పాటు, లాభాలు రావడం కంపెనీల ప్రయోజనమైతే, ప్రజల విశ్వాసాలను ఉపయోగించుకుని రాజ్యాధికారాన్ని కొనసాగించడం కేంద్ర ప్రభుత్వానికి ప్రయోజనం. వీరి మాయలో పడకుండా సాధారణ ప్రజలను కాపాడుకోవడం లౌకిక, ప్రజాతంత్ర వాదుల బాధ్యత. లేకపోతే పండుగలు, ఉత్సవాలు, పుష్కరాలు, కుంభమేళాలు వ్యాపారంగా మారిపోతాయి. ఇప్పటికే సంక్రాంతి అంటే కోట్ల రూపాయల కోడిపందేలు, వినాయక చవితి అంటే లడ్డు వేలంగా మారడం చూస్తున్నాం.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

జనవాక్యం

హై హై ప్రతి నాయకా...

ఇప్పుడిదే ట్రెండ్. సినిమా కానివ్వండి, రాజకీయాలు కానివ్వండి. ప్రతినాయక గుణాలున్న నాయకుడిదే హవా. బాక్సాఫీసు దగ్గర తగ్గేదేలా. అమెరికా కాబోయే అధ్యక్షుడు ట్రంప్‌ని ఒక కేసులో ముద్దాయి (ఫెలొని)గా అక్కడి న్యాయ వ్యవస్థ ఖరారు చేసింది. అయితే ఆయన చేపడుతున్న పదవి దృష్ట్యా నేరానికి ఏ రకమైన శిక్షా విధించడం లేదని, విడిచి పెట్టేస్తున్నామని తీర్పు చెప్పింది. అధ్యక్షుడికి ఉన్న ప్రత్యేక అధికారాల వల్ల మిగతా మూడు నేర సంబంధిత కేసులు కొట్టి వేయవచ్చు లేదా వాయిదా పడవచ్చు కానీ ఇలా నేరస్తుడి ముద్ర పడిన తొలి అధ్యక్షుడు ఆయనే అవుతారు. ఒకందుకు అక్కడి న్యాయ వ్యవస్థని మెచ్చుకోవచ్చు. అధ్యక్షుడిగా ఖరారు అయినా ఆయన కేసు వాయిదాల మీద వాయిదాలు పడలేదు. ప్రక్రియ ఆగలేదు. అందులో ఎలాంటి రాయితీ దొరకలేదు. అదే ఇక్కడ అయితేనా, పదవిలో ఉన్న నిందితుల పిల్లలు కూడా ముసలి వాళ్లు అయిపోతారు. ఎటూ తేలదు. అక్కడ ట్రంప్ శిక్ష రద్దు చేసి ఉండొచ్చు కానీ నేరం చేశావని సర్వ శక్తివంతుడైన అధ్యక్షుడినే బోనులో నిలబెట్టడం బాగుంది.

- డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

ప్రతీక, మంధాన సెంచరీలు

- భారత్ ఖాతాలో రెండు రికార్డులు
- అత్యధిక స్కోర్, అత్యధిక పరుగుల తేడాతో గెలుపు
- మూడో వన్డేలో ఐర్లాండ్‌పై 304 పరుగుల తేడాతో గెలుపు
- వన్డే సిరీస్ 3-0తో అమ్మాయిలు క్లీన్‌స్వీప్



వన్డే సిరీస్ ట్రోఫీతో భారత మహిళలజట్టు

రాజ్‌కోట్: భారత మహిళల జట్టు వన్డేల్లో సరికొత్త రికార్డులు నమోదు చేసింది. రాజ్‌కోట్ వేదికగా ఐర్లాండ్‌తో బుధవారం జరిగిన మూడో, చివరి వన్డేలో అత్యధిక స్కోర్, అత్యధిక పరుగుల తేడాతో గెలుపుతో రికార్డు పుటల్లోకెక్కింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగి 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 435పరుగులు చేసింది. వన్డే క్రికెట్ చరిత్రలో టీమిండియా మహిళల జట్టుకు ఇదే అత్యధిక స్కోర్. అలాగే ఐర్లాండ్‌పై 304పరుగుల భారీ తేడాతో గెలిచింది. అంతకుముందు 2017లో ఐర్లాండ్‌పైనే భారత మహిళల జట్టు 249 తేడాతో నెగ్గింది. తాజాగా ఆ రికార్డును బ్రేక్ చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను ఓపెనర్లు మంధాన, ప్రతీకా రావల్ సెంచరీలతో చెలరేగారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 233 పరుగులు జోడించారు. మంధాన వన్డేల్లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసింది. 70 బంతుల్లో సెంచరీ కొట్టింది. ఓవరాల్‌గా 80 బంతుల్లో 12ఫోర్లు, 7సిక్సర్ల సాయంతో 135 పరుగులు చేసింది. మరో ఓపెనర్ ప్రతీకా రావల్.. వన్డేల్లో తొలి సెంచరీ. ఆమె 129 బంతుల్లో 20ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 154పరుగులు చేసింది. ఆ తర్వాత ధాటిగా ఆడే క్రమంలో రీచా ఘోష్(59) అర్ధసెంచరీతో మెరిసినా.. తేజల్(28), హర్లిన్(15) త్వరగా పెవీలియన్‌కు చేరారు. దీంతో టీమిండియా 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 435పరుగుల రికార్డు స్కోర్‌ను నమోదు చేసింది. ఐర్లాండ్ బౌలర్లు ప్రెండెర్‌గ్వెస్ట్ రెండు, కెల్లె, సర్జెంట్, డెంసే ఒక్కో వికెట్ పడగొట్టారు. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఐర్లాండ్‌ను భారత బౌలర్లు కట్టడి చేశారు. దీప్తి శర్మ(3/27), తనూజ(2/31)కి తోడు టిటాస్ సద్దు, సయాలి, మిన్ను మణి ఒక్కో వికెట్‌తో రాణించారు. ఐర్లాండ్ ఓపెనర్ ఫ్రోబెస్(43), ప్రెండెర్‌గ్వెస్ట్(36) టాప్‌స్కోరర్స్. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ ప్రతికా రావల్‌కు దక్కాయి. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్‌ను స్మృతి మంధాన సేన 3-0తో చేజిక్కించుకొని క్లీన్‌స్వీప్ చేసింది.

స్కోర్‌బోర్డు...

ఇండియా మహిళల ఇన్నింగ్స్: ప్రతికా రావల్ (సి)డెంసే (బి)ఫ్రేయా సర్జెంట్ 154, స్మృతి మంధాన (సి)కానింగ్ (బి)ప్రెండెర్‌గ్వెస్ట్ 135, రీచా ఘోష్ (బి)అరియానే కెల్లె 59, తేజల్ హసబ్నిస్ (సి)లారా (బి)ప్రెండెర్‌గ్వెస్ట్ 28, హర్లిన్ డియోల్ (సి)ప్రెండెర్‌గ్వెస్ట్ (బి)జార్జియానా 15, జెమీమా రోడ్రిగ్స్ (నాటౌట్) 4, దీప్తి శర్మ (నాటౌట్) 11, అదనం 29. (50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 435పరుగులు. **వికెట్ల పతనం:** 1/233, 2/337, 3/387, 4/415, 5/410 **బౌలింగ్:** ప్రెండెర్‌గ్వెస్ట్ 8-0-71-2, కానింగ్ 8-0-64-0, కెల్లె 7-0-66-1, ఫ్రెయా సర్జెంట్ 8-0-68-1, జార్జియానా డెంసే 10-0-65-1, డైజెల్ 3-0-28-0, లారా డెలానే 6-0-59-0

ఐర్లాండ్ మహిళల ఇన్నింగ్స్: ఫోర్బెస్ (రనౌట్) దీప్తి 41, లెవీస్ (ఎల్‌బి)టిటాస్ సద్దు 1, కర్టీ రెలె (బి)సయాలీ 0, ఓర్లా ప్రెండెర్‌గ్వెస్ట్ (బి)తేజల్ కన్వార్ 36, లారా డెలానీ (బి)దీప్తి 10, లెహ్ పాల్ (సి అండ్ బి)దీప్తి 15, ఆరియానే కెల్లె (సి)సర్జేట్ (బి)తేజల్ కన్వార్ 2, కానింగ్ (బి)మిన్ను మణి 2, డెంసే (రనౌట్)తనూజ/రీచా 0, డాల్జెల్ (నాటౌట్) 5, సర్జెంట్ (సి)మిన్ను మణి (బి)దీప్తి 1, అదనం 18. (31.4ఓవర్లలో ఆలౌట్) 131పరుగులు. **వికెట్ల పతనం:** 1/18, 2/24, 3/80, 4/100, 5/115, 6/122, 7/122, 8/122, 9/128, 10/131 **బౌలింగ్:** టిటాస్ సద్దు 4-1-22-1, సయాలి సత్ఘారే 4-0-24-1, తనూజ కన్వార్ 9-2-31-2, దీప్తి శర్మ 8.4-2-27-3, మిన్ను మణి 6-0-22-1.

మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక స్కోర్లు...
1. న్యూజిలాండ్ 494/1 : ఐర్లాండ్‌పై, డంబ్లిన్(2018)
2. న్యూజిలాండ్ 455/5 : పాకిస్తాన్‌పై, క్రైస్ట్‌చర్చ్(1997)
3. న్యూజిలాండ్ 440/3 : ఐర్లాండ్‌పై, డంబ్లిన్(2018)
4. ఇండియా 435/5 : ఐర్లాండ్‌పై, రాజ్‌కోట్(2025)
5. న్యూజిలాండ్ 418 : ఐర్లాండ్‌పై, డంబ్లిన్(2018)

మూడోరౌండ్‌కు జ్వెరేవ్, జకోవిచ్

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ మూడోరౌండ్‌లోకి 2వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ), 7వ సీడ్, నొవాక్ జకోవిచ్(సెర్బియా) ప్రవేశించారు. బుధవారం జరిగిన రెండోరౌండ్ పోటీల్లో జ్వెరేవ్ 6-1, 6-4, 6-1తో స్పెయిన్‌కు చెందిన అన్‌సీడెడ్ మార్టినేజ్‌ను చిత్తుచేయగా.. జకోవిచ్ 6-1, 6-7(4-7), 6-3, 6-2తో ఫ్రరియా(పోర్చుగల్)ను చిత్తుచేశాడు. మరో పోటీలో 12వ సీడ్ టామీ పాల్(అమెరికా) 6-7(3-7), 6-0, 6-3, 6-1తో నిషికోరి(జపాన్)ను, 14వ సీడ్ హంబర్ట్(ఫ్రాన్స్) 6-3, 6-4, 6-4తో హబీబ్(లెబనాన్)ను ఓడించి మూడోరౌండ్‌కు చేరారు. ఇక 6వ సీడ్ రూఢ్(బ్రిటన్), 22వ సీడ్ కోర్డా(అమెరికా), 29వ సీడ్ అగర్(కెనడా) అనూహ్యంగా రెండోరౌండ్‌లోనే ఓటమిపాలయ్యారు. రూఢ్ 2-6, 6-3, 1-6, 4-6తో జెన్సిక్(చెక్) చేతిలో, కొర్డా 4-6, 6-3, 6-2, 3-6, 5-7తో యూవిక్(ఆస్ట్రేలియా) చేతిలో పరాజయాన్ని చవిచూశారు. ఇక అగర్ 7-6(9-7), 7-6(7-5), 4-6, 1-6, 3-6 తేడాతో డావిడోవిచ్(స్పెయిన్) అన్‌సీడెడ్ చేతిలో ఓటమిపాలయ్యాడు.

ఫెదరర్ రికార్డును బ్రేక్ చేసిన జకో

టెన్నిస్ స్టార్ నోవాక్ జోకోవిచ్ కొత్త రికార్డు క్రియేట్ చేశాడు. ఓపెన్ ఎరాలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ మ్యాచ్‌లు ఆడిన ఘనతను జకోవిచ్ దక్కించుకున్నాడు. ఇప్పటి వరకు రోజర్ ఫెదరర్ పేరిట ఉన్న రికార్డును అతను బ్రేక్ చేశాడు. ఆస్ట్రేలియా ఓపెన్‌లో మూడవ రౌండ్‌లోకి ప్రవేశించిన జోకోవిచ్ ఈ కొత్త మైలురాయి చేరుకు న్నాడు. గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీల్లో ఇప్పటి వరకు జకోవిచ్ 430మ్యాచ్‌లను గెలుచుకున్నాడు. ఆ జాబితాలో రోజర్ ఫెదరర్ 429 మ్యాచ్‌లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఆల్‌టైం రికార్డును బ్రేక్ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు జకోవిచ్ చెప్పాడు. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన జకోవిచ్.. ప్రస్తుతం ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో దూసుకెళ్తున్నాడు. టెన్నిస్‌ను ప్రేమిస్తాను, పోటీలను ప్రేమిస్తాను, ప్రతిసారి బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తాను, 20 ఏళ్లుగా గ్రాండ్‌స్లామ్ పోటీల్లో ఆడుతున్నానని, ఓడినా..గెలిచినా.. పూర్తిగా ఆటను ఆస్వాదిస్తానన్నాడు.

గాఫ్, ఒసాకా జోరు...

మహిళల సింగిల్స్‌లో అమెరికా సంచలనం కోకా గాఫ్, జపాన్ భామ నవోమీ ఒసాకా మూడోరౌండ్‌కు చేరారు. గాఫ్ 6-3, 7-5తో బెర్రాజి(బ్రిటన్)ను చిత్తుచేయగా.. ఒసాకా 1-6, 6-1, 6-3తో 20వ సీడ్ ముఛోవా(చెక్)ను చిత్తుచేసింది. మరో పోటీలో 11వ సీడ్ బడోసా(స్పెయిన్) 6-1, 6-0తో గిబ్సన్(ఆస్ట్రేలియా)ను ఓడించగా.. 30వ సీడ్ ఫెర్నాండెజ్(కెనడా) మూడోసెట్ల హోరాహోరీ పోరులో బుస్కా(స్పెయిన్)పై చెమటోడ్చి నెగ్గింది. ఫెర్నాండెస్ 3-6తో తొలిసెట్‌ను కోల్పోయినా.. ఆ తర్వాత 6-4, 6-4తో మిగిలిన రెండు సెట్లను కైవసం చేసుకొని మ్యాచ్‌ను ముగించింది.

'... వచ్చారు.. పండగని తెచ్చారు'




ఈ ఏడాది సంక్రాంతిని పురస్కరించుకుని విడుదలైన చిత్రాల్లో వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షీ చౌదరి నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను బాగా ఆకట్టుకుంటోంది. తమ చిత్రానికి మంచి ఆదరణ లభిస్తోందని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ట్విట్టర్ ద్వారా వెల్లడించింది. 'పండుగకి వచ్చారు.. పండగని తెచ్చారు' అంటూ క్యాప్షన్ కూడా ఇచ్చింది. బాలకృష్ణ కథానాయకుడిగా బాబి దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'డాకు మహారాజ్'. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా మొదటిరోజు ఉదయం పూట మిక్సిడ్ టాక్‌ను అందుకుని సాయంత్రం నుంచి పాజిటివ్ టాక్‌తో నడుస్తోంది. బాబీ డియోల్, ప్రగ్యాజైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, చాందిని చౌదరి, ఊర్వశిరౌతేలా తదితరులు నటించి మెప్పించారు. తమన్ సంగీతం అద్భుతంగా సాగింది. సరికొత్తగా బాలకృష్ణ రూపంతో కనిపించటంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గేమ్ ఛేంజర్' ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. ఒకేఒక్కడు, ఒక్కడు వంటి బ్లాక్ బస్టర్ సినిమాల కాంబినేషన్‌లో ఈ సినిమా హిట్ అవుతుందనీ, రామ్‌చరణ్‌కు జాతీయ ఉత్తమ నటుడు అవార్డు వస్తుందని శంకర్ ప్రకటించారు. శంకర్ మార్క్ కథ, కథనం ఉన్నా, సంక్రాంతి పండుగ సమయంలో పొలిటికల్ డ్రామాతో సినిమా రావటంతో ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేదు. విడుదలకు ముందే ఈ సినిమా నుంచి ముఖ్యమైన సీన్లు వెల్లడికావటం కూడా కొంత ప్రభావం చూపించింది.

ప్రేమసాగరంలో అలజడులే 'తరుణం'



'నీ చూపు మెరిసిన క్షణం..మదిలో మూగబోయిన మాటలెన్నో...నీ చిరునవ్వు విరిసిన తరుణం...యదలో ఉప్పొంగే ఊహలెన్నో...నీ తలపు మెదిలిన నిమిషం..భాషతో తెలుపలేని భావాలెన్నో...నీ ప్రేమ తీరం చేరాలనే నా పయనంలో..హృదయ సాగరంలో అల(జడు)లెన్నో...' అంటూ డ్యూయెట్లు...ప్రేమను వ్యక్తపరిచే సంఘటనలు...' వాలెంటైన్స్ డే సందర్భంగా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 'తరుణం' చిత్ర యూనిట్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. 'ప్రేమకు స్వేచ్ఛనివ్వండి' అనే కొటేషన్‌తో పోస్టర్ పైన ఉంది. ప్రేమసి ప్రేమికుడికి తెలిపే భాసలను పై విధంగా ప్రస్తావించారు. తెలుగు వన్ డాట్ కామ్ సంస్థ అధినేత కంఠంనేని రవిశంకర్ నిర్మాణంలో సరికొత్త ప్రేమకథగా ఈ చిత్రం తెరకెక్కింది. యువ దర్శకుడు అఫ్జల్ ఈ సినిమాను తెరకెక్కించారు. యార్లగడ్డ జితేంద్ర, రమ్యశ్రీ నటీనటులుగా తొలిపరిచయం. వాలెంటైన్స్ డేను పురస్కరించుకొని ఫిబ్రవరి 14న ఈ సినిమాను విడుదలచేయబోతున్నారు.

1000 వాలా కొత్త పోస్టర్ ఆవిష్కరణ



సూపర్‌హిట్ మూవీ మేకర్స్ పతాకంపై షారుఖ్ నిర్మాణంలో అమిత్ కథానాయకుడిగా నూతన పరిచయంతో తెరకెక్కిన చిత్రం '1000 వాలా'. షారుఖ్, నవిత, కీర్తి, సుమన్, పిల్లా ప్రసాద్, ముఖ్తార్‌ఖాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. షఉటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నిర్మాణాంతర కార్యక్రమాలను పూర్తిచేసుకుంటోంది. 10 రూపీస్ చిత్రం దర్శకుడు అఫ్జల్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను మేకర్లు విడుదల చేశారు. త్వరలోనే ఆడియో విడుదల చేస్తామనీ, చిత్రం ఎప్పుడు విడుదల చేసేది కూడా త్వరలోనే ప్రకటిస్తామని దర్శకుడు అఫ్జల్ తెలిపారు. రచయిత గౌస్ ఖాజా ఖాజా,కూర్పు రవితేజ జి, పాటలు సందీప్ వేపూరి, కొరియోగ్రఫీ బాలు, సూర్య, కెమెరా: చందు యేజే, సంగీతం: వంశీకాంత్ రేఖాన.

నెట్‌ఫ్లిక్స్‌తో 'ఓజీ', 'తండేల్' చిత్ర యూనిట్ ఒప్పందం



ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్ టాలీవుడ్‌తోపాటుగా దక్షిణాది చిత్రాలపై దృష్టిసారించింది. గతేడాది టాలీవుడ్‌లో బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సొంతం చేసుకున్న అనేక చిత్రాల స్ట్రీమింగ్ రైట్స్ దక్కించుకుంది. ఈ ఏడాది కూడా అదే ఒరవడిని కొనసాగించేందుకు సిద్ధమైంది. ఈ ఏడాది నెట్‌ఫ్లిక్స్ ఖాతాలో పవన్ కళ్యాణ్ 'ఓజీ', నాగచైతన్య 'తండేల్'తో సహా పలు పెద్ద ప్రాజెక్టులు కొనుగోలు చేసింది. వాటి వివరాలను సైతం వెల్లడించింది. పవన్ కళ్యాణ్ నటిస్తున్న చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైనా ఇంకా పూర్తికాలేదు. మిగిలిన పార్టును పూర్తిచేయటం ద్వారా ఈ ఏడాదిలోనే ఈ సినిమా విడుదల చేయాలని చిత్ర యూనిట్ ప్రయత్నాలు చేస్తోంది. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ కథనాయిక. ఇమ్రాన్ హష్మి కీలక పాత్ర పోషించనున్నారు. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'తండేల్'. ఈ రెండు చిత్రాల ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్ కొనుగోలు చేసింది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పాటకు యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్ వస్తున్నాయి. ఫిబ్రవరి ఏడోతేదీన ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'మాస్ జాతర'. 75వ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. 'ధమాకా' వంటి హిట్ సినిమా తర్వాత రవితేజ, శ్రీలీల మళ్లీ జంటగా నటిస్తున్న సినిమా ఇదే. ఎస్ఐ లక్ష్మణ్ భేరీ పాత్రలో రవితేజ నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మే 9న ఈ సినిమా విడుదల కానుంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా తిన్ననూరి దర్శకత్వంలో 'వీడీ 12(వర్కింగ్ టైటిల్)' సినిమా తెరకెక్కుతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

ఈ చిత్రంలో భాగ్యశ్రీబోర్సే, రుక్మిణీవసంత్ కథానాయికలు. ఈ చిత్రం ఓటీటీ స్ట్రీమింగ్ రైట్స్‌ను కూడా నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. వీటితోపాటుగా నాని హిట్ 3, మ్యాడ్‌స్క్వేర్, జాక్, అనగనగా ఒకరోజు సినిమాలను సైతం నెట్‌ఫ్లిక్స్ కొనుగోలుచేసింది.



వణుకుతున్న మన్యం

- పొగ మంచుతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- 9 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి-పాడేరు (అల్లూరి జిల్లా)

మన్యాన్ని చలి పులి వణికిస్తోంది. ఏజెన్సీ అంతటా ఉష్ణోగ్రత పది డిగ్రీలకు పడి పోయింది. రేయింబగళ్ళు దట్టంగా పొగ మంచు కురుస్తోంది. దీంతో, చలి మరింత అధికమవుతోంది. చలి తీవ్రతతో మన్య ప్రజలు గజగజ వణుకుతున్నారు. వేకువ జాము, ఉదయం పూట, రాత్రి వేళల్లో బయట ప్రదేశాల్లో పనులు నిర్వర్తించుకునే ప్రజలు పొగ మంచు తీవ్రతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఘాట్ ప్రయాణాల్లో వాహన చోదకులు పొగ మంచుతో రోడ్డు కానరాక తీవ్ర అవస్థలు పడుతున్నారు. పగటిపూట కూడా వాహనాలు లైట్లు వేసుకుని వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. మధ్యాహ్నం బారెడు పొతే వరకు ఎండా కానరాలేదు. మన్యం ప్రజలు మిట్ట మధ్యాహ్నంకి గాని ఎండను చూడలేని పరిస్థితి ఉంది. మన్యవాసులు చలి తీవ్రతతో ఉన్నివస్త్రాలు ధరించి.. నెగళ్లు వేసుకుని చలి మంటలతో ఉపశమనం పొందుతూ జీవనం సాగిస్తున్నారు. చలి వాతావరణంతో వచ్చే వ్యాధుల మూలంగా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆస్తమా ఇతర శ్వాసకోస వ్యాధులు ఉన్న రోగులకు ఈ చలి వల్ల ఇక్కట్లు తప్పడం లేదు. వాతావరణంలో జీవనం సాగించడం ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తోందని వైద్యుల సూచన మేరకు రోగగ్రస్తులు మైదాన ప్రాంతాలకు తరలి వెళ్లే పరిస్థితి పలువురు ఎదుర్కొంటున్నారు.

ఉన్ని వస్త్రాలకు గిరాకీ

ఉత్తరాంధ్రలో అతి శీతల ప్రాంతంగా ఉన్న పాడేరు, అరకు ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్ని వస్త్రాలకు మంచి గిరాకీ ఉంది. ఈ సీజన్లో అక్టోబర్ నుంచి జనవరి వరకు సుమారు నాలుగు నెలల పాటు ఉన్ని వస్త్రాల వ్యాపారం భారీగా సాగుతోంది. నేపాల్ న్యూఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు రంగులు స్వెటర్లు ఇతర కొన్ని వస్త్రాలను ఇక్కడకు దిగుమతి చేసి విక్రయిస్తున్నారు నేరుగా ఆయా ప్రాంతాల నుంచి ఇక్కడకు రవాణా చేస్తున్న కొన్ని వస్త్రాలు పెద్ద షాపుల్లో కంటే రోడ్ల పక్క దుకాణాలు వేసి కొంచెం తక్కువ ధరలకే విక్రయిస్తుండడం తో ఈ ప్రాంతంలో ప్రజలకు ఉన్ని వస్త్రాలు అందుబాటులోనే ఉంటుంది. రూ.300 నుంచి 3 వేల వరకు రగ్గులు స్వెటర్లు లభిస్తున్నాయి.

పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి

- పాపికొండల బోటు యజమానులకు, ఆటోడ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి- విఆర్.పురం (అల్లూరి జిల్లా)

పాపికొండల సందర్శనకు వెళ్లే పర్యాటకులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ఎస్ఐ వెం సంతోష్‌కుమార్ అవగాహన కల్పించారు. బుధవారం పాపికొండల బోట్లను తనిఖీ చేశారు. సామర్థ్యానికి మించి టూరిస్ట్‌లను బోట్లలో ఎక్కించవద్దని సూచించారు. పర్యాటకుల భద్రతకు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని బోట్లలో అందరు పర్యాటకులతోపాటు సిబ్బంది లైఫ్ జాకెట్లను ధరించాలని, సేఫ్టీ లేని పడవలపై ప్రయాణించవద్దని సందర్శకులకు సూచించారు. అన్ని బోట్లకు లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రయాణికుల భద్రతకు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు పాపికొండల సందర్శనకు వెళ్లే పర్యాటకులను బోట్ల వద్దకు తీసుకెళ్లే ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. పేరంటాలపల్లికి పర్యాటకులను తీసుకువెళ్లే ఆటోడ్రైవర్లతో మాట్లాడుతూ, నిబంధనలు పాటించాలని, అతివేగం తగదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సత్యసాయి జిల్లాకు మరో వాహన పరిశ్రమ

- ఆజాద్ ఇండియా మొబిలిటీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు
- రూ.1046 కోట్లతో పరిశ్రమ స్థాపన



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సత్యసాయి జిల్లాకు మరో వాహన తయారీ పరిశ్రమ రానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఇది వరకే ఒప్పందం కుదిరింది. ఈ సంస్థ ఏర్పాటుకు అవసరమైన ఉత్తర్వులను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. సత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలో ఇప్పటికే 'కియా' కార్ల తయారీ పరిశ్రమ ఉన్న విషయం తెలిసిందే. దాని సమీపంలోనే మరో వాహన తయారీ పరిశ్రమ రానుంది. ఎలక్ట్రికల్ త్రీ వీలర్, ట్రక్కులు, బస్సులు తయారీ పరిశ్రమ గుడిపల్లి వద్ద ఏర్పాటు కానుంది.

ఆజాద్ ఇండియా మెబిలిటీ సంస్థ ఏర్పాటు

సత్యసాయి జిల్లాలోని గుడిపల్లి సమీపంలో రూ.1046 కోట్ల వ్యయంతో ఎలక్ట్రికల్ వాహనాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ఆజాద్ ఇండియా మొబిలిటీ అనే సంస్థ ఇక్కడ ఎలక్ట్రికల్ ఆటోలు, ట్రక్కులు, బస్సులు తయారీ చేయనుంది. మూడు దశల్లో ఈ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. ఏప్రిల్ 2026 నాటికి మొదటి దశ, ఏప్రిల్ 2028 నాటికి రెండవ దశ, 2030 నాటికి మూడవ దశ పూర్తవనుంది. రూ.1046 కోట్లతోచేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా 2231 మందికి ఉపాధి లభిస్తుందని సంస్థ చెబుతోంది.

గుడిపల్లి వద్ద 70.71 ఎకరాలు కేటాయింపు

గుడిపల్లి సమీపంలోనున్న ఎపిఐఐసి లేఅవుట్‌లో 70.71 ఎకరాల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భూముల కేటాయింపు కూడా దశల వారీగానే కేటాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. మొదటి దశకు 36 ఎకరాలు, రెండో దశకు 26 ఎకరాలు, మూడవ దశకు 8.71 ఎకరాలు ఇలా మూడు విడతల్లో భూ కేటాయింపులు జరపాలని ఎపిఐఐసికి ఆదేశాలిచ్చింది. దీంతో సత్యసాయి జిల్లాలో ఇప్పుడున్న కియాతోపాటు అదనంగా మరో వాహన పరిశ్రమ రానుంది. ఇదే కాకుండా మరో అతిపెద్ద పరిశ్రమ ఒకటి వచ్చే అవకాశముందని పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ అనంతపురం జిల్లాకు విచ్చేసిన సందర్భంలో ప్రకటించారు. ఆ పరిశ్రమ ఏదన్న దానిపై ఇంకా పూర్తి స్థాయి స్పష్టత లేదు. త్వరలో వచ్చే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఇవి కార్యరూపం దాలిస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు కొంత వరకు మెరుగుపడే అవకాశాలున్నాయి.

దాళ్వాకు సాగునీటి గండం

- ప్రతియేటా శివారు భూములకు నీరందక రైతుల అవస్థలు
- 11 ప్రధాన కాల్వల మరమ్మతులకు మోక్షమెప్పుడో
- పూర్తిస్థాయిలో నీరందకపోతే తగ్గనున్న దిగుబడులు
- ఈ ఏడాదీ తప్పని వంతులవారీ విధానం

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

'ప్రతి ఎకరాకూ పూర్తిస్థాయిలో సాగునీరందిస్తాం. రైతులు ఎవ్వరూ అధైర్యపడొద్దు.. సాగుకు సన్నద్ధంకండి' అని గొప్పలు చెప్పిన ప్రభుత్వ మాటలు నమ్మి దాళ్వా సాగు చేసిన రైతులకు ఆదిలోనే సాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టని ఫలితమే ఈ సమస్యకు కారణమని తెలుస్తోంది. గతానికి భిన్నంగా ఈసారి ధాన్యం సొమ్ము త్వరితగతిన రావడంతో ఎన్నో ఆశల మధ్య దాళ్వా సాగు చేపట్టిన రైతులను సాగునీటి గండం వెంటాడుతోంది. ప్రతియేటా మాదిరిగానే ఈసారీ వంతుల వారీ విధానం తప్పదని, అయితే ఆ విధానంలోనూ ఎదురయ్యే కష్టాలు గట్టెక్కేదెలా అని అంతా తలలు పట్టుకుంటున్నారు. దీనికితోడు ఏప్రిల్ 15 నుంచి కాలువలకు నీటి విడుదలను నిలిపి వేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో దాళ్వా సాగు ముందుకు సాగేనా అని సర్వత్రా చర్చ సాగుతోంది.

వ్యవసాయ సాగులో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు కొనసాగుతున్నాయి. వరి పంట కీలక దశలో ఉండగా నీరందక రైతులు తల్లడిల్లుతుండగా, పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి విపత్తుల తాకిడికి కష్టమంతా నీటి పాలవుతున్న పరిస్థితి ఉంది. అయితే ముందస్తు సాగుకు అటు ప్రభుత్వం, ఇటు అధికారులు రైతాంగాన్ని సమాయత్తపర్చడంలో వెనుకపడ్డారనే విమర్శలు విన్పిస్తున్నాయి. అయితే రైతులు కూడా సాగు ముందు, వెనక చేపడుతుండటంతో పరిస్థితులు మరింత జఠిలంగా మారుతున్నాయి. ఏదే మైనప్పటికీ ప్రకృతి విపత్తులకు, మానవ తప్పిదాలకు వరిసాగు కష్టాలు, నష్టాల్లో కూరుకుపోయి రైతుల పరిస్థితి దయనీయంగా తయారవుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సుమారు మూడు లక్షల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో దాళ్వా సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే నారుమడులు ప్రక్రియ పూర్తవ్వగా, కొన్ని ప్రాంతాల్లో నాట్ల ప్రక్రియ సాగుతోంది. అయితే నీటి కష్టాలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 29 మండలాల్లో గోదావరి పశ్చిమ డెల్టా 5,29,962 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీనిలో 4.60 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ప్రధానంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 11 ప్రధాన కాల్వలు, 300 ఉప కాల్వల ద్వారా గోదావరి నుంచి సాగు, తాగునీరు విడుదల చేస్తుంటారు. ప్రతియేటా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించి ఖరీఫ్, రబీ సీజన్లో సాగు విస్తీర్ణానికి అనుగుణంగా నీటి కేటాయింపులు, మరమ్మతులు చేపట్టాల్సిన పనులపై ప్రజాప్రతినిధులకు జల వనరుల శాఖాధికారులు వివరిస్తారు. ఏలూరు జిల్లాలో ఆరు మండలాల్లో 82,251 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ఏలూరు, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, కైకలూరు మండలాల్లో డెల్టా విస్తీర్ణం 82,251 ఎకరాలకు 56,190 ఎకరాల్లో రబీ సీజన్లో వరి సాగు చేస్తారని అంచనా. ఈ క్రమంలో ఏలూరు జిల్లాకు సుమారు ఆరు టిఎంసిల నీటి అవసరం ఉంటుంది. అధికారిక లెక్కల ప్రకారం పోలవరంలో 14 టిఎంసిలు, సీలేరు కాంప్లెక్స్‌లో 44.59 టిఎంసిలు, గోదావరికి అదనంగా ఎగువ ప్రాంతాల నుంచి 9.45 టిఎంసిల నీరు వస్తుందని అంచనా. మొత్తం కలుపుకుని 68.40 టిఎంసిలు అందుబాటులో ఉంటాయి. 8.96 లక్షల ఎకరాల్లో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆయకట్టు విస్తరించి ఉంది. దీనికి 91.350 టిఎంసిల నీరు అవసరం. సాగునీటితోపాటు తాగునీరు కూడా గోదావరి నుంచి వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో సుమారు 22 టిఎంసిల నీటి కొరత ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఎగువ ప్రాంతాల్లో కురిసే అకాల వర్షాలతో గోదావరిలో చేరే నీటితో కొంతమేర పరిస్థితి అధిగమించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లాలో రూ.1.74 కోట్లతో ఏడు కాల్వల పనులు, రూ.3.70 కోట్లతో 14 డ్రెయిన్ల మరమ్మతుల పనులకు అనుమతి లభించింది. ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో ఈ పనులున్నాయి. రూ.5.27 కోట్లతో మరో 25 పనులు ఖరారు చేసినప్పటికీ అవి టెండర్ల దశలో ఉన్నాయి. ఇవి కాకుండా ఏలూరు జిల్లాలో 67 పనులను రూ.167 కోట్ల వ్యయంతో ప్రతిపాదించి రెండు నెలల క్రితం ప్రభుత్వానికి పంపారు. అవి ఇంకా ఖరారు కాని పరిస్థితి. గత ఖరీఫ్ సీజన్‌లో మూడు సార్లు వరదలు, భారీ తుఫాన్లతో జిల్లాలో 29 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. దీంతో రైతులు పెట్టుబడుల కోసం ఎక్కువ ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో రబీ సాగుపై అనేక ఆశలు పెట్టుకున్నారు. రబీ సీజన్‌లో పూర్తిగా కాల్వలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. వంతులవారీ విధానం ద్వారా శివారు భూములకు నీరందని పరిస్థితి. ఏప్రిల్ 15 నుంచి జూన్ 1వ తేదీ వరకూ కాల్వలకు నీటి విడుదలను నిలిపివేస్తామని ఇరిగేషన్ అధికారులు ప్రకటించడం గమనార్హం.

కృష్ణా ట్రిబ్యునల్‌లో

బలమైన వాదనలు వినిపించాలి

- గోదావరి-బనకచర్లపై అభ్యంతరాలతో కేంద్రం, ఆంధ్రప్రదేశ్‌కి లేఖలు
- పోలవరం ముంపుపై అధ్యయనం
- నీటి పారుదల శాఖ సమీక్షలో సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు అంతరాష్ట్ర నదీజలాల వివాద చట్టం (ఐఎస్ఆర్‌డబ్ల్యూడీఏ)-1956 సెక్షన్ 3 ప్రకారం నీటి కేటాయింపులు చేపట్టాలనే విషయంపై కృష్ణాజలాల వివాదాల ట్రిబ్యునల్-క్ష్మీక్ష్మీ (కేడబ్ల్యూడీటీ-2) ఎదుట బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం (ఎపిఆర్ఎ) - 2014లోని సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టులవారీగా నీటి కేటాయింపులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఎపిఆర్ఎ ప్రకారం ఏర్పాటైన అపెక్స్ కౌన్సిల్ సైతం సెక్షన్ 3 ఆధారంగా నీటి పంపకాలు రెండు రాష్ట్రాల మధ్య చేపట్టాలని సూచించిందని సిఎం గుర్తుచేశారు. కెడబ్ల్యుడిటి-2 ప్రకారం తదుపరి విధివిధానాలపై (ఫర్దర్ టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) ఎపి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినా, అత్యున్నత న్యాయస్థానం ఎలాంటి స్టే ఇవ్వని విషయాన్ని సిఎం గుర్తు చేశారు. రాష్ట్ర నీటి పారుదల శాఖపై ముఖ్యమంత్రి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు డి శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటి పారుదల శాఖ) ఆదిత్యనాథ్ దాస్, నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు చేపట్టడంపై కేంద్ర జల్‌శక్తి మంత్రి సిఆర్ పాటిల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోపాటు గోదావరి, కృష్ణానది యాజమాన్య బోర్డులకు తెలంగాణ తరపున అభ్యంతరాలు తెలుపుతూ లేఖలు రాయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల్లో ఏ రాష్ట్రమైనా ఏ నదిపైనైనా ప్రాజెక్టు నిర్మించాలంటే జిఆర్ఎంబి, కెఆర్ఎంబిలతో పాటు పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలనే విషయాన్ని లేఖల్లో ప్రస్తావించాలని సిఎం సూచించారు. పోలవరం ప్రాజెక్టుతోపాటు భద్రాచలం ముంపు విషయమై హైదరాబాద్ ఐఐటితో అధ్యయనం చేయించే అంశాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయించాలని సిఎం అధికారులను ఆదేశించారు. సమ్మక్క సారక్క బ్యారేజీ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతులు సాధించే ప్రక్రియను వేగవంతం చేయాలని సిఎం సూచించారు.

ఎట్టకేలకు యూన్ అరెస్టు



సియోల్ : ఏకపక్షంగా మార్షల్‌లా విధించి సస్పెండయిన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. యూన్‌ను అరెస్టు చేయడానికి పెద్ద ప్రయత్నమే జరిగింది. వందలాదిమంది దర్యాప్తు అధికారులు, పోలీసు అధికారులు బుధవారం అధ్యక్షుడి ప్రాంగణానికి చేరుకున్న దాదాపు ఐదు గంటల తర్వాత ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు దక్షిణ కొరియా అవినీతి నిరోధక సంస్థ తెలిపింది. భవనంలోకి వెళ్లడానికే మూడు గంటలు పట్టిందని పేర్కొంది. సైరన్లు మోగించుకుంటూ నల్లటి ఎస్‌యువి వాహనాలు పోలీసు ఎస్కార్ట్‌లతో అధ్యక్ష ప్రాంగణం నుండి వెళ్లడం కనిపించినట్లు మీడియా వర్గాలు పేర్కొన్నాయి. డిసెంబరు 3న జారీ చేసిన మార్షల్ లా డిక్రీపై ప్రశ్నించేందుకు హాజరు కావాల్సిందిగా అధికారులు పంపిన సమన్లను ఆయన ప్రతిసారీ ధిక్కరిస్తూ వచ్చారు. తన చర్యలపై దర్యాప్తు చేసేందుకు అవినీతి నిరోధక సంస్థకు అధికారం లేదంటూ తోసిపుచ్చుతూ వచ్చారు. హింసను నిరోధించేందుకే తాను ఈ చర్య తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. పెద్ద ఎత్తున అధ్యక్ష భవనానికి చేరుకున్న దర్యాప్తు అధికారులు తొలుత అధ్యక్షుడి న్యాయవాదులతో చర్చలు జరిపారు. ఆ తరువాత ఆయనను అరెస్టు చేయడానికి గంటల కొద్దీ సమయం పట్టింది. అవినీతి నిరోధక సంస్థ కార్యాలయానికి వెళ్లడానికి ముందుగా యూన్ ఒక వీడియో సందేశం విడుదల చేశారు. ఈ దేశంలో చట్టబద్ధ పాలన పూర్తిగా కుప్పకూలిందని వ్యాఖ్యానించారు. తిరుగుబాటుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై లాంఛనంగా అరెస్టు చేసేందుకు కోర్టు నుండి ఉత్తర్వులు తెచ్చుకునేందుకు అవినీతి నిరోధ శాఖకు 48గంటల సమయం వుంది. ఒకవేళ ఈలోగా ఆ ఉత్తర్వులు తెచ్చుకోలేని పక్షంలో యూన్‌ను విడుదల చేస్తారు. ఒకవేళ యూన్‌ను లాంఛనంగా అరెస్టు చేస్తే ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు బదిలీ చేయడానికి ముందుగా 20 రోజుల పాటు దర్యాప్తు అధికారులు ఆయన అరెస్టును పొడిగించవచ్చు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ఉద్యమం

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ (కర్నూలు)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హంద్రీనీవా కింద ఉన్న ప్రతి ఎకరాకూ సాగు నీరు, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీలపై ఉద్యమించాలని తెలిపారు. మంగళవారం సంక్రాంతి సందర్భంగా మండలంలోని పి.కోటకొండ గ్రామంలో రైతుసంఘం, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో 'ఐక్యత కోసం ఆటలు-యువత మైత్రికి బాటలు' అనే నినాదంతో కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి సంజన అధ్యక్షత వహించారు. ముగ్గులు, కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు.

ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడారు. కోటకొండలో మినీ ఇండియా కనిపిస్తోందని, కుల మతాలకతీతంగా అందరూ ఐక్యంగా ప్రతేడాది సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం అభినందనీయమని తెలిపారు. పిల్లలను బాగా చదివించాలని, చదువే గౌరవాన్ని అందిస్తుందని చెప్పారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ... దేశంలో పేదరికం, నిరుద్యోగం, డ్రగ్స్ ప్రమాదకరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందరమూ ఐక్యంగా ఉండి మతోన్మాదాన్ని, నిరుద్యోగాన్ని, డ్రగ్స్ మాఫియాను అరికడదామని కోరారు.

సిపిఎం అస్సాం రాష్ట్ర కార్యదర్శిగా సుప్రకాష్ తాలూక్దార్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం అస్సాం రాష్ట్ర కార్యదర్శిగా సుప్రకాష్ తాలూక్దార్ ఎన్నికయ్యారు. 50 మందితో నూతన కమిటీ ఎన్నికైంది. వారిలో 13 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం ఎన్నికైంది. గౌహతిలో మూడు రోజుల పాటు జరిగిన సిపిఎం అస్సాం రాష్ట్ర 24వ మహాసభకు త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు, మాజీ ఎమ్మెల్యే హేమెన్ దాస్, మాజీ ఎంపి ఉద్ధబ్ బర్మన్, 325 మంది ప్రతినిధులు, పరిశీలకులు హాజరయ్యారు. నిర్గామి రాజకీయ నివేదికను సుప్రకాష్ తాలూక్దార్ మహాసభ ముందుంచారు. నివేదికను, 21 తీర్మానాలను ప్రతినిధులు ఆమోదించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన రాష్ట్ర కార్యదర్శిగా సుప్రకాష్ తాలూక్దార్ ఎన్నికయ్యారు. కార్యదర్శివర్గ సభ్యులుగా ఇసాఫర్ రెహమాన్, మనోరంజన్ తాలూక్దార్ (ఎమ్మెల్యే), టికెన్ దాస్, అజిత్ దాస్, నయన్ భూయాన్, తపన్ శర్మ, గజెన్ బర్మన్, అజిజుర్ రెహమాన్, నిరంజన్ నాథ్, సంగీత దాస్, శతంజీవ్ దాస్, బసుదేవ్ కలిత తదితరులు ఎన్నికయ్యారు.

దల్లేవాల్ నిరాహార దీక్షకు 50 రోజులు

- మోడీ సర్కారు నుంచి మాత్రం స్పందన కరువు
- కేంద్రంపై రైతు సంఘాల ఆగ్రహం



న్యూఢిల్లీ : రైతు సంఘం నాయకుడు జగ్జిత్ దల్లేవాల్ నిరాహారదీక్ష చేపట్టి 50 రోజులు పూర్తయింది. ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తున్నదని వైద్యులు చెబుతున్నారు. 70 ఏళ్ల వయసున్న ఆయన.. ఒక క్యాన్సర్ బాధితుడు. రైతు డిమాండ్ల సాధనే లక్ష్యంగా నిరాహార దీక్షలో కూర్చున్న ఆయన.. వైద్య సహాయాన్ని సైతం నిరాకరించారు. ఇప్పుడు ఆయన పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతున్నది. అయినప్పటికీ, కేంద్రంలోని మోడీ సర్కారు ఏమాత్రం పట్టించుకోవటం లేదు. కనీస స్పందన కరువైందని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సంయుక్త కిసాన్ మోర్చా (నాన్-పొలిటికల్) కన్వీనర్‌గా ఉన్న దల్లేవాల్ పంజాబ్‌లోని ఫరీద్‌కోట్. పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి)లకు చట్టబద్ధత డిమాండ్ చేస్తూ గతేడాది నవంబర్ 26 నుంచి ఆయన నిరాహార దీక్ష చేస్తున్నారు. వాస్తవానికి, ఎంఎస్‌పి విషయంలో కోసమే 2020-21లో రైతుల నిరసనలకు దిగొచ్చిన మోడీ సర్కారు హామీనిచ్చింది. ఆ హామీ అమలు, చట్టబద్ధత కోసమే దల్లేవాల్ తన పోరాటాన్ని సాగిస్తున్నారు. ఈ హామీ విషయంలో కేంద్రం వెనక్కి తగ్గుతున్నదని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 2020-21లో రైతు నిరసనలకు భయపడి మోడీ సర్కారు వారితో చర్చల కోసం మెట్టు దిగింది. రైతు సంఘాల నాయకులతో చర్చలకు సీనియర్ మంత్రులను పంపింది. ప్రస్తుతం కేంద్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. దల్లేవాల్ నిరసనపై ఉదాసీన వైఖరిని ప్రదర్శిస్తున్నది.

హర్యానా విజయంతో..

గతేడాది హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతుందని అంతా అనుకున్నారు. పలు సంస్థలు నిర్వహించిన ఎన్నికల సర్వేలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేశాయి. ముఖ్యంగా, రైతు నిరసనలు, జాట్ రిజర్వేషన్ ఆందోళన, యువత నిరుద్యోగం, రెజ్లర్ల నిరసనలు.. వంటివి రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీని రాజకీయంగా దెబ్బ తీసి ఎన్నికల్లో ఓటమికి దారి తీస్తుందని అంతా భావించారు. అనూహ్యంగా హ్యాట్రిక్ విజయాన్ని సాధించింది. 2022లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లో సైతం బీజేపీ మంచి ఫలితాలే వచ్చాయి. పంజాబ్ రైతు నిరసనలకు మద్దతుగా నిలిచింది. ఇక్కడ 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఉన్న రెండు సిట్టింగ్ స్థానాలను ఆ పార్టీ కోల్పోవాల్సి వచ్చింది. పెద్దదారీ కులాల్లో హిందూ ఓట్లతో ఆ పార్టీకి ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగింది. సిక్కు ఓటర్లలో ప్రభావం చూపలేకపోయింది. దానితో పాటు, ఐదేళ్ల పంజాబ్‌లోని బర్నాలాలో జరిగిన ఉప ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోయినా.. 18 శాతం ఓట్లను దక్కించుకున్నది. బీజేపీ నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే కేవల్ ధిల్లాన్ వ్యక్తిగత ఇమేజ్ కారణంగానే ఇది సాధ్యమైందని, బీజేపీకి అంత స్థాయి లేదని రాజకీయ విశ్లేషకులతో పాటు ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు చెప్తున్నారు.

హర్యానా విజయం, పంజాబ్‌లో ఓట్ల శాతం పెంచుకోవటం వంటివి హామీ అమలు నుంచి దూరంగా ఉండేలా బీజేపీ ధైర్యాన్నిస్తున్నదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. రైతుల నిరసన రాజకీయంగా తనకు నష్టం కలిగించదనే భావన ఆ పార్టీలో కలిగించిందని చెప్తున్నారు. అందువల్లే చట్టబద్ధమైన ఎంఎస్‌పి హామీ అమలు చేసేందుకు నిరాకరిస్తోందని అంటున్నారు.

దల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి క్షీణించటం పట్ల పంజాబ్, హర్యానాలలోని రైతాంగంలో ఆందోళన వ్యక్తమవుతున్నది. 2020-21లో ఉధృతంగా సాగిన ఉద్యమాన్ని మోడీ సర్కారు చర్చల ద్వారా ఆపేసింది. రైతులకు ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. దీంతో దల్లేవాల్ దీక్ష ప్రజలతో పాటు ఇప్పటి వరకు నిరసనల్లో క్రియాశీలకంగా లేని రైతుల, రైతు సంఘాల నాయకుల నుంచి కూడా సానుభూతి పెరిగింది. మరోసారి భారీ ఉద్యమానికి దిగాలన్న ఆలోచన వారిలో మెదులుతున్నదని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు.

ఇష్టమైన వ్యక్తినే పెళ్లి చేసుకుంటానన్నందుకు
పోలీసుల ముందే కూతురి కాల్చివేత

- ఓ తండ్రి అమానుషం

భోపాల్ : తల్లిదండ్రులు చూసిన వ్యక్తిని కాదని తనకు ఇష్టమైన వ్యక్తిని పెళ్లి చేసుకుంటానన్నందుకు పోలీసుల ముందే ఆ 20ఏళ్ల అమ్మాయిని ఆమె తండ్రి కాల్చివేశాడు. తను గుర్జార్ ఈ నెల 18న వివాహం చేసుకోవాల్సి వుంది. 14వ తేదీ రాత్రే తండ్రి మహేష్ గుర్జార్, కజిన్ రాహుల్ గుర్జార్‌లు నాటు తుపాకిలు ఉపయోగించి కాల్పులు జరిపి చంపేశారని పోలీసులు బుధవారం తెలిపారు. బాధితురాలికి కేవలం ఐదు నుండి ఏడు అడుగుల దూరంలోనే పోలీసులు వున్నారు. ఆ యువతితో మాట్లాడుతూ ఇరు పక్షాల వారిని ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని, ఈలోగా ఒక్కసారిగా కాల్పులు మొదలయ్యాయని, ఈ హత్య జరిగిపోయిందని గ్వాలియర్ నగర ఎస్పి నాగేంద్ర సింగ్ సికార్‌వర్ తెలిపారు. దాబా నడిపే మహేష్ గుర్జార్‌ను అక్కడికక్కడే అరెస్టు చేశారు. రాహుల్ అక్కడి వారిని తుపాకీతో బెదిరిస్తూ తప్పించుకు పారిపోయాడు. అతడిని పట్టుకునేందుకు గాలింపు బృందాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. ఐదేళ్ల నుండి ఆ అబ్బాయితో ప్రేమలో వున్న తనూ గుర్జార్ ఆ వ్యక్తినే పెళ్లి చేసుకోవాలనుకుందని ఎస్పి చెప్పారు. తల్లిదండ్రులు ఒప్పుకోకుండా వేరే సంబంధం చూశారు. తల్లిదండ్రులు చూసిన సంబంధంలో వరుడు భారత వైమానిక దళంలో పనిచేస్తున్నాడని, ఆమె కావాలనుకున్న అబ్బాయికి సరైన ఉద్యోగం లేదని ఎస్పి తెలిపారు. వివాహ తేదీలను వాయిదా వేయడానికి కూడా తండ్రి తిరస్కరించాడని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని వివరించారు.

యుజిసి ముసాయిదా తక్షణమే ఉపసంహరణ

- ఎఐఎఫ్‌యుసిటిఓ డిమాండ్

న్యూఢిల్లీ : యుజిసి ముసాయిదా నియంత్రణలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎఐఎఫ్‌యుసిటిఓ డిమాండ్ చేసింది. ఈ మేరకు అఖిల భారత యూనివర్శిటీ, కాలేజీ టీచర్ల సంఘాల సమాఖ్య (ఎఐఎఫ్‌యుసిటిఓ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ డాక్టర్ ఎం.నాగరాజన్, ప్రొఫెసర్ డాక్టర్ అరుణ్ కుమార్‌లు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. యూనివర్శిటీలు, కాలేజీల్లో టీచర్లకు, ఇతర బోధనా సిబ్బందికి కనీస అర్హతలను విధిస్తూ యుజిసి ముసాయిదా నిబంధనలను జారీ చేసింది. రాష్ట్రాల హక్కులను, అలాగే విశ్వవిద్యాలయాల విద్యా స్వయంప్రతిపత్తిని మూల్యంగా పెట్టి తన కేంద్రీకరణ ఎజెండాను కొనసాగించాలని యుజిసి భావిస్తున్నట్లు స్పష్టమవుతోందని వారు పేర్కొన్నారు. ఈ నిబంధనలు, ప్రామాణికాలకు సంబంధించి యుజిసిలోనే ఒక రకమైన గందరగోళం వున్నట్లు కనబడుతోందని, ఇప్పటికే చాలాసార్లు తాను పెట్టుకున్న నిబంధనలను తానే సవరిస్తూ వచ్చిందని తెలిపారు. ఈ పరిస్థితుల వల్ల అకడమిక్ కమ్యూనిటీలో చాలా గందరగోళం నెలకొంటోందని వారు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో యుజిసి రెగ్యులేషన్స్, 2025ను తక్షణమే ఉపసంహరించాలని వారు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలో ఉన్నత విద్యకు సంబంధించి తీవ్ర పర్యవసానాలను కలిగించే ఇటువంటి అంశాలపై దేశంలోని విద్యావేత్తలతో, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపాలని వారు యుజిసిని కోరారు.

భగవత్ వ్యాఖ్యలు దేశద్రోహం కిందకు వస్తాయి

- ఎఐసిసి నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో రాహుల్‌గాంధీ



ఎఐసిసి నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశానికి స్వాతంత్ర్యం 1947లో రాలేదని, రామ్ మందిర్ నిర్మాణం జరిగినప్పుడే వచ్చిందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకు వస్తాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. మరో దేశం అయితే ఆయన్ను అరెస్టు చేసి, విచారించేవారని చెప్పారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) నూతన కార్యాలయ ప్రారంభం సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం చెల్లదన్నట్లు మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. 1947లో భారత్‌కు స్వాతంత్ర్యం రాలేదనడం ప్రతి భారతీయుడికి అవమానమే అన్నారు. దేశంలో రెండు భావజాలాలు ఉన్నాయని, అందులో రాజ్యాంగబద్ధమైన భావజాలం తమదని, మరొకటి ఆర్‌ఎస్‌ఎస్ భావజాలమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ భావజాలంలో పెద్ద, చిన్న కులాలు, తర తమ బేధాలు ఉండవని, రాజ్యాంగంలో అదే రాసి ఉందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోహన్ భగవత్ రాజ్యాంగం చెల్లుబాటు కాదని చెబుతున్నారని, బ్రిటీష్ వారి మీద జరిగిన పోరాటాన్ని గుర్తించడం లేదని విమర్శించారు. వారికి త్రివర్ణ పతాకంపై గౌరవం లేదని, రాజ్యాంగ విలువలపై నమ్మకం లేదని అన్నారు. గురునానక్, గౌతమ బుద్ధుడు, కృష్ణుడు ఆర్‌ఎస్‌ఎస్ ఐడియాలజీనా? అని ప్రశ్నించారు. ఈ కొత్త భవనం కాంగ్రెస్ భావజాలానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ భవనంలో ఉన్న అందరూ ఆ భావజాలాన్ని కాపాడే వారేనని, బిజెపికి లొంగిపోయేవారు కాదని అన్నారు.

న్యూఢిల్లీలోని కోట్లా రోడ్డులో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఆరంతస్తులతో నిర్మించిన ఎఐసిసి నూతన కార్యాలయం ఇందిరాభవన్‌ను పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ప్రారంభించారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నూతన భవనంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ భవనానికి ఇందిరా భవన్‌గా నామకరణం చేశారు. నూతన కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కెసి వేణుగోపాల్, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డితోపాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పిసిసి అధ్యక్షులు, ఎంపిలుసహా 400 మంది హాజరయ్యారు. 2009లో కొత్త భవనం నిర్మాణాన్ని చేపట్టగా, 15 ఏళ్ల పాటు ఈ పనులు జరిగాయి. దాదాపు ఐదు దశాబ్దాలుగా అక్బర్ రోడ్డు 24వ నంబర్ బంగ్లాలో సాగుతున్న ఎఐసిసి కార్యకలాపాలు ఇక్కడికి మారనున్నాయి. ఆ భవనంలో కూడా కార్యకలాపాలు కొనసాగుతాయని పార్టీ నాయకులు చెబుతున్నారు.

రాహుల్ గాంధీతో షర్మిలా రెడ్డి భేటీ

కాంగ్రెస్ నేత, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీతో ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి భేటీ అయ్యారు. బుధవారం ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో ప్రారంభోత్సవానికి ఢిల్లీ వచ్చిన ఆమె రాహుల్ గాంధీని కలిసి రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా షర్మిలా రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొనడం సంతోషకరంగా ఉందని అన్నారు. ఇది భవనం మాత్రమే కాదని, ఇది కాంగ్రెస్ వారసత్వమని పేర్కొన్నారు. దేశ స్వాతంత్రం కోసం చేసిన త్యాగాలన్ని ఇక్కడ ఇమిడి ఉన్నాయని పేర్కొన్నారు. 1947లో స్వాతంత్ర్యం రాలేదని ఆర్‌ఎస్‌ఎస్ నేత అంటున్నారని, రామ్ మందిర్ కట్టినప్పుడే స్వతంత్రం వచ్చిందని అంటున్నారని అన్నారు. ఈ వ్యాఖ్యలు దేశ ద్రోహులు, ఉగ్రవాదుల మాటలు, వ్యాఖ్యలు వలే ఉన్నాయని విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్‌కి స్వతంత్ర పోరాటానికి సంబంధం లేదని, స్వతంత్ర పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర, శ్రమ లేదని అన్నారు. దేశం కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారని, ఆయన టీమ్‌లో తాను భాగస్వామ్యం అయినందుకు గర్వంగా ఉందని చెప్పారు.

'అవినీతి' అధికారిపై నోట్లు విసిరి

- గుజరాత్‌లో ఓ ఆఫీసర్‌పై జనాగ్రహం
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

గాంధీనగర్ : దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో లంచం ఒకటి. అవినీతికి దారి తీసే ఈ దుశ్చర్యపై ఎన్ని చట్టాలు చేసినా, వ్యవస్థను పటిష్టం చేసినా.. కొందరు అధికారుల్లో మాత్రం ఏ మాత్రమూ మార్పు రావటం లేదు. పైసలకు ఆశపడి లంచావతారులుగా మారుతున్నారు. ఇలాంటి ఒక అధికారిపై కొందరు ప్రజలు తిరగబడ్డారు. ప్లకార్డులను తమ మెడలకు తగిలించుకొని ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సదరు అధికారి అవినీతి పరుడనీ, లంచాలు తీసుకున్నాడని ఆరోపించారు. ముల్లును ముల్లుతోనే తీయాలన్న చందంగా... కొందరు సదరు అధికారిపై నోట్లను విసిరి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది గుజరాత్‌లో చోటు చేసుకున్నట్టుగా తెలుస్తున్నది. ప్రజలు ఇంతగా ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే.. సదరు అధికారి ఏమీ తెలియనట్టు చేతులు ముడుచుకొని ఒక కుర్చీలో కూర్చొని ఉన్నాడు. ఒక ఎక్స్ యూజర్ పోస్ట్ చేసిన ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. చాలా మంది దృష్టిని ఆకర్షించింది. ఈ వీడియోకు ఐదు లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. అవినీతి అధికారిపై ప్రజలు తిరగబడటాన్ని చాలామంది నెటిజన్లు తమ కామెంట్లతో సమర్థించారు.

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కేజ్రీవాల్, మనీష్ సిసోడియాల విచారణకు ఇడికి అనుమతి

న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌ను, మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాలను మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద విచారించేందుకు కేంద్ర మంత్రిత్వశాఖ ఇడికి అనుమతినిచ్చింది. ఈ విషయాన్ని బుధవారం అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో పిఎంఎల్‌ఎ కింద ప్రాసిక్యూట్ చేయడానికి అవసరమైన అనుమతి లేకుండా ట్రయల్ కోర్టు ఛార్జిషీటును పరిగణనలోకి తీసుకుందని కేజ్రీవాల్ వాదించారు. ఈ విషయంపై ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఢిల్లీలోని పిఎంఎల్‌ఎ స్పెషల్ కోర్టు కేజ్రీవాల్‌పై అభియోగాల నమోదుపై స్టే విధించింది. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా కేంద్ర హోంమంత్రిత్వశాఖ కేజ్రీవాల్‌ని విచారించేందుకు ఇడికి అనుమతించింది. ఈ కేసులో ఇప్పటికే విచారించేందుకు సిబిఐకి అనుమతి లభించింది. వచ్చే నెల 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఇడి విచారణకు హోంశాఖ అనుమతినివ్వడంతో పొలిటికల్ హీట్ మరింత పెరిగింది.

మోడీ, అమిత్ షా ఫొటోలు 'ఎక్స్'లో వాడినందుకు ఆప్‌పై కేసు

ఎఐ ద్వారా రూపొందించబడిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ఫొటోలను, వీడియోలను మార్పు చేసి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్ చేశారనే ఆరోపణలతో ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నార్త్ అవెన్యూ పోలీస్ స్టేషన్‌లో సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 10, 13 తేదీల్లో ఆప్ డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన వీడియోలను ఎక్స్‌లో పోస్టు చేసింది. వాటిలో ఒకటి 90ల నాటి బాలీవుడ్ చిత్రం నుండి విలన్ల ముఖాలను బిజెపి నాయకుల ముఖాలతో మార్చి, ఆడియోను ఢిల్లీ ఎన్నికలపై సంభాషణగా మార్చిన దృశ్యాన్ని చూపించిందని ఒక అధికారి తెలిపారు. ఫిర్యాదు అందడంతో, ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, దర్యాప్తు ప్రారంభించామని చెప్పారు. ఈ అంశంపై ఆమ్ ఆద్మీ పార్టీ స్పందిస్తూ, ఎన్నికలు దగ్గర పడుతున్నప్పుడు ఇది బిజెపికి సర్వసాధారణమని, ప్రజలకు సంబంధించిన నిజమైన సమస్యల నుండి దృష్టిని మళ్లించడానికి తప్పుడు కేసులు నమోదు చేయిస్తోందని పేర్కొంది. రాజకీయ కక్షతో ముఖ్యమంత్రి అతిషి, మనీష్ సిసోడియాలను అరెస్టు చేసే అవకాశం ఉందని, వారి నివాసాల్లోనూ, ఇతర ప్రదేశాల్లోనూ సోదాలు చేసే అవకాశం ఉందని తెలిపింది. 'ఓటర్ల జాబితాలను తారుమారు చేయడం, నకిలీ ఎంట్రీలను జోడించడం, నిజమైన ఓటర్లను తొలగించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలలో స్పష్టంగా పాల్గొన్న బిజెపి నాయకులపై, ఓట్లను కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని' ఆప్ పేర్కొంది.

అడవిలో జింకలా అతిషి పరిగెడుతోంది : రమేష్ బిధూరి వివాదాస్పద వ్యాఖ్యలు

ఢిల్లీ సిఎం అతిషి ఎన్నికల్లో ఓట్ల కోసం అడవిలో జింక మాదిరిగా పరుగెడుతోందని బిజెపి సీనియర్ నేత రమేష్ బిధూరి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'గత నాలుగేళ్లలో అతిషి జనాల్ని కలవడానికి ఒక్కసారి కూడా రాలేదు. త్వరలో ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నందున ఆమె ఇప్పుడు వీధుల్లో తిరుగుతున్నారు. అడవిలో జింక పరుగులు పెట్టినట్టు ఆమె ఓట్ల కోసం పరుగెడుతున్నారు' అని అన్నారు. బిధూరి కల్కాజి నియోజకవర్గం నుంచి ఢిల్లీ సిఎం అతిషిపై పోటీ చేస్తున్నారు.

ఎన్నికల కమిషన్‌కు సుప్రీం నోటీస్

- నిబంధనల్లో మార్పులపై జైరామ్ రమేష్ పిటిషన్

న్యూఢిల్లీ : ఎన్నికల నిర్వహణకు సంబంధించి 1961వ సంవత్సరపు నిబంధనల్లో చేసిన సవరణను సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత జైరాం రమేష్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు బుధవారం ఎలక్షన్ కమిషన్‌కు నోటీసు జారీ చేసింది. ఎన్నికలకు సంబంధించిన పత్రాల పరిశీలనను నిబంధనల్లో పేర్కొన్న డాక్యుమెంట్లకు మాత్రమే పరిమితం చేయడాన్ని ఆయన సవాలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి సంజయ్ కుమార్‌తో కూడిన బెంచ్ స్పందిస్తూ ఎన్నికల కమిషన్‌కు నోటీసు జారీ చేసింది. మార్చి 17తో ప్రారంభమయ్యే వారంలో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను గత నెలలో న్యాయ మంత్రిత్వ శాఖ సవరించింది. ఇటీవల జరిగిన హర్యానా శాసనసభ ఎన్నికలకు సంబంధించిన అన్ని పత్రాలను న్యాయవాది మెహమూద్ ప్రచాకు అందజేయాలని పంజాబ్-హర్యానా హైకోర్టు గతంలో ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఆ తర్వాత కమిషన్‌తో చర్చించిన న్యాయ శాఖ ఈ సవరణను తీసుకొచ్చింది.

మధుర షాహీ కేసుపై మార్చిలో విచారణ

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని మధురలో కృష్ణ జన్మభూమి - షాహీ ఈద్గా వివాదానికి సంబంధించి మసీదు నిర్వహణా కమిటీ వేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు మార్చికి వాయిదా వేసింది. ఈ రోజు మరో పిటిషన్‌ను విచారించాల్సి వున్నందున మసీదు కమిటీ పిటిషన్‌ను విచారణకు చేపట్టలేమని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన బెంచ్ తెలిపింది. ఆలయం-మసీదు వివాదానికి సంబంధించి 15 కేసుల విచరణార్హతను సవాలు చేస్తూ మసీదు కమిటీ పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌ను గతేడాది ఆగస్టు 1న అలహాబాద్ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తోసిపుచ్చింది. షాహీ ఈద్గా మతపరమైన స్వభావాన్ని నిర్ధారించాల్సిన అవసరం వుందని రూలింగ్ ఇచ్చింది.

జిన్‌పింగ్‌తో దిసనాయకె చర్చలు



బీజింగ్‌లో జిన్‌పింగ్‌తో బుధవారంనాడు కరచాలనం చేస్తున్న దిసనాయకె

బీజింగ్: చైనా పర్యటనలో ఉన్న శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకెతో చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ బుధవారం సమావేశమయ్యారు. చైనా-శ్రీలంక మధ్య ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధి, బెల్ట్ అండ్ రోడ్డు సహకారం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, సముద్ర ఆర్థిక వ్యవస్థ వంటి వాటిలో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. చైనా-శ్రీలంక మధ్య మైత్రీ బంధం చిరకాలంగా కొనసాగుతూ వస్తున్నదని, 68 సంవత్సరాలుగా ఆరోగ్యకరమైన, స్థిరమైన అభివృద్ధిని కొనసాగించాయని జిన్‌పింగ్ శ్రీలంక అధ్యక్షునితో అన్నారు.

రక్షణ రంగంలో మేడిన్ ఇండియా

- యుద్ధ నౌకల ప్రారంభంలో ప్రధాని మోడీ

ముంబై : దేశంలో అధునాతన యుద్ధనౌకలు ఐఎన్‌ఎస్ సూరత్, ఐఎన్‌ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్‌ఎస్ వాఘ్‌షీర్‌లను ప్రధాని నరేంద్ర మోడీ జాతికి అంకితం చేశారు. ముంబైలోని నావల్ డాక్‌యార్డ్‌లో బుధవారం ఈ నౌకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ ప్రపంచంలో బలమైన శక్తిగా భారత్ మారుతోందని అన్నారు. బలమైన సముద్ర మార్గాల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. రక్షణ రంగంలో మేడిన్ ఇండియా ఆవిష్కృతమవుతోందని చెప్పారు. నూతన యుద్ధ నౌకలు భారత్‌కు మరింత శక్తినిస్తాయని అన్నారు. అంతర్జాతీయ కార్గో మార్గాలను భారత్ కాపాడుతోందని, నేవీ బలోపేతం వల్ల ఆర్థిక ప్రగతి కలుగుతోందని చెప్పారు.



జుకర్‌బర్గ్ వ్యాఖ్యలకు మెటా ఇండియా క్షమాపణ

వాషింగ్టన్ : భారత్‌లో ఎన్నికలు, ప్రభుత్వం గురించి ఫేస్‌బుక్ సిఇఓ మార్క్ జుకర్‌బర్గ్ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో ఆయన తరపున మెటా ఇండియా క్షమాపణలు చెప్పింది. 2024 ఎన్నికల్లో భారతదేశంలోని ప్రస్తుత ప్రభుత్వం అధికారాన్ని కోల్పోతుందని జుకర్‌బర్గ్ ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌కిచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. మెటా ఇండియా ఉపాధ్యక్షుడు శివనాథ్ తుక్రాల్ ఎక్స్‌తో మాట్లాడుతూ, అధికారంలో వున్న అనేక పార్టీలు 2024 ఎన్నికల్లో తిరిగి గెలవలేవని చెప్పామని, ఇది అనేక దేశాల విషయంలో నిజమైనప్పటికీ, భారత్ విషయంలో నిజం కాలేదని పేర్కొన్నారు. అనుకోకుండా జరిగిన ఈ పొరపాటుకు తాము క్షమాపణలు చెబుతున్నామని ఆయన పేర్కొన్నారు. మెటాకు సంబంధించి భారత్ విశ్వసనీయమైన, ముఖ్యమైన దేశమని ఆయన వ్యాఖ్యానించారు. భారత్ వినూత్న భవిష్యత్తులో తాము కూడా కేంద్రంగా వుండాలని ఆశిస్తున్నామన్నారు. దీనిపై బిజెపి నేత, కమ్యూనికేషన్, సమాచార సాంకేతిక పరిజ్ఞానంపై పార్లమెంటరీ కమిటీ ఛైర్‌పర్సన్ అయిన నిషికాంత్ దూబే స్పందిస్తూ క్షమాపణలు చెప్పినందున ఇక ఈ విషయం ఇంతటితో ముగిసిపోయిందని వ్యాఖ్యానించారు.

ఇండోనేషియాలో పిల్లలకు సోషల్ మీడియా నిషేధం!

ఇండోనేషియా: సోషల్ మీడియా వినియోగదారులకు కనీస వయసును నిర్ణయించడానికి ఒక నిబంధనను జారీ చేయాలని యోచిస్తున్నట్లు ఇండోనేషియా పేర్కొంది. ఈ చర్య పిల్లలను రక్షించే లక్ష్యంతో చేస్తున్నట్లు ఆ దేశ కమ్యూనికేషన్ మంత్రి ముత్య హఫీద్ అన్నారు. 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను యాక్సెస్ చేయకుండా నిషేధించాలని ఆస్ట్రేలియా నిర్ణయించిన తర్వాత ఈ ప్రణాళికలు రూపొందించారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ యజమాని మెటా నుండి టిక్‌టాక్ వరకు టెక్ దిగ్గజాలు పిల్లలు తమ ప్లాట్‌ఫామ్‌లను యాక్సెస్ చేయకుండా నిరోధించడంలో విఫలమైతే వారికి జరిమానాలు విధిస్తారు. ఇండోనేషియాలో కనీస వయసు ఎంత ఉంటుందో మంత్రి ముత్య హఫీద్ చెప్పలేదు. డిజిటల్ స్పేస్‌లో పిల్లలను ఎలా రక్షించాలో తాము చర్చించామని ఆమె అధ్యక్ష కార్యాలయం యొక్క యూట్యూబ్ ఛానెల్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలో పేర్కొన్నారు. ఇండోనేషియా ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల సంఘం 8,700 మందిపై నిర్వహించిన సర్వే ప్రకారం, దాదాపు 280 మిలియన్ల జనాభా కలిగిన ఇండోనేషియాలో ఇంటర్నెట్ వ్యాప్తి గత సంవత్సరం 79.5%కి చేరుకుంది. 12 ఏళ్ల లోపు పిల్లలలో 48% మందికి ఇంటర్నెట్ యాక్సెస్ ఉందని, ఆ వయసులోని కొంతమంది ప్రతివాదులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్‌లను ఉపయోగిస్తున్నారని సర్వేలో తేలింది.

ఆర్‌టిఐ చట్టం ఉద్దేశం అది కాదు

- థర్డ్ పార్టీ ఉత్సుకతను సంతృప్తి పరచడానికి అది అనుమతించదు
- మోడీ విద్యార్హతల కేసులో ఢిల్లీ హైకోర్టులో వాదనలు

న్యూఢిల్లీ : సమాచార హక్కు చట్టం ఉద్దేశం మూడో వ్యక్తి ఉత్సుకతను సంతృప్తి పరచడం కాదని ఢిల్లీ యూనివర్సిటీ అభిప్రాయపడింది. ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్హతలకు సంబంధించిన కేసుపై ఢిల్లీ హైకోర్టులో వాదనలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఢిల్లీ విశ్వవిద్యాలయం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. 1977-78 విద్యా సంవత్సరంలో బిఎ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థుల రికార్డులను తనిఖీ చేయాలంటూ కేంద్ర సమాచార కమిషన్ జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ 2017లో ఢిల్లీ విశ్వవిద్యాలయం హైకోర్టును ఆశ్రయించింది. 1977-78లో మోడీకి ఢిల్లీ యూనివర్సిటీ బిఎ డిగ్రీ ప్రదానం చేసిందని, 1983లో ఆయన గుజరాత్ యూనివర్సిటీ నుండి ఎంఎ పూర్తి చేశారని బిజెపి చెబుతోంది. ఈ డిగ్రీలు కల్పితాలని విమర్శకులు, ఆమ్ ఆద్మీ పార్టీ పేర్కొంటున్నాయి.

కమిషన్ ఆదేశాలు చట్టవిరుద్ధమని మెహతా వాదించారు. సమాచారం అందజేయాలని ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్ 6 చెబుతోందని, ఆ చట్టం ఎవరి ఉత్సుకతను సంతృప్తిపరచడానికో ఉద్దేశించింది కాదని ఆయన తెలిపారు. ప్రభుత్వ అధికారుల జవాబుదారీతనం, పారదర్శకతకు సంబంధం లేని సమాచారాన్ని బహిర్గతం చేయాలని కోరడం ద్వారా చట్టాన్ని దుర్వినియోగం చేయకూడదని అన్నారు. నిబంధనలు అనుమతించిన పక్షంలో వ్యక్తులు తమ డిగ్రీలు లేదా మార్కుల జాబితాల ప్రతులను అందజేయాలని విద్యాసంస్థలను కోరవచ్చునని, మూడో వ్యక్తి అలాంటి సమాచారాన్ని అడగడాన్ని చట్టంలోని సెక్షన్ 8 (1) (ఈ) అనుమతించదని మెహతా వాదించారు.

ఆశారామ్‌కు మరోసారి ఊరట

- రాజస్థాన్ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు

జైపూర్ : వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు ఆశారామ్‌కు మరొకసారి ఊరట లభించింది. 2013 లైంగికదాడి కేసులో రాజస్థాన్ హైకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. మార్చి 31 వరకు ఆయన బెయిల్‌పై బయటే ఉండనున్నారు. ఈ మేరకు న్యాయస్థానం కొన్ని ఆంక్షలు విధించింది. ఆరోగ్య కారణాల రీత్యా, ఇప్పటికే సుప్రీంకోర్టు సైతం ఆయనకు మార్చి 31 వరకు బెయిల్ మంజూరు చేసింది. ఇది జరిగిన కొన్ని రోజులకే రాజస్థాన్ హైకోర్టు నుంచి కూడా ఆశారామ్‌కు బెయిల్ రావటం గమనార్హం. 2013లో జోధ్‌పూర్‌లోని తన ఆశ్రమంలో బాలికపై లైంగికదాడి చేశాడన్న ఆరోపణలపై ఆయన జైలులో శిక్షను అనుభవిస్తున్నారు. దిగువ కోర్టు 2018 ఏప్రిల్‌లో ఆశారాంకు జీవిత ఖైదు విధించిన విషయం విదితమే. సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ జారీ చేయటంతో బాధితురాలి తండ్రి ఇప్పటికే తన కుటుంబ రక్షణపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇలాంటి తరుణంలో ఇప్పుడు ఆశారాంకు రాజస్థాన్ హైకోర్టు నుంచి కూడా బెయిల్ రావటం గమనార్హం. బాధితురాలు, వారి కుటుంబంతో మాట్లాడామనీ, భద్రతను ఏర్పాటు చేశామని ఉత్తరప్రదేశ్ పోలీసులు చెప్తున్నా.. బాధిత కుటుంబంలో మాత్రం భయం అలాగే ఉన్నది.

మాజీ అర్మీ చీఫ్ సహా 19మందికి 12ఏళ్ల జైలు

- బంగ్లాదేశ్ కోర్టు ఉత్తర్వులు జారీ

ఢాకా : మాజీ అర్మీ చీఫ్ హర్యూర్ రషీద్, మరో 18మందికి 12 ఏళ్లపాటు జైలు శిక్ష విధిస్తూ బంగ్లాదేశ్ కోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మనీ లాండరింగ్‌కు, నిధుల స్వాహాకు పాల్పడినందుకు 4,500కోట్ల టాకాలకు పైగా జరిమానా విధించింది. మాజీ సైనిక చీఫ్, చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) రషీద్, డెస్టినీ మల్టీపర్పస్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రఫికల్ అమిన్‌లకు ఈ కేసులో చెరో 12ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఢాకా ప్రత్యేక న్యాయమూర్తి కోర్టు-4 ఆదేశాలు జారీ చేశారు. తాము దుర్వినియోగం చేసిన నిధులకు రెట్టింపు మొత్తాన్ని అంటే 4,515.57 కోట్లు టాకాలను వారు జరిమానాగా చెల్లించాలని కోర్టు పేర్కొంది. సైన్యం నుండి రిటైరైన తర్వాత రషీద్‌ను ఈ ఎంఎల్‌ఎం కంపెనీ డైరెక్టర్‌గా సంస్థ నియమించింది. 2016లో ఈ కేసు విచారణ ప్రారంభమైంది. డెస్టినీ గ్రూపు చైర్మన్‌ను, రషీద్‌ను, మరో ఎగ్జిక్యూటివ్‌ను కోర్టు నుండే జైలుకు తీసుకెళ్లిపోయారు. మిగిలిన దోషులందరూ పరారీలో వున్నారు. వారి పరోక్షంలోనే కోర్టు వారిపై విచారణ జరిపింది. వెంటనే వారి అరెస్టుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.



మీకోసం

బట్టలుతికే సబ్బులు, సర్ఫులు వాడాక చేతులను బాగా కడిగి, పొడి బట్టతో తుడిచి, కాస్త నూనె రాసుకోవాలి.

జీవన సౌరభం

ఆత్మవిశ్వాసం సడలితే ఓటమి ప్రారంభమైనట్లే. అదే ఆత్మవిశ్వాసం మనలో నిబ్బరంగా ఉంటే విజయం వరించినట్లే.

కులమతాలు లేని సమాజం కోసం...

"ఇద్దరు మనుషులు కలిసి జీవించటానికి కులమతాలతో సంబంధం లేదు. ఒకరిపై ఒకరికి నమ్మకం, గౌరవం, ఇష్టం ఉంటే చాలు. అలాంటి భావాలు ఉన్న అవివాహిత యువతీ యువకులకు స్వాగతం!" అంటోంది ఆ మాట్రిమోని వెబ్‌సైట్. అయితే, వివాహం సెక్యులర్ రిజిస్టర్ పద్ధతిలోనే చేసుకుంటామన్న నిబంధన పాటించాల్సి ఉంటుంది. 'పెళ్లి చేయాలంటే అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూడాలి. కులపోళ్లే కావాలి. వాళ్ల కుటుంబాల్లో ఎక్కడా అన్యమతం మారిన దాఖలాలు ఉండకూడదు' వంటి ఆంక్షల మధ్య కులం, మతం ఊసు లేకుండా సెక్యులర్ పద్ధతిలో పెళ్లి సంబంధాలు చూసే ఈ వెబ్‌సైట్ ఎలా నడుస్తోందో చూద్దాం.

'సెక్యులర్ మాట్రిమోనీ' పేరుతో నడుస్తోన్న ఈ వెబ్‌సైట్‌కి మలయాళం ఫాలోవర్లు ఎక్కువగా ఉన్నారు. ఈ వెబ్‌సైట్ ఇటీవల ఇన్‌స్టా పేజీలో పోస్టు చేసిన ఓ పోస్టు బాగా పాపులర్ అయ్యింది. '40 ఏళ్ల క్రితం మా కుటుంబం కులం, మతం సంబంధం లేకుండా సెక్యులర్‌గా జీవిస్తోంది. నా జీవిత భాగస్వామి వ్యక్తిగతంగా ఏ మతానికి చెందినవారైనా పర్వాలేదు. నాతో, నా కుటుంబంతో మా భావాలతో ఏకీభవిస్తూ జీవిస్తే చాలు' అని పెళ్లి చేసుకోవాలనుకుంటున్న ఓ యువకుడు నింపిన ప్రొఫైల్ కాలమ్ వివరాలు ఆ పోస్టు సారాంశం.

వివాహ వ్యవస్థలో ఒకే కులం, ఒకే మతం పేరుతో పెద్ద వ్యవస్థ నడుస్తోంది. కులాంతర, మతాంతర వివాహాలకు అందులో చోటు చాలా తక్కువ. ఇలాంటి సమూహాల్లో 'సెక్యులర్ మ్యాట్రిమోనీ' నడపడం ఆషామాషీ కాదు. అయితే కేరళ లాంటి ప్రోగ్రెసివ్ రాష్ట్రంలో ఇది కాస్తంత సులువు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని నడిపిస్తోంది 35 ఏళ్ల మను మనుష్యజాతి అనే యువకుడు. తన వెబ్‌సైట్ నిర్వహణ గురించి అతని మాటల్లోనే తెలుసుకుందాం.

'ఈ మ్యాట్రిమోనీ ద్వారా కులం, మతం లేని వ్యక్తులంతా ఏకమవుతున్నారు. 90 శాతం వివాహాలు సెక్యులర్ పద్ధతిలోనే జరిగాయి. నేను కూడా ఈ వెబ్‌సైట్ ద్వారానే నా భాగస్వామి శివలీలని కలుసుకున్నాను. 38 ఏళ్ల అఫ్జల్ తన పార్టనర్ రష్నాని కూడా ఇక్కడే కలిశాడు. ముస్లిం కుటుంబానికి చెందిన అతడు తన సెక్యులర్ భావాలను సోషల్‌మీడియాలో షేర్ చేసుకున్నప్పుడు చాలా ఆరోపణలు ఎదుర్కొన్నాడు. ఎన్నో సైద్ధాంతిక ఘర్షణలు చోటుచేసుకున్నాయి. వాటిన్నింటితో విసుగుచెందిన అఫ్జల్‌ని మా



వెబ్‌సైట్ విపరీతంగా ఆకర్షించింది. అమ్మాయి మాత్రమే కాదు, ఆమె తల్లిదండ్రులు కూడా సెక్యులర్ భావాలు కలిగివుండాలన్న అతని ఆలోచనకు రష్నా సరిగ్గా సరిపోయింది' అని మను తన వెబ్‌సైట్ సక్సెస్ స్టోరీని చెబుతున్నారు.

అఫ్జల్ స్టోరీనే మన దేశంలో మొదటిది కాదు, చివరిదీ కాదు. 2011,-12 హ్యూమన్ డెవలప్‌మెంట్ సర్వే ప్రకారం దేశంలో పది శాతం కుటుంబాల్లో కులాంతర వివాహాలు జరిగాయి. 5 శాతం మంది మతాంతర వివాహాలకు మొగ్గుచూపారు. నామమాత్రంగా ఉన్న ఈ సంఖ్య ఇప్పుడు ఏ స్థాయిలో ఉందో తెలుసుకునేందుకు 'సెక్యులర్ మాట్రిమోనీ' ఉపయోగపడుతోంది. ఈ పేజీని ఇన్‌స్టాలో 57 వేల మంది అనుసరిస్తున్నారు. ఫేస్‌బుక్‌లో 64 వేల మంది వీక్షిస్తున్నారు. 32 వేల మందితో ఓ వాట్సాప్ గ్రూపు నడుస్తోంది. వీరిలో కేరళ వారే కాదు; ఉత్తరప్రదేశ్, గుజరాత్, కర్నాటక, తమిళనాడు నుండి కూడా ఉన్నారు. కుల మతాలకు అతీతమైన సమాజం ఆకాంక్షించే వారంతా ఈ వెబ్‌సైట్ ద్వారా తమ భావాలను పంచుకుంటున్నారు. పిల్లల పెంపకంపై కూడా ఇందులో చర్చిస్తారు. ప్రేమ, సారుప్యత, లింగ భేదం లేకుండా మాట్లాడుకునే వీరిలో ఎల్‌జిబిటీక్యూ కమ్యూనిటీ వ్యక్తులు కూడా భాగస్వామ్యం అవుతున్నారు. గణిత టీచర్ బాధ్యతల్లో ఉన్న మను 2022 నుండి ఈ మ్యాట్రిమోనీని నిర్వహిస్తున్నారు. వెబ్‌సైట్ ద్వారా 100 జంటలను ఏకం చేయాలన్న లక్ష్యం పెట్టుకున్న మను ఇప్పటి వరకు తనతో సహా 90 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు చెబుతున్నారు.

'చిన్న తనం నుండి దేవుని చుట్టూ నాకు అనేక ప్రశ్నలు ఉండేవి. ప్రేమకి, మతానికి సంబంధం ఏంటని చాలాసార్లు అనుకునేవాణ్ణి. 2014లో 'మథమిల్లథ జీవిథంగల్'(లైఫ్ విత్‌అవుట్ రిలీజియన్) పేరుతో ఫేస్‌బుక్‌లో ఓ పేజీ నిర్వహించాను. దాని స్ఫూర్తితోనే ఈ వెబ్‌సైట్ ఆలోచనకి బీజం పడింది. 'ఇద్దరు వ్యక్తులు కలిసి జీవించాలని భావించినప్పుడు కులం, మతం వారికి అడ్డుకాకూడదు. ఈ భావాలు యుక్త వయసుకు వచ్చిన పిల్లల్లోనే కాదు, పెద్దల్లో కూడా ఉన్నప్పుడే ఆ బంధాలు సజీవంగా ఉంటాయి. సమాజాన్ని కులమతాలకతీతంగా అభివృద్ధి చేయడంలో పిల్లలు, పెద్దలు ఒక్కతాటిపై నడవాలి' అంటున్నారు మను.

కాకర రసంతో ఆరోగ్యం

కాకరను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై మంచి ప్రభావాన్ని చూపుతుంది. మలబద్ధకం, కడుపు నొప్పి వంటి పేగు సంబంధిత వ్యాధులు రాకుండా కాపాడుతుంది. ప్రతి రోజూ ఉదయం పూట కాకర రసం తీసుకుంటే కలిగే ప్రయోజనాలు చూద్దాం.

- కాకర అధిక యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది. జీర్ణ ఎంజైములను ప్రేరేపించి, జీర్ణక్రియకు సహకరిస్తుంది. దీనిలో పీచు లక్షణాలు అధికంగా ఉండడం వల్ల తేలికగా జీర్ణమవుతుంది. ఆహారం అరుగుదలకు, మలబద్ధకం, అజీర్తి సమస్యల నివారణలో సహాయపడి శరీరంలో వ్యర్థాలను తొలగిస్తుంది.
- షుగర్‌తో బాధపడుతున్న వారికి మంచి మందులా పనిచేస్తుంది. రక్తంలో గ్లూకోజ్ విలువలను తగ్గిస్తుంది. రోజూ ఉదయం కాకర జ్యూస్ తీసుకోవడం వల్ల మీ డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు.
- విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక కణాలు, తెల్ల రక్త కణాలు పెంచడానికి సహాయపడుతుంది. కాకర ఆకులను నీటిలో ఉడికించి తీసుకోవడం వల్ల అంటు రోగాలు దరిచేరకుండా ఉంటాయి.
- కాకరలో ఉన్న యాంటీ మైక్రోబయల్, యాంటీ ఆక్సిడెంట్ కాలేయాన్ని శుభ్ర పరుస్తుంది. మూత్రాశయం పనితీరుకు సహాయపడుతుంది.
- కాకరలో లైకోపీన్, లిగ్నన్స్, కెరోటినాయిడ్లు ఉండి ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. శరీరంలో కణితులు ఏర్పడటాన్ని తగ్గిస్తుంది.
- పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం అధిక మొత్తంలో ఉండి గుండె పనితీరుపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి.
- దీనిలో ప్రోటీన్, జింక్, విటమిన్ సి జుట్టును ఆరోగ్యంగా, బలంగా ఉంచుతాయి.

కనుమ నాడు మినుము



సంక్రాంతి సెలవులు ఇవ్వగానే అమ్మా నాన్నతో కలసి అమ్మమ్మ ఇంటికి వచ్చారు శ్రీకాంత్, శ్రీవల్లి. పెరట్లో పిండి వంటలు చేస్తున్న అమ్మమ్మ దగ్గరికి వెళ్లి 'అమ్మమ్మా నాకు గారెలు చెయ్యి' అని గోముగా అడిగింది మనవరాలు శ్రీవల్లి. 'కనుమ నాడు గారెలు చేసుకుందాం. మూడురోజుల పండుగ కదా, భోగీ రోజున భోగి మంటల వేసుకుంటాము. పిల్లలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆరోజు సాయంత్రం భోగీ పళ్ళు (రేగు పళ్ళు) పోసుకుందాం. సంక్రాంతి రోజున పెద్దలకు మూలన బట్టలు పెడదాం. గంగిరెద్దుల వారికి, హరి దాసులకు ధాన్యం, ఫలాలు, విసనకర్ర, వస్త్రం, కాయగూరలు దానం చేద్దాం. మీరంతా గాలి పటాలు ఎగరేస్తారు కదా!' అని అమ్మమ్మ చెప్తూ ఉండగానే. 'ఆ మర్నాడు మేము మా ఇంటికి వెళ్ళిపోతామా అమ్మమ్మా?' అని అడిగింది శ్రీవల్లి.

మనవరాలు అలా అడిగేసరికి అమ్మమ్మ కళ్ళు చెమర్చాయి. 'ఆరోజు కనుమ పండుగ. కనుమ నాడు కాకి కూడా కదలదు' అని చెప్పింది అమ్మమ్మ. 'నిజమేనా అమ్మమ్మా?' అని అడిగాడు శ్రీకాంత్. 'అలా అనకపోతే మీరు ఉండరు కదా! అయినా అది ఒక నమ్మకం. రైతులు సంవత్సరమంతా కష్టపడతారు. సంక్రాంతికి పంట ఇంటికి వస్తుంది. శారీరకంగా మానసికంగా అలసి ఉంటారు. వారికి బలం చేకూరడం కోసం, ఆరోగ్యం కోసం 'కనుమ నాడు మినుము తినాలి' అనే నియమం పెట్టారు. ఆరోజు వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా ఉన్న పశువులను ముస్తాబు చేసి పూజించడం ఒక ఆనవాయితీ. ఈ మూడురోజులు చుట్టాలు, స్నేహితులు ఒక చోట చేరి ఆనందంగా గడుపుతారు. కాకులకు ఆహారం పెడతారు. అందువల్ల కాకులు ఆహారం కోసం ఊరు దాటవు.' అని వివరించింది అమ్మమ్మ.

'భలే భలే అమ్మమ్మ దగ్గర కూచుంటే ఎన్నెన్ని కథలో' అన్నారు మనవలు. 'అందుకేనర్రా పండుగలకు, పబ్బాలకు పల్లెకు వస్తూ పోతూ ఉండాలి' అంది అమ్మమ్మ.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

పల్లె పండుగ



నేలమ్మ ఇచ్చే పాడి పంటలు
అమ్మ చేసే పిండి వంటలు
గొబ్బెమ్మలతో అలంకారాలు
పిల్లా పాపలతో సంబరాలు!

భోగి మంటల భోగ భాగ్యాలు
పచ్చని పంటల సౌభాగ్యాలు
బొమ్మల కొలువుల వేడుకలు
చిన్నారుల ఆనంద డోలికలు!

గంగిరెద్దుల ఆడే ఆటలు
నింగిలో ఎగిరే గాలి పటాలు
వచ్చేను కొత్త అల్లుళ్లు
మూడు రోజుల సందళ్ళు!

పశుసంపదకు పూజలు
పాలి చెలకల్లో పొంగళ్ళు
కష్టజీవుల కళ్ళల్లో కాంతులు
పల్లెలన్నీ పసిడి పూబంతులు!

భోగ భాగ్యాలనిచ్చే భోగి పండుగ
సరదాల సంపదల సంక్రాంతి
కలిపి నిలిపేది కనుమ గౌరి!

– బి. పాండురంగ,
83412 12132.

నేను గీసిన బొమ్మ





టి.రక్షిత,
6వ తరగతి,
జెడ్‌పిహెచ్ఎస్,
ధూలిమిట్ట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఫైనల్‌కు కర్ణాటక

- సెమీస్‌లో హర్యానాపై ఐదు వికెట్ల తేడాతో గెలుపు
- విజయ్ హజారే వన్డే టోర్నీ



కర్ణాటకను ఫైనల్‌కు చేర్చిన స్మరణ్ రవిచంద్రన్(76 పరుగులు)

వడోధర: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్ ఫైనల్లోకి కర్ణాటక జట్టు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో కర్ణాటక జట్టు ఐదు వికెట్ల తేడాతో హర్యానాపై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన హర్యానా జట్టును కర్ణాటక బౌలర్లు కట్టడి చేశారు. దీంతో ఆ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 237పరుగులే చేసింది. కర్ణాటక బౌలర్లు అభిలాష్ శెట్టి(4/34), శ్రేయస్ గోపాల్(2/36), ప్రసిధ్ కృష్ణ(2/40) రాణించారు. దీంతో ఆ జట్టు 50ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 237పరుగులే చేసింది. హర్యానా బ్యాటర్లలో హిమాన్షు రాణా(44), కెప్టెన్ అంకిత్(48), రాహుల్ తెవాటియా(22), సుమిత్ కుమార్(21) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఛేదనలో కర్ణాటక ఓపెనర్, కెప్టెన్ మయాంక్ అగర్వాల్(0) డకౌటైనా.. దేవదత్ పడిక్కల్(86), స్మరణ్ రవిచంద్రన్(76) అర్ధసెంచరీలకి తోడు చివర్లో శ్రేయస్ గోపాల్(23; 20బంతుల్లో 3ఫోర్లు) మ్యాచ్‌ను ముగించాడు. దీంతో కర్ణాటక జట్టు 47.2ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 238పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. రెండో సెమీస్ విదర్భ-మహారాష్ట్రల మధ్య గురువారం జరగనుంది. జనవరి 18 శనివారం వడోధర వేదికగా సయ్యద్ ముస్తాక్ అలీ 2025 ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68